అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 11-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 312 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



సాగునీటి ప్రాజెక్టులు
పూర్తిచేస్తాం

ప్రతి గ్రామానికీ బీటీ రోడ్ల నిర్మాణం

పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి :
మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ - ఆత్మకూరు

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు సీఎం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్థాన దేవస్థానానికి రూ.110 కోట్లతో నిర్మించనున్న కారిడార్ రోడ్డు, ఘాట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. వారం క్రితం స్థానిక ఎమ్మెల్యేలకు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. సుమారు 900 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ దేవాలయానికి పేదల తిరుపతిగా పేరుగాంచిందని, ఈ పుణ్యక్షేత్రానికి ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. అయినా ఇక్కడ వసతుల కొరత ఉందని, అందుకే దేవాలయ అభివృద్ధితో పాటు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా స్థానిక ఎమ్మెల్యే సూచనలతో నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు.

వలసలకు మారుపేరుగా ఉన్న పాలమూరు జిల్లాలో కిలోమీటర్ల కొద్ది కృష్ణమ్మ ప్రవహిస్తున్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల, ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో ఇప్పటికీ ఇక్కడి ప్రజలు వలసలు వెళ్లడం దురదృష్టకరమన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న నెట్టెంపాడు, పాలమూరు, తదితర అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. మక్తల్, నారాయణపేట ప్రజలు సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని, ప్రాజెక్టులు పూర్తిచేసి కృష్ణానీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా సాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొందరు అభివృద్ధిని అడ్డుకోవడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, వారిని తన జిల్లా ప్రజలు క్షమించరని అన్నారు. ఒకవేళ అడ్డుకుంటే జిల్లా చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చెప్పారు. పాలమూరు జిల్లా నుంచి 2 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అమరరాజా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. బీటి రోడ్డు లేని గ్రామం, తండా రాష్ట్రంలో ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని అన్నారు. విద్యా వైద్యం, ఉపాధిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహతో ప్రతినెలా సమీక్ష చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రాజ నర్సింహ, ఎమ్మెల్యేలు జి మధుసూదన్ రెడ్డి, డా. వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ సుధాకర్ రెడ్డి, సీతా దయాకర్, మైనార్టీ కార్పొరేషన్ అధిపతి ఒబేదుల కొత్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర, జిల్లా ఎస్పీ జానకి, సంస్థానాదేశులు అధ్యక్షులు శ్రీరాం భూపాల్, ఆలయ చైర్మెన్ గౌని గోవర్ధన్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



టార్గెట్..

2021లో జరగాల్సిన జనగణన వచ్చే సంవత్సరం ప్రారంభం కావచ్చనే వార్తలు వస్తున్నాయి. అయితే దీనితో మరికొన్ని అంశాలు కూడా ముడిపడి ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణ తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపడతారు. ఆపై చట్టసభలలో మహిళలకు మూడో వంతు స్థానాలను రిజర్వ్ చేసేందుకు కసరత్తు జరుగుతుంది. ఇక చివరిగా జమిలి ఎన్నికలు. ఇందుకు రాజ్యాంగంలో పలు సవరణలు చేయాల్సి ఉంటుంది. అంటే 2029 వరకూ ప్రభుత్వ క్యాలండర్ బిజీ బిజీగా ఉంటుందన్న మాట. మిత్రపక్షాలతో పాటు ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి అభ్యంతరాలు వచ్చినప్పటికీ మోడీ ప్రభుత్వం తాను అనుకున్న విధంగానే ముందుకు సాగాలని నిర్ణయించుకుంది.

హిందూత్వ ఎజెండా అమలు దిశగా కేంద్రప్రభుత్వ క్యాలెండర్

- 2029 వరకూ సమాచార సేకరణే
- జనగణన, పునర్విభజన, మహిళా రిజర్వేషన్‌పై కసరత్తులు
- దీన్ని ఎన్‌ఆర్‌సీతో అనుసంధానం

న్యూఢిల్లీ : జనాభా లెక్కల సేకరణ కోసం రిజిస్ట్రార్ జనరల్-సెన్సస్ కమిషన్ కార్యాలయం ఇప్పటి వరకూ 31 ప్రశ్నలను రూపొందించింది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను 2020లోనే నవీకరించాల్సి ఉండగా కోవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ రిజిస్టర్‌లో ప్రజలకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తారు. అయితే దీనిని జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ)తో అనుసంధానం చేస్తారేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టాల్సి ఉంటుంది. 1951, 1961, 1971 సంవత్సరాలలో జనాభా లెక్కల సేకరణ జరిపిన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య 494, 522, 543కు పెరిగింది. అయితే పునర్విభజన ప్రక్రియను 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నిలిపివేశారు. అప్పటి నుండి పాతిక సంవత్సరాల పాటు ఆ ప్రక్రియే జరగలేదు. 2002లో ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దానిని మరో పాతిక సంవత్సరాలు పొడిగించారు. అంటే 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది.

పాత గాయం రేగుతుందా?

1971 జనాభా లెక్కల ఆధారంగానే ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాలు కొనసాగుతున్నాయి. 2001 జనగణన ఆధారంగా 2002లో పరిమిత స్థాయిలో పునర్విభజన చేపట్టారు. కానీ లోక్‌సభ స్థానాల సంఖ్యలో ఎలాంటి మార్పు జరగలేదు. 1971 నుండి ఇప్పటి వరకూ దేశ జనాభా రెట్టింపు అయింది. దాని ప్రకారం చూస్తే లోక్‌సభలో కనీసం 750 స్థానాలు ఉండాలి. 2025లో జనగణన చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 82ను సవరించాల్సి ఉంటుంది. అంతేకాదు...42వ, 84వ రాజ్యాంగ సవరణలను పున్షపరిశీలన జరపాలని న్యాయ నిపుణులు సూచించారు. ఇక్కడ ఓ చిక్కు సమస్య కూడా ఉంది. పునర్విభజన ప్రక్రియ పాత గాయాలను రేపే అవకాశం ఉంది. ఎందుకంటే దక్షిణాదితో పోలిస్తే ఉత్తర భారతదేశంలో నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. జనాభా నియంత్రణ పద్ధతులను పాటించి నష్టపోయామన్న అభిప్రాయం దక్షిణాదిన విన్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, స్టాలిన్ ఇప్పటికే మహిళలు అధిక సంతానాన్ని కనాలని సూచించారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 130కి పెరగవచ్చు. అదే సమయంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 16 స్థానాలు కోల్పోతాయి.

ప్రాంతీయ అసమానతల మాటేమిటి?

పునర్విభజనపై నిర్ణయం తీసుకునేందుకు ఓ కమిషన్ ఉంటుంది. అందులో అన్ని పార్టీల ప్రతినిధులు ఉంటారు. సభ్యుల సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. అదే ఫైనల్. దాని ఆదేశాలను కోర్టులో సవాలు చేయడానికి వీలు లేదు. అయితే ప్రాంతీయ అసమానతలపై చర్చ జరగకపోవచ్చునని కొందరు నిపుణులు పెదవి విరిచారు. తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది తెలియడం లేదు.

కులగణనకు పెరుగుతున్న డిమాండ్

1951 తర్వాత కేవలం ఎస్సీ, ఎస్టీల జనాభాను మాత్రమే లెక్కించారు తప్ప మిగిలిన కులాల సమాచారాన్ని సేకరించలేదు. అది కూడా చట్టసభలలో వారి స్థానాలను నిర్ణయించడానికే. ఈ నేపథ్యంలో సమగ్ర కులగణన జరపాలన్న డిమాండ్ పెరుగుతోంది. బీహార్‌లో ఇప్పటికే కులగణన జరగగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కూడా ఉంటున్నాయి. ఆ బాట పట్టిన కర్నాటకలో కులగణన జరిగినా ఆ సమాచారం ఇంకా విడుదల కాలేదు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టే విషయంలో ప్రభుత్వం ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. ఉప కులాల విషయంలో కూడా సందిగ్ధత కొనసాగుతోంది.

రాజ్యాంగ సవరణలు అవసరం



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయితే పార్లమెంటులో మహిళలకు కల్పించే రిజర్వేషన్లపై స్పష్టత వస్తుంది. 2029 సార్వత్రిక ఎన్నికలలో మహిళలకు కేటాయించే స్థానాలపై ప్రభుత్వం 2027-28లో ఓ నిర్ణయానికి రావచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక జమిలి ఎన్నికల విషయానికి వస్తే అది పునర్విభజన ప్రక్రియ కంటే సంక్లిష్టమైనది. ఎందుకంటే జమిలి ఎ న్నికలు జరపాలంటే ఐదు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అయితే అందుకు అవసరమైన సంఖ్యాబలం ప్రస్తుతం ప్రభుత్వానికి లేదు.

బాలికా విద్యకు అడ్డంకులు తొలగించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాలికల విద్యాభ్యాసానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్) మాజీ చైర్ పర్సన్ మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హా డిమాండ్ చేశారు. ఎం.వి.ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టాస్) ఆధ్వర్యంలో ' బాలికలకు స్వేచ్ఛ' అనే అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని సెస్ ఆడిటోరియంలో యువతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతాసిన్హా, ఆర్.వెంకటరెడ్డి తదితరులు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రారంభమైన ఎం.వి.ఫౌండేషన్ ఐదు జిల్లాల్లో కిశోర బాలికలతో గ్రూపులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ గ్రూపులు బాలికలు విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఎదురవుతున్న అనేక అడ్డంకులను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా సమస్య పరిష్కారం కోసం తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టాస్)ను ఏర్పాటు చేసి ఏడాది గడిచిందని తెలిపారు. బాలికలు విద్యను మధ్యలో మానేయడం, చదువుతున్న బాలికల్లోనూ రెగ్యులర్‌గా రాకపోవడం, దానికి గల కారణాలను తెలుసుకునే క్రమంలో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, సరైన బస్సు సదుపాయం లేకపోవడంగా గుర్తించిందని తెలిపారు. హైదరాబాద్, వికారాబాద్, గద్వాల, సూర్యాపేటతో పాటు మరో జిల్లాలో కిశోర బాలికల గ్రూపులు పని చేస్తున్నాయని తెలిపారు. మొత్తం 10 వేల మంది బాలికలతో టాస్ ఏర్పాటైందని చెప్పారు. కళ్యాణలక్ష్మి పేరుతో వివాహాలకు ప్రోత్సాహిస్తున్న సర్కారు చదువులకెందుకు ఇవ్వడం లేదని టాస్ ప్రశ్నిస్తున్నదని తెలిపారు. గతంతో పోలిస్తే కుటుంబాల్లో మార్పు వస్తున్నదనీ, ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా ప్రయివేటు బడులకు పంపించే తల్లిదండ్రుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఇక సమాజంలో, ప్రభుత్వంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాంకర్, నటి సుమ కనకాల, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు కె.జ్యోత్స్న శివారెడ్డి ఎదగడానికి తాము ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. టాస్ లక్ష్యసాధనకు కలిసి వస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ ఎస్సీఎఫ్ఆర్ లిండా వన్ డెర్ విజ్క్ తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు.

కార్యక్రమంలో ఐదు జిల్లాల నుంచి 200 మంది కిశోర బాలికలు పాల్గొనగా, వారి ప్రతినిధులు పలువురు తాము ఎదుర్కొంటున్న ...5లో

మెగసెసే అవార్డు గ్రహీత శాంతాసిన్హా



బుల్డోజర్ న్యాయం తగదు

పౌరుల గొంతుకలను బెదిరింపులతో అణచలేరు



ప్రజలకు భద్రత కల్పించేది ఆవాసాలే
వాటి కూల్చివేతలో చట్టప్రకారమే వ్యవహరించాలి
లేకుంటే ఆస్తి హక్కు మృతప్రాయమే :
యూపీ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : బుల్డోజర్ల ద్వారా న్యాయాన్ని అందించడం ఏ నాగరిక న్యాయ వ్యవస్థకూ తెలియని విషయమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చట్ట ప్రకారం అది ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఆస్తులను ధ్వంసం చేస్తామని బెదిరిస్తూ పౌరుల గొంతుకలను అణచివేయలేరని తెలిపింది. ఇలాంటి చర్యలను అనుమతిస్తే 300-ఏ కింద రాజ్యాంగం గుర్తించిన ఆస్తి హక్కు మృతప్రాయం అవుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం చెప్పింది. ఈ నెల 6వ తేదీన ఇచ్చిన ఆదేశాలలో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 2019లో రహదారి విస్తరణ పేరుతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ వ్యక్తి ఇంటిని కూల్చివేసింది. నోటీసు ఇవ్వకుండానే ప్రభుత్వం తన ఇంటిని ధ్వంసం చేసిందని ఆరోపిస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ...13లో

గ్రూప్-3 పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను టీజీపీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉండనుంది. ఈ పోస్టులకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం ...13లో

కార్ల కంటైనర్‌లో మంటలు

ఎనిమిది కార్లు దగ్ధం
ఎగిసిపడిన మంటలు..ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ-జహీరాబాద్

గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు కార్లను తీసుకెళ్తున్న ఓ కంటైనర్.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్‌రోడ్డు రంజోల్‌కు రాగానే భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎనిమిది కార్లు ...13లో

బీసీ డిక్లరేషన్‌తో
కాంగ్రెస్ వెన్నుపోటు

ప్రభుత్వంపై నమ్మకం లేదు
సర్వేపై ప్రజలు నిలదీస్తున్నారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

బీసీ డిక్లరేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు బలమైన వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) విమర్శించారు. ఆదివారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చీఫ్ విప్, జిల్లా అధ్యక్షులు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ ఇచ్చి ఏడాది పూర్తయినా ఒక్క అడుగు ముందుకు పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఓట్ల కోసమే కులగణన చేపట్టారని అన్నారు. దళితబంధు కాదు.. అంబేద్కర్ బంధుతో రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిన ...13లో

సర్వేలో సంచార జాతుల తొలగింపు

45వ కాలమ్‌లో ముందు చేర్చి..తర్వాత తీసివేత

రాష్ట్రంలో 52 సంచార కులాలకు తీవ్ర అన్యాయం
దశాబ్దాలుగా ప్రత్యేక గుర్తింపు నోచుకోని సంచార జాతులు
ప్రశ్నార్థకంలో కేంద్ర ప్రభుత్వ నిధులు..
సంచార, అర్ధ సంచార, డి నోటిఫైడ్ కాలం చేర్చాలని డిమాండ్

నవతెలంగాణ-నవీపేట్

దేశంలో సంచార జాతులకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉంది. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ అంశాల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కంటే సమాజంలో అత్యంత అధ్వాన స్థితిలో ఉన్న సంచార జాతుల పట్ల దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో కుటుంబ సమగ్ర సర్వే పేరిట బీసీ కులగణనకు అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. బీసీ కులగణనతో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలకు సంబంధించిన అంశాలు, సంచార, అర్ధ సంచార డీనోటిఫైడ్ కులాలకు సంబంధించి 45వ కాలమ్ ఏర్పాటు చేయడంపై సంచారజాతి కులాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ కులాలను సోషల్ మీడియా ద్వారా 45వ కాలమ్ గురించి వివరించి సంచార కులాల జాబితాలో చేర్చుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమాన్ని భవిష్యత్తులోనైనా పొందాలని ఆకాంక్షించుకున్నారు. కానీ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆ సంచార కులాల ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతూ 45వ కాలమ్‌ను తొలగించి కొత్త నమూనా దరఖాస్తును తయారు చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం ...13లో



ఎన్యూమరేటర్లకు ఇక్కట్లు

కుటుంబ సర్వే పట్ల ప్రజల్లో అనుమానాలు
తమ వివరాలు చెప్పేందుకు ఆసక్తి చూపని జనం
పలుచోట్ల ఎన్యూమరేటర్లపై దూషణలు, దాడులు

వివరాలు 13లో

ఐలాపూర్‌లో సమగ్ర సర్వే బహిష్కరణ 5లో..

తమ గ్రామ సమస్యలు పరిష్కరించాకే సర్వే..

క్రోని క్యాపిటలిస్టుల నుంచి జార్ఖండ్‌ను రక్షించండి

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ, అంబానీ వంటి కొద్దిమంది క్రోనీ క్యాపిటలిస్టుల నుంచి జార్ఖండ్‌కు విముక్తి కల్పించండి... ఇండియా కూటమి అభ్యర్థులను తాజా ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్ తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు కోరారు. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం రాంఘర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు.



చిత్తార్పూర్ సీ.డీ బ్లాక్ రాజరప్ప బహిరంగ సభలో పాల్గొన్న సందర్భంగా జార్ఖండ్ ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడారు. జార?ండ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ఏఐసీసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు . మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేసిన జోడో యాత్రతో దేశంలో ప్రజాస్వామిక శక్తులను ఏకం చేశారని గుర్తుచేశారు. ఆ సందర్భంగా రాహుల్ గాంధీ రెండు సందేశాలు ఈ దేశానికి ఇచ్చారని వివరించారు. విద్వేషాలను రగిలించే వారి చేతిలో ఈ దేశాన్ని పెట్టేందుకు మేము సిద్ధంగా లేము, విశాల భారతదేశంలో ప్రేమ అనే దుకాణం తెరిచి అన్ని జాతులు, మతాలకు సమాన అవకాశాలు ఇస్తామని సందేశం ఇచ్చారని తెలిపారు. అదే సందర్భంలో ఈ దేశంలోని వనరులు, సంపద, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశ ప్రజలకే చెందాలి తప్ప కొద్ది మంది క్రోనీ క్యాపిటలిస్టుల చేతిలో పెట్టేందుకు సిద్ధంగా లేమని సందేశం ఇచ్చారని తెలిపారు. అదాని, అంబానీ వంటి క్రోనీ క్యాపిటలిస్టులు ఈ దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పోరాటం చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే జార్ఖండ్ వనరులు రక్షించబడతాయని హామీ ఇచ్చారు. ఈ దేశ సంపద జనాభా నిష్పత్తికి అనుగుణంగా పంపిణీ జరగాలంటే రాజ్యాంగాన్ని రక్షించుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. అందుకు ఇండియా కూటమి అభ్యర్థుల ను గెలిపించడమే మన ముందు ఉన్న లక్ష్యం అని తెలిపారు. కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో జార్ఖండ్ రాష్ట్రాన్ని పెట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. చైతన్యం గల కాంగ్రెస్ కార్యకర్తలు జార్ఖండ్ రాష్ట్రాన్ని, ఇక్కడి వనరులను ఆ దోపిడీ దారుల నుండి కాపాడు కోవాల్సిందిగా పిలుపు నిచ్చారు. జార్ఖండ్ ప్రజలు డబ్బుకు లొంగి పోయే రకం కాదని వాళ్ళకి వివేచన, విచక్షణ ఉందనీ ఆ పరంపరను కాపాడాల్సిందిగా పిలుపు నిచ్చారు. బ్లాక్, గ్రామ కాంగ్రెస్, పోలింగ్ బూత్ అధ్యక్షులు సమావేశమై విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఇండియా కూటమి ఇస్తున్న హామీలు, మ్యానిఫెస్టోను ఓటర్లకు పెద్ద ఎత్తున వివరించాలనీ, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాంఘర్ అభ్యర్థి మమతా దేవిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సభలో ఏఐసీసీ నాయకులు గులాం అహమద్ మీర్, ఏఐసీసీ సెక్రటరీ సిరివెళ్ల ప్రసాద్, జార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ కేశవ్ కమలేష్ మహతో, షహనాజ్ అన్వర్ , మైనారిటీ సెల్ అధ్యక్షులు తారీక్ అన్వర్ ,షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనలో వ్యక్తిగత వివరాల గోప్యత అవసరం

- ప్రశ్నావళి నుంచి అనవసరమైనవి తొలగించాలి : కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఇంటింటి సర్వేలో భాగంగా సేకరిస్తున్న సమాచారంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఒక ప్రకటనలో కోరారు. కులగణన సర్వే మంచిదే అయినప్పటికీ కేవలం అందుకు సంబంధించిన అంశాలకే పరిమితం కావాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు హెచ్చుమీరి కోట్ల రూపాయలను సైబర్ నేరస్థులు గల్లంతు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కులగణన సందర్భంగా సేకరిస్తున్న సెల్ నెంబర్లు, బ్యాంక్ ఖాతాలు, ఆధార్ కార్డు తదితర వివరాలు సైబర్ నేరగాళ్ళ చేతికి చిక్కితే ఇబ్బంది అవుతున్నదని హెచ్చరించారు. అవసరం లేని వివరాలను ఈ సర్వేలో సేకరిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత గోప్యత పాటించాలని కోరారు. వాటిని బహిర్గత పర్చాల్సిన అవసరం లేదంటూ కోర్టులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కులగణనలో సేకరిస్తున్న ప్రశ్నలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

కులగణన, మహిళలకు నెలకు రూ.3 వేలు


- ఎంవీఏ ఎన్నికల మ్యానిఫెస్టో



ముంబై : మహారాష్ట్రలోని ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించింది. కులగణన, మహిళలకు నెలకు రూ.3 వేలు వంటి హామీలు ఇచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నాయకులు సుప్రియా సూలే ఇతర కూటమి నేతలు ఆదివారం ముంబైలో ఈ మ్యానిఫెస్టో విడుదల చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.3 వేలు ఆర్థిక సహాయం, ఒక్కో పేద కుటుంబానికి ఏడాదికి రూ.3 లక్షల ఆర్థిక ప్యాకేజీ, మహిళా సాధికారత, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 ధరకు ఆరు గ్యాస్ సిలిండర్లు, మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు, 9-16 ఏండ్లలోపు బాలికలకు ఉచిత సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్, మహిళలకు ప్రతినెలా రెండు రోజుల పీరియడ్ లీవ్ వంటి హామీలు ఇచ్చారు.

కాగా, మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలను నివారించేందుకు, ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు మెరుగైన పథకం కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీ, సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు రూ.50 వేలు ఆర్థిక ప్రోత్సాహకం, రైతులు పండించిన పంటలకు సరైన ధర, కేవలం ఫసల్ బీమా పథకం అమలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేలు పెన్షన్, విద్యార్థులకు స్కాలర్‌షిప్ పథకాలు, రాష్ట్ర ఆరోగ్య బీమా పాలసీ విస్తరణ, సామాజిక న్యాయం కింద కులగణన, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు వంటి హామీలను ఈ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఎంవిఎ ప్రభుత్వం ఏర్పడితే వంద రోజుల్లో ఈ హామీలను నెరవేర్చుతామని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 20న ఒకే విడతలో పోలింగ్ జరగనున్నది. 23న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

రైతు రుణమాఫీ మహారాష్ట్రలో బీజేపీ మ్యానిఫెస్టో విడుదల



మహాఎన్నికల్లో బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'సంకల్ప్ పత్ర' పేరుతో దీనిని విడుదల చేశారు. నైపుణ్య గణన, స్టార్టప్‌ల అభివృద్ధి కోసం శివాజీ మహారాజ్ కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్లు, వడ్డీ లేని రుణాలు అందిస్తామని తెలిపారు.

కీలక అంశాలివే..

1. యువతకు 25 లక్షల ఉద్యోగాలు
2. రాష్ట్రంలో మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల డిమాండ్, సరఫరాను అంచనా వేయడానికి సమగ్ర నైపుణ్య గణన
3. ప్రస్తుతం 11 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్న 'లఖపతి దీదీ' పథకాన్ని 50 లక్షల మంది మహిళలకు విస్తరించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం
4. రైతులు ఎరువులపై చెల్లించిన జీఎస్టీని తిరిగి చెల్లించి, వారి ఆర్థిక భారాన్ని తగ్గించడం
5. పారిశ్రామిక అభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు
6. రైతులకు రుణమాఫీ చేసి, వారిపై రుణ భారాన్ని తగ్గించడానికి చర్యలు
7. వృద్ధులకు అందించే నెలవారీ పెన్షన్‌ను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంచడం
8. నిత్యావసర వస్తువుల ధరలను స్థిరంగా ఉంచేందుకు చర్యలు

మనిషిని వికసింపచేసేదే నిజమైన విద్య

- మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మనిషిని బహిర్గతంగానూ, అంతర్గతంగానూ వికసింపచేసేదే నిజమైన విద్య అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (నవంబర్ 11) సందర్భంగా జరుపుకునే జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ దేశ విద్యారంగ బలోపేతానికి ఆయన అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. చదువు బానిసత్వం నుంచి, ఆత్మన్యూనత నుంచి మనిషిని విముక్తున్ని చేసి నిజమైన స్వేచ్ఛను ప్రసాదిస్తుందని మంత్రి సురేఖ అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్య జీవనోపాధిని కలిగించేది మాత్రమే కాదనీ, జీవిత పరమార్థాన్ని వెలికితీసేదని పేర్కొన్నారు. ఒక వ్యక్తిలో జ్ఞాన జ్యోతి నిత్యం జ్వలించినప్పుడే ఆ వ్యక్తి, తద్వారా సమాజం ఉన్నత శిఖరాలకు చేరుతుందని తెలిపారు. ఆర్జించిన జ్ఞానాన్ని ఇతరులకు బోధించడం ద్వారా సమాజ నిర్మాణంలో తమవంతు పాత్రను పోషించాలని మంత్రి సురేఖ యువతకు పిలుపునిచ్చారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్వీర్యమైన విద్యారంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం తీర్చిదిద్దుతున్నదని మంత్రి సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యారంగంలో ప్రమాణాలను పెంచడం, ప్రపంచంతో పోటీ పడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

విద్యార్థులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దేందుకుగాను నూతన క్రీడా పాలసీ త్వరలోనే రూపుదిద్దుకోనున్నదని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు తొలిరోజే యూనిఫాం, పుస్తకాల అందజేత, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, తెలంగాణ దర్శిని కార్యక్రమం వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యారంగ ప్రగతి పట్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

బీసీ గుర్తింపు కోల్పోతాం

- జీవో నెంబర్ 3ను సీఎం దృష్టికి తీసుకెళ్లండి : సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావుకు నాగవంశీయుల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

2014లో 25 ఇతర బీసీ సంఘాలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3ను జారీ చేసిందని తెలంగాణ నాగవంశీయుల వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. ఈ జీవో వల్ల తాము బీసీ గుర్తింపు కోల్పోతాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూగత సాంబశివ, ఉపాధ్యాక్షులు గరిక లక్ష్మణ్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

తాము బీసీలుగా గుర్తింపును కోల్పోవడమే కాకుండా తమ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు, స్కాలర్‌షిప్ వంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి పాత పద్ధతిలోనే బీసీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నిరుపేద విద్యార్థి శిగ గౌతమికి ఎన్‌డబ్ల్యూఏ ఆర్థికసాయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మోడల్ స్కూల్ నిరుపేద విద్యార్థిని శిగ గౌతమికి ఎన్‌డబ్ల్యూఏ సంస్థ ఆర్థిక సాయం చేసింది. నీట్ ఎగ్జామ్‌లో ఆమె గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ మంచిర్యాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. పేదరికంతో చదువుకునేందుకు ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు స్ఫూర్తి ఫౌండేషన్ దష్టికి తీసుకెళ్ళారు. ఆయన అమెరికాకు చెందిన ఎన్‌డబ్ల్యూఏ ఆశ్రయ దృష్టికి తీసుకెళ్లారు.ఆ సంస్థ వెంటనే స్పందించి రూ.93వేలతోపాటు రూ.14 వేల విలువ గలిగిన మొబైల్‌తోపాటు అవసరమైన పుస్తకాలు, స్టేషనరీని అందించింది. ఎంబీబీఎస్ పూర్తి అయ్యేవరకు అన్ని ఖర్చులూ తమ సంస్థ భరోసానిచ్చింది. బాలిక మూడేండ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. తాత, నానమ్మ సంరక్షణలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివింది. ఆ తర్వాత 6వతరగతి నుంచి12వ తరగతి వరకు తెలంగాణ మోడల్ స్కూల్, పసునూర్, సూర్యాపేట జిల్లాలో చదివింది. బైపీసీ గ్రూప్ తీసుకుని కష్టపడి చదివి కాలేజ్ (922/1000) టాపర్‌గా నిలిచింది.

ఉక్రెయిన్‌పై ట్రంప్ నుంచి 'సానుకూల సంకేతాలు

- రష్యా అధ్యక్ష భవనం వెల్లడి

మాస్కో : ఉక్రెయిన్‌పై అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ నుంచి 'సానుకూల సంకేతాలు' వస్తున్నాయని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. ఆదివారం ప్రభుత్వ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ హామీ గురించి పెస్కోవ్ మాట్లా డుతూ 'ట్రంప్ తన ప్రచారంలో ఇచ్చిన హామీలకు ఎంత వరకు కట్టుబడి ఉంటాడో అంచనా వేయడం కష్టం' అని అన్నారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 690 / 2024

BETWEEN:
Union Bank of India, (Erstwhile Andhra Bank) Benz Circle Branch, Vijayawada, rep by its Chief Manager ... **Applicant Bank**
AND :
Mr. Patti Papa Rao & an another. ... **Defendants**

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
Defendant 1 : Mr. Patti Papa Rao, S/o. Mahankala Rao, Flat No. 202, B-Block, Kalyan Kuteer Apartments, Bhavani Nagar, Uppal, Mallapur, RR District, Telangana - 500076.
And Also at : Mr. Patti Papa Rao, S/o. Mahankala Rao, Flat No. TF-2, C-Block, Sai Narasimha Nilayam, Sri Ramalingeswara Colony, Tadigadapa Donka Road, Yanamalakuduru, Penamaluru Mandal, Krishna District, Andhra Pradesh - 520007.
And Also at : Mr. Patti Papa Rao, S/o. Mahankala Rao, C/o. Chenic Information Network Technologies Pvt. Ltd., 303, Siri Sampada Hi-Tech, Phase-1, Kaveri Hills, Hyderabad - 500033
And Also at : Mr. Patti Papa Rao, S/o. Mahankala Rao, 302, West Block,Twin Towers, Simhapuri Colony, Hyderabad, Telangana -500043.
And Also at : Mr. Patti Papa Rao, S/o. Mahankala Rao, 20-342/7-1, CSR Nagar, Chilakalapudi Mandal, Machilipatnam - 521001.
Defendant 2 : Mrs. Patti Alekya, W/o. Patti Papa Rao, Plot No. 35, Sagar Society, Road No. 2, Banjara Hills, Hyderabad, Telangana - 500034.
And Also at : Mrs. Patti Alekya, W/o. Patti Papa Rao, Flat No. TF-2, C-Block, Sai Narasimha Nilayam, Sri Ramalingeswara Colony, Tadigadapa Donka Road, Yanamalakuduru, Penamaluru Mandal, Krishna District - 520007.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendant 1 & 2) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this tribunal at 10.30 am or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 26-11-2024** to answered the claim.
2) You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3) If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4) You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5) Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 1st day of November, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal, Visakhapatnam

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 433 / 2024

BETWEEN:
Union Bank of India, Gannavaram -1 Branch, Rep. by its Branch Manager, Krishna District. ... **Applicant Bank**
AND :
Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, D.No. 3-5-69, Shiva Nagar, Attapur, Hyderabad, Telangana State - 500048. ... **Defendants**

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
Defendant 1 : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, D.No. 3-5-69, Shiva Nagar, Attapur, Hyderabad, Telangana State - 500048.
And Also at : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, D.No. 5-85/2, Dattatreyanagar Colony, Near Rishs High School, Nagaram, Keesara Mandalam, Ranga Reddy District,, Telangana State.
And Also at : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, Designation : Sr. Associate, Employee No. 00005525, O/o. GMR Rajiv Gandhi International Airport, Shamshabad, Hyderabad, Telangana State.
And Also at : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, D.No. 8-13-7, Kattavari Street, Wynvhpet, Vijayawada, Krishna District, Andhra Pradesh - 520001
And Also at : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, Nearest D.No. 12-63, Plot No. 14, R.S.No. 220/3A1, 220/3A2, Flat No. FF-2, First Floor, SKS Enclave, Near Ibrahimpatnam Ring Center, Ibrahimpatnam, Vijayawada, Krishna District, AP
And Also at : Mr. Reddy Charla Yuvaraju, S/o. Late. Nagaraju, R.S.No. 220/3A1, 220/3A2, Flat No. FF-2, First Floor, SKS Enclave, Kanchikacherla, Krishna District, AP.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendant 1) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this tribunal at 10.30 am or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 26-11-2024** to answered the claim.
2) You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3) If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4) You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5) Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 1st day of November, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal, Visakhapatnam

ఎంత ఘాటు ప్రేమయో...!

- మోడీ పాలనలో గుజరాత్‌కు భారీగా పెట్టుబడులు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలిపోతున్న ప్రాజెక్టులు
- వ్యూహాత్మక తాయిలాలతో కంపెనీలకు వల



అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ తన స్వరాష్ట్రమైన గుజరాత్‌పై అమిత ప్రేమ కనబరుస్తున్నారు. అందులో తప్పేముందని అంటారా? ఇతర రాష్ట్రాలకు రావాల్సిన పెట్టుబడులను గుజరాత్‌కు తరలించుకుపోవడం ముమ్మాటికే తప్పే మరి. 2022లో అమెరికాకు చెందిన ఓ సెమీకండక్టర్ కంపెనీ తమిళనాడు రాజధాని చెన్నయ్‌లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపింది. దీనిపై చర్చించేందుకు కంపెనీ అధికారులు న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య మంత్రితో సమావేశమయ్యారు. ఆ భేటీ నుండి బయటికి రాగానే వారికి ఓ ఆశ్చర్యకరమైన దృశ్యం కన్పించింది. చెన్నయ్‌లో పెట్టుబడులను ఖరారు చేసుకోవడానికి ముందు ఆ అధికారులను గుజరాత్ తీసుకుపోయేందుకు ఓ హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచారు. చివరికి వారు చేసిందేమిటి? మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లోనే పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నారని తమిళనాడు మంత్రికి చెందిన సన్నిహితుడొకరు తెలిపారు.

నేతల ఆందోళన

హెలికాప్టర్ దౌత్యం మసాలా సినిమాను గుర్తుకు తెచ్చింది. ఇతర రాష్ట్రాలకు వచ్చే పెట్టుబడులను గుజరాత్ బాట పట్టించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇది ఓ ఉదాహరణ మాత్రమే. ఈ తంతు తరచుగా కొనసాగుతుండడంతో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.6,000 కోట్ల పెట్టుబడులు గుజరాత్‌కు తరలిపోయాయని లోక్‌సభ ఎన్నికలకు ముందు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. అనేక బహుళజాతి కంపెనీలను మోడీ తన రాష్ట్రానికి తరలించారని ఆయన మండిపడ్డారు. పెట్టుబడులను దారి మళ్లించాల్సిందిగా కంపెనీలపై ఒత్తిడి తెస్తున్నారని కర్నాటక ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు పదును పెట్టారు. ఇటీవల వడోదరలో ప్రారంభించిన టాటా-ఎయిర్‌బస్ ఫెసిలిటీ సహా అనేక ప్రధాన ప్రాజెక్టులను ఉద్దేశపూర్వకంగానే మహారాష్ట్ర నుండి తరలించారని వారు ఆరోపించారు.

దక్షిణాదికి మొండిచెయ్యి

మోడీ ప్రధాని అయినప్పటి నుండి తన స్వరాష్ట్రంపై అమిత ప్రేమను కనబరుస్తున్నారు. అనేక భారీ వ్యూహాత్మక ఈవెంట్లు గుజరాత్‌లోనే జరిగిపోతున్నాయి. సైనిక ఎగ్జిబిషన్ డెఫ్‌ఎక్స్‌పో ఇందుకు ఓ ఉదాహరణ. ఇలాంటి కార్యక్రమాలను ఆర్భాటంగా నిర్వహిస్తూ గుజరాత్ వెలిగిపోతుంటే ఇతర రాష్ట్రాలు చూస్తుండి పోవడం మినహా చేసేదేమీ లేకుండా పోతోంది. అహ్మదాబాద్ సమీపంలో రూ.6,770 కోట్ల పెట్టుబడితో సెమీకండక్టర్ అసెంబ్లీ-టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామని గత సంవత్సరం జూన్‌లో అమెరికాకు చెందిన మైక్రాన్ టెక్నాలజీ ప్రకటించింది. ప్రధాని మోడీ అమెరికా పర్యటన సమయంలో ఈ ప్రకటన వెలువడింది. గుజరాత్‌ను పెట్టుబడులకు కేంద్రంగా చూపేందుకు అక్కడ ఆయన ఎంతగానో ప్రయత్నించారు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను కూడా మైక్రాన్ పరిశీలించినప్పటికీ చివరికి గుజరాత్‌నే ఎంచుకుంది.

ఇవే ఎత్తుగడలు

భారీ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించేందుకు మోడీ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తోంది. కంపెనీలకు పెద్ద ఎత్తున మూలధనపు సబ్సిడీలు ఇవ్వడం, దిగుమతి సుంకాలు తగ్గిస్తామని హామీ ఇవ్వడం, ఉత్పత్తి చేసిన వస్తువులకు ఆర్డర్ ఇస్తామని నమ్మించడం, పెట్టుబడులకు కేంద్రాలుగా ధోలేరా, గిఫ్ట్ సిటీని ముందుకు తేవడం వంటి వ్యూహాలతో పెట్టుబడిదారులను వలలో వేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. అంతేకాదు...ఇతర రాష్ట్రాల ప్రతిపాదనలను బుట్టదాఖలా చేసి భారీ కేంద్ర ప్రాజెక్టులను ఏకపక్షంగా గుజరాత్‌లో ప్రారంభిస్తోంది.



అదానీ ప్రాజెక్టుపై వ్యతిరేకత

రాజస్థాన్ జైసల్మేర్‌లో ఆందోళనలు



జైపూర్ : ఇటీవలి కాలంలో పశ్చిమ రాజస్థాన్‌లో చేపట్టిన పలు పునరుద్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. తాజాగా జైసాల్మర్‌లో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ చేపట్టిన 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ వివాదంలో చిక్కుకుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అదానీ కంపెనీకి ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బయా గ్రామ ప్రజలు గత నెలలో ఓ తీర్మానాన్ని ఆమోదించారు. దానిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాలకు పంపారు. ఈ ప్రాజెక్ట్ కోసం బుధవారం స్విచ్‌యార్డ్ ఏర్పాటుకు జరిగిన ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కంపెనీ సేకరించిన ప్రైవేటు భూమిలో స్విచ్‌యార్డ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇందుకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఆ స్థలం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని కూడా అదానీ కంపెనీకి కట్టబెడతారేమోనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్విచ్‌యార్డ్ ఏర్పాటును అడ్డుకునేందుకు ప్రయత్నించిన 14 మంది స్థానికులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల నిరసన రాజకీయ రంగు పులుముకుంది. ఎమ్మెల్యే రవీంద్ర సింగ్ భాటీ ధర్నాకు దిగారు. ఆందోళనకారులను విడుదల చేసే వరకూ ధర్నాను విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు వారిని విడుదల చేశారు. ఈ ప్రాంతంలోని వృక్ష జాతులను కాపాడుకునేందుకు తమ పూర్వీకులు సంవత్సరాల తరబడి జీవితాలను త్యాగం చేశారని, ఇప్పుడు ప్రైవేటు కంపెనీలు బయా గ్రామంలో బలవంతంగా పనులు మొదలు పెట్టాయని, దేవాలయాల పరిసరాలలో ఉన్న చెట్లను నరికేస్తున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కాగా ప్రైవేటు స్థలం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని రక్షిత ప్రాంతంగా గుర్తించాలని స్థానికులు డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని, తమ దేవాలయాలను కాపాడుతున్న ప్రభుత్వ భూమిని అదానీకి కట్టబెట్టవద్దన్నది ప్రజల ప్రధాన డిమాండ్. ఆ ప్రభుత్వ భూమిలో పలు దేవాలయాలు ఉన్నాయి. అక్కడ పండుగల సందర్భంగా ఉత్సవాలు జరుగుతుంటాయి. ప్రభుత్వం దీనిని రక్షిత ప్రాంతంగా గుర్తించి, రెవెన్యూ రికార్డులలో మార్పులు చేసే వరకూ ఆందోళన ఆపబోమని గ్రామస్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమిని సౌర, పవన ప్రాజెక్టుల కోసం అప్పగిస్తే స్థానికులు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతారని జైసాల్మర్ ఎమ్మెల్యే చోటూ సింగ్ సెప్టెంబరులో శాసనసభలో ప్రస్తావించారు.

విస్తృత ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విస్తృత ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభలు రెండో రోజు ఆదివారం ఉత్సాహభరితమైన వాతావరణంలో కొనసాగాయి. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గులాం దస్తగిరి ఆవిష్కరించారు. అనంతరం పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకులు అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో భారత రాజ్యాంగం, మనుధర్మ శాస్త్రం మధ్య పెద్ద చర్చ జరుగుతోందని, ఈ రెండింటి మధ్య ప్రజలు ఎటువైపు ఉండాలో తేల్చుకోలేని పరిస్థితికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. మతం, కులం, ప్రాంతం, జాతి లాంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాబోయే మూడేండ్లలో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను ఈ మహాసభలో రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా పరిస్థితులకు అనుగుణంగా కర్తవ్యాలు రూపొందించుకోవాలన్నారు. ఈ మహాసభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు కోట సతీష్‌కుమార్, ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు సూర్యదేవర సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, దుర్గం అనిత, చాపెలె సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేదల జోలికొస్తే.. ఎర్ర జెండానే ఎగురుతుంది

పెద్దలను వదిలి పేదలను ఇబ్బంది పెట్టడమా..!



- ఏ ప్రభుత్వం వచ్చినా రాష్ట్రం అప్పుల కుప్పేనా..?
- మూసీలో కలిసేది ఫార్మా కాలుష్యమే..
- బీజేపీ విషబీజాలను సామాజిక శక్తులు అడ్డుకోవాలి
- కమ్యూనిస్టులు లేకుండా దేశానికి భవిష్యత్తు లేదు :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- వీపనగండ్లలో సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా 3వ మహాసభలు

నవతెలంగాణ మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ వనపర్తి

ప్రపంచంలో ఏ దేశంలోనైనా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు.. పేదల జోలికొచ్చినా, ఇబ్బందులకు గురిచేసినా, ధరల భారం మోపినా అక్కడి ప్రజలకు గుర్తుకొచ్చేది కేవలం ఎర్రజెండా మాత్రమేనని.. తర్వాత కాలంలో అక్కడ ఎర్రజెండానే ఎగురుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో నరసింహనగర్ ప్రాంగణంలో సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా 3వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమైనా, నేటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదలకు నష్టం కలిగించే కార్యక్రమాలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని మిత్రపక్షాల సూచన మేరకే ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ప్రతి పథకం అమలులో వారి సహకారం తీసుకుంటామని గతంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. కానీ పది నెలలు గడిచినా రాష్ట్ర చిహ్నం, గేయం విషయంలో తప్ప ఏ విషయంలోనూ ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలు తీసుకోలేదని చెప్పారు. అప్పులు చేయడంలో ఉన్న శ్రద్ధ పేదల సమస్యలను పరిష్కరించడంలో ఏ ప్రభుత్వాలకు ఉండదని, కేవలం కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే అది కనిపిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో దాదాపు 400కు పైగా హామీలు ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలయినా అప్పులు చేస్తూ హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేద ప్రజలను కోలుకోలేని దెబ్బ కొడుతోందని, దీన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ సరిహద్దు ప్రాంతాల్లో పోలియోను తరిమేందుకు ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని సీఎం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదలకు మంచి చేస్తామంటే సీపీఐ(ఎం) ఎప్పుడు సహకరిస్తుందని, కానీ ఉన్న ఆస్తులను, ఆర్థిక నష్టానికి పాల్పడతామంటే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మూసీ బాధితులందరికీ ముందు ప్రత్యామ్నాయం చూపి ఆతర్వాతే ప్రక్షాళన చేయాలని హితవు పలికారు.

నాడు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. వాటి అమలు కోసం సీపీఐ(ఎం) పోరాటం చేయక తప్పదని పిలుపునిచ్చారు. ఇల్లు కూల్చడం కాదు కట్టడమే గొప్ప అని, ఇండ్ల నిర్మాణానికి నాలా, రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ తదితర అన్ని అనుమతులు ఇచ్చినా అధికార యంత్రాంగాన్ని శిక్షిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుందరీకరణ వేరు, ప్రక్షాళన వేరని, మూసీ నదిలో కలుస్తున్నది వందలాది ఫార్మా కంపెనీల కాలుష్యమని, ముందు వాటిని శుద్ధి చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించారు. ఏ జిల్లాకెళ్ళిన ఆ జిల్లా పరిధిలోని దేవుళ్లపై ఒట్టేసిన సీఎం రేవంత్ రెడ్డి, రైతులకు రుణమాఫీ చేయడానికి, రైతు భరోసా ఇవ్వడానికి ఆలస్యం ఎందుకు అవుతుందో సీఎం చెప్పాలని నిలదీశారు. 'ముందు ఖాళీ చేయండి.. సుందరీకరణ చేసి ఇస్తాం' అంటున్న పాలకుల మాటలు ఎలా నమ్మాలని, 70ఏండ్ల క్రితం నిర్మించిన నాగార్జున సాగర్ బాధితులు నేటికీ అసెంబ్లీ చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. రామగుండం నిర్మాణం పేరుతో 12 లక్షల చెట్లను నరికే యత్నాన్ని ఆపకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దేశంలో కుల, మతాల పేరుతో విషం చిమ్ముతున్న బీజేపీ ప్రభుత్వాన్ని సామాజిక శక్తులు, కమ్యూనిస్టులు, మేధావులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అందుకోసం ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, టి. సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్రాములు, భూపాల్, నాయకులు కిల్లె గోపాల్, సీనియర్ నాయకులు ఆర్ రాంరెడ్డి, భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్ రెడ్డి, లక్ష్మి, మేకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా ఏ. రాములు

నవతెలంగాణ-జడ్చర్ల



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని భవానీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా 20వ మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా ఏ. రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన మహాసభల్లో 16మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. వారిలో జిల్లా కార్యదర్శిగా ఏ. రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కిల్లె గోపాల్, ఎస్ కురుమూర్తి, కురుమయ్య, వి పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా పి. జగన్, బి. చంద్రకాంత్, ఎం. దీప్లా నాయక్, రవికుమార్, కురుమూర్తి, జి. నరసింహులు, జి. రాజ్ కుమార్, ఏ. లక్ష్మయ్య, కే. మోహన్, బి. వేణుగోపాల్, కే. ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

ఆరునెలల్లో ఇండ్ల స్థలాలివ్వాలి



- సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలి..డీజేహెచ్ఎస్
- ఫ్యూచర్ సిటీకి తరలిన జర్నలిస్టులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీకి జర్నలిస్టులు ఆదివారం తరలి వెళ్లారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇండ్ల స్థలాలు, వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలపై వారు చర్చించారు. అనంతరం జరిగిన సభలో డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఆరు నెలల్లోగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు నాలుగో సిటీగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఈ ప్రాంతం జంట నగరాలను మించిపోనున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే అమెజాన్ డేటా సెంటర్ రాగా, స్కిల్ యూనివర్సిటీ, వరల్డ్ ట్రేడ్ సెంటర్ రాబోతున్నాయన్నారు.

నెట్ జీరో వల్ల కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు ధీటుగా ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని చెప్పారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఈ ప్రాంతంలో ఇస్తామన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు మార్గం కూడా రానున్నందున ప్రయోజనం ఉంటుందన్నారు.

ఇండ్ల స్థలా ల విషయంలో జర్నలిస్టులంతా ఐకమత్యం తో ఉండాలని కోరారు. ప్రభుత్వం సానుకూ లంగా ఉన్నందున దాన్ని సాధించుకు నేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండ రామకృష్ణ దేగ కుమార్, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో దొంగతనాలు.. దోపిడీలు

- గుడులు, ఇండ్లు టార్గెట్
- నానాటికీ పెరుగుతున్న కేసులు
- మూడేండ్లలో 501 ఆలయాల్లో చోరీలు
- దాదాపు రూ.5 కోట్ల వరకు నష్టం
- ఆరేండ్లలో దాదాపు 21వేల దొంగతనాలు
- 5428 దోపిడీ కేసులు నమోదు
- ప్రభుత్వం, ఎన్సీఆర్బీ సమాచారం
- బీజేపీ పాలనలో ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు





రాష్ట్రంలో ప్రజల భద్రత ప్రశ్నార్థకం

అహ్మదాబాద్ : ప్రజలు, గుడుల రక్షణలో భాగంగా శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పుకొనే బీజేపీ.. తాను అధికారంలో ఉన్న గుజరాత్‌లో తేలిపోయింది. ఆ పార్టీ వల్లె వేసే వ్యాఖ్యలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయి. ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో దొంగతనాలు, దోపిడీలు ఇటు పాలక యంత్రాంగానికి, అటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాష్ట్రంలో గుడులు, ఇండ్లను లక్ష్యంగా చేసుకుంటూ దొంగలు రెచ్చిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న ఇలాంటి కేసులు.. ప్రజల భద్రతను సవాలుగా మార్చాయి.

2020-23 మధ్య మూడేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గుడుల నుంచి మొత్తం రూ.4.93 కోట్ల నగదు, విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆరేండ్లలో దాదాపు 21 వేల దొంగతనాలు, ఐదు వేలకు పైగా దోపిడీ ఘటనలు నమోదయ్యాయి. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించిన ఈ సమాచారం.. రాష్ట్రంలో ప్రజలు, గుడుల భద్రత పట్ల ఆందోళనను కలిగిస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం.. గుజరాత్‌లో 501 గుడుల్లో దొంగతనం కేసులు నమోదయ్యాయి. 2020-21లో 151 గుడులు(రూ.85.47 లక్షలు), 2021-22లో 178 (రూ.1.9 కోట్లు), 2022-23లో 172 గుడుల(రూ.2.17 కోట్ల మొత్తంలో చోరీ)ను దొంగలు టార్గెట్ చేశారు. అదనంగా, గుడుల్లో ఐదు సాయుధ దొంగతనాలు కూడా జరిగాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా గుడుల భద్రతకు సంబంధించి ఆందోళనలను కలిగిస్తున్నది.

ఓట్ల కోసమే దేవుడి పేరుతో ప్రచారాలా? : కాంగ్రెస్

ఆలయాల్లో చోరీ కేసులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ విమర్శించింది. గుజరాతీలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవాలయాల్లో దోపిడీ, దొంగతనాలు.. హోం డిపార్ట్‌మెంట్ చేసిన సీసీటీవీ ఏర్పాట్ల వాగ్దానాల కంటే కొంచెం ఎక్కువగానే ఉన్నాయని గుజరాత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి హీరెన్ బాంకర్ అన్నారు. "కేవలం ఓట్ల కోసమే బీజేపీ దేవుడి పేరు మీద ప్రచారం చేస్తుందా? నవరాత్రుల సందర్భంగానూ మహిళలపై దాడులు జరిగాయి. మాదక ద్రవ్యాల వంటి అక్రమ వ్యాపారం బహిరంగంగానే జరిగింది. వాస్తవానికి, రాష్ట్ర పోలీసు తీవ్ర సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నది. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది సంఖ్య.. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నది" అని హీరెన్ బాంకర్ ఆందోళన వ్యక్తం చేశారు.


పెరిగిన రాత్రిపూట దొంగతనాలు

రాష్ట్రంలో ప్రయివేటు నివాస గృహాలను టార్గెట్‌గా చేసుకుంటూ దొంగలు రెచ్చిపోతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) సమాచారం ప్రకారం.. గుజరాత్‌లో ఇటీవలి కాలంలో ఇండ్లలో జరిగే దోపిడీలు, దొంగతనాలు ఎక్కువయ్యాయి.

అయితే, ఈ పరిస్థితి నేరాల నివారణలో నిరంతర సవాళ్లను నొక్కి చెప్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. పగటితో పోలిస్తే రాత్రిపూట జరిగే దొంగతనాలు ఎక్కువయ్యాయి. 2017లో, గుజరాత్‌లో రాత్రి సమయాల్లో 3,957 దొంగతనాలు నమోదు కాగా.. 2022 నాటికి అది కొద్దిగా తగ్గి 2,936కి పడిపోయింది.

అలాగే, పగటిపూట దొంగతనాలు కూడా 440 నుంచి 359కి తగ్గిపోయాయి. ఒక లక్ష మంది జనాభాకు దొంగతనం రేటు 2017లో 6.9గా ఉండగా.. 2020 నాటికి అది 3.9కి పడిపోయింది. ఆ తర్వాత 2022లో అది 4.6కు పెరిగింది. 2020లో 498గా ఉన్న దోపిడీ కేసుల సంఖ్య 2022 నాటికి 575కి పెరిగాయి. 2017-2022 మధ్య ఆరేండ్ల కాలంలో గుజరాత్ రాష్ట్రంలో మొత్తం 18,453 రాత్రిపూట, 2489 పగటిపూట దొంగతనాలు, 5428 దోపిడీ కేసులు నమోదయ్యాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా దొంగలు, దొంగతనాల నుంచి ప్రజల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నది.

ప్రజాకవి, మార్క్సిస్టు పరిశోధక భావుకుడు ఆరుద్ర



ఆరుద్రతో పోల్చదగిన బహుముఖ ప్రతిభావంతులు చాలా చాలా అరుదుగా వుంటారు. కవి రచయిత, సినిమారంగ ప్రముఖుడు, కాలమిస్టు, చరిత్ర సాహిత్య పరిశోధకుడు, నృత్య కళాశాలలో బోధకుడు, చదరంగంలో ఇంద్రజాలంలో పుస్తకాలు రాసేంత ప్రజ్ఞాశాలి, నలుగైదు భాషలు తెలిసిన వారు, అభ్యుదయ సాహిత్యోద్యమ నాయకుడు ఈ జాబితాలకు అంతులేదు. అయితే వీటన్నిటికీ ఆధారభూతంగా ఆయన పెట్టుకున్న ప్రామాణిక నిర్దేశం మార్క్సిజమే. సమగ్రమైన ఆ శాస్త్రీయ దృక్పథమే ఆయన ప్రతిభకు ప్రత్యేకత సంతరించిపెట్టింది.



తెలకపల్లి రవి

విశాఖపట్నంలో 1925 ఆగష్టు 31న పుట్టిన ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అని అందరికీ తెలుసు. అనేక కలం పేర్లను వాడుతూ చివరకు ఆరుద్రగా స్థిరపడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే. అసలు చదువంతా పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ గాక గ్రంథాలయాల్లోనే జరిగిందని ఆయన స్వయంగా చెప్పుకున్నారు. తండ్రి నరసింగరావు సాహిత్యాభిలాషి కావడంతో కనిపించిన పుస్తకమల్లా తెచ్చేవాడు. వాటిని కుర్ర ఆరుద్ర ఎప్పటికప్పుడు చదువుతుండేవాడు. మేనమామ మహాకవి శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూములో పుస్తకాలన్నీ తాను చదివేసి ఆరుద్రతోనూ చదివించాడు. ఆ విధంగా 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు ఆయనలో సాహిత్య ప్రతిభకు పదును పెట్టారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధోగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు. 1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. తిండి కొరతను నివారించేందుకు దొంగనిల్వలు వెలికి తీసేందుకు ఉద్యమించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ రష్యాపై దాడి చేశాక అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకై ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. ఆనందవాణి పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత మద్రాసులో స్థిరపడి సృజన, పరిశోధన సాగించారు. 1955 ఏప్రిల్‌లో దర్శక దిగ్గజం హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా అరవై రూపాయల ఖర్చుతో జర్నలిస్టు రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు. ఆమె కమ్యూనిస్టు కాకున్నా దంపతులిద్దరూ హేతువాద భావాలనే కొనసాగించారు.

ఆది నుంచి అభ్యుదయ ప్రస్థానం

భావ కవిత్వంతోనో సంప్రదాయ వాదంతోనో బయలుదేరిన కొందరిలా గాక ఆరుద్ర అభ్యుదయ కవిగానే ప్రస్థానం ప్రారంభించారు. కవిత్వంలో టెక్నిక్కు ప్రయోగాలకూ ఆధునికతకూ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. శ్రీశ్రీ మార్క్సిజాన్ని 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అంటూ కవితాత్మకంగా చెబితే ఆరుద్ర 'పైథాగరస్ తీరం చేరుస్తుంది' అంటూ ఎసి స్క్వయర్ బిసి స్క్వయర్ భాషలో మలచడానికి ప్రయత్నించారు. గాయాలూ గేయాలూ, సాహిత్యోపనిషత్, (ఛందస్సు లేని) ఇంటింటి పద్యాలు, కూనలమ్మ పదాలు, సినీ వాలి, పైలా పచ్చీసు, అమెరికా ఇంటింటి పజ్యాలు తదితర రచనలను పరిచయం చేశారు. నాట్యశాస్త్రంలోని హస్త ముద్ర లక్షణ పదాలు మరో ప్రత్యేక రచన. ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు ఆయన మరణానంతరం వెలువడ్డాయి. జీవితపు చివరి దశలో మొదలు పెట్టిన మనిషీ–ఆడమనిషి కావ్యంలోని ఒక భాగం 'స్త్రీ పురాణం' మహిళా కోణాన్ని ఆవిష్కరించింది. తను రాయని సినీవాలి అనే కావ్యం రాసినట్టు ఎవరో పొరబాటున పేర్కొంటే దాన్ని నిజం చేయడానికి ఆ కావ్యం రాశారు (సినీ వాలి అంటే అమావాస్యనాడు కనిపించీ కనిపించని చంద్రరేఖ.). ఇంటింటి పజ్యాలు, కేరా శతకము వంటివి కూడా అలవోకగా చేసిన ప్రయోగాలే, కూనలమ్మ పదాలు వందల మందిని కవులను చేశాయంటారు. ఆరుద్ర రాసిన కవిత్వంలో వచన కవిత్వం పాలే ఎక్కువ. అనువాద కావ్యాలు. దృశ్య కావ్యాలను అనేకం అందించారు.. కథా సాహిత్యంతో పాటు కథా రచన టెక్నిక్‌ల పైనా చక్కగా రాశారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంపై హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలను తెలుగులోకి అనువదించగా సుందరయ్య గారి పుస్తకంలో ప్రచురించారు.

కొండగాలి తిరిగింది

సినిమా కవిగానూ ఆరుద్ర జనరంజక గీతాలు అనేకం రాశారు. కొండగాలి తిరిగింది పేరిట వచ్చిన సినిమా పాటలు ఆయన పట్టును చెబుతాయి. రాజులు ఎక్కు అంబారీపై అందరు ఎక్కుట తప్పు కదా అంటే. రోజులు మారి రాజులు పోయిరి.. ప్రజలే ప్రభువులు ఈనాడు..మనుషులు పైన సవారి కన్నా ఏనుగు సవారి నయం కదా అంటూ రాస్తారు. ఎదగడానికెందుకురా తొందర పాటలో నిరుద్యోగాన్ని వివరిస్తారు. గాంధి పుట్టిన దేశమా ఇది అంటూ ప్రశ్నిస్తారు. చరిత్ర రచనలోనే గాక, వేదంలా ప్రవహించే గోదావరి, మహాబలిపురం వంటి పాటలు వింటే రాగం చరిత్ర అల్లుకు పోవడం చూస్తాం. కొట్టుకుని పోయే కొన్ని కోటి లింగాలు వీరేశలింగమొకడు నిలిచెను చాలు అన్న ఆయన మాటలు సుభాషితాల్లా నిలిచిపోయాయి. రగిలింది విప్లవాగ్ని ఈ రోజు అంటూ అల్లూరి సీతారామరాజుకు రాసిన పాట కూడా గొప్పగా వుంటుంది సినిమా పాటల తీరు మారి విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా వాటిని రాయడం విరమించుకున్నారు. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాలుగు వేలకు పైగా పాటలు రాశారు.

మహా పరిశోధకుడు

మార్క్సిస్టు దృక్పథంతో పరిశోధన, అధ్యయనం చేసిన ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం అంతటికీ తలమానికమైంది. సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి తాను ఈ మహా భారం వేసుకున్నానని వినయంగా చెబుతూ వచ్చిన ఆయన వాస్తవంలో పండితులకు కూడా గొప్ప వనరు సమకూర్చారు. దాన్ని రాసే సమయంలో తీరిక లేకపోవడం వల్లనే గడ్డం చేసుకోవడం మానేసి పెంచేశానని సరదాగా చెబుతుండేవారు. వేమన వేదం (1974), మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురు పీఠం, సంపుటాలు ప్రజాశక్తిలో వారం వారం రాసిన వ్యాసాలతో వెలువడిన ప్రజా కళలూ–ప్రగతివాదులూ ఆయన ప్రజ్ఞకు ప్రతిబింబాలుగా నిలిచివున్నాయి. 'రాముడికి సీత ఏమవుతుంది?', 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఆరుద్ర పరిశోధనా పటిమకూ నిదర్శనాలు. కళలు, క్రీడలు, ఇంద్రజాలం వంటి అంశాలపై కూడా సాధికార గ్రంథాలు వెలువరించారు. నాట్య శాస్త్రంలో గొప్ప అవగాహన గల ఆయన చెన్నైలో ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉపన్యాసకుడుగా వున్నారు. దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలలోనూ ఆయన ప్రసంగాలు చేయగా ఆయనపై అరడజను పైగా పరిశోధనలు జరగడం మరో విశేషం.

శ్రీశ్రీ, ఆరుద్ర

రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజాన్ని ఓడించాలంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరుదాకా అదే బాటలో సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందుకోవడంలో తాము పొరబడి వుండొచ్చని నిస్సంకోచంగా, వినయంగా చాలాసార్లు చెప్పారాయన. 1955లో ప్రగతిశీల శిబిరంలో ప్రగతి నిరోధక స్వరాలు వినిపించినపుడు ఆయనను కూడా అటువైపు చేర్చారు గాని నిజం కాదని చాలా సార్లు సోదాహరణంగా చెప్పడానికి ప్రయత్నించాడాయన. శ్రీశ్రీ కన్నా 14 ఏళ్లు చిన్నవాడయినా అవగాహన పెంచుకుంటూ సమకాలీన బృందంతోనే నడవడం ఆయన ప్రతిభకూ పట్టుదలకూ అద్దం పడుతుంది. అతి సన్నిహితులైన వారి మధ్య తేడాలను రాజకీయం చేయవలసిన అగత్యమే లేదు. శ్రీశ్రీ, ఆరుద్రలు అభ్యుదయ లోకంలో గొప్ప ప్రభావం చూపిన ఇద్దరు ఉద్దండులుగా ఎప్పటికీ మిగిలి వుంటారు. ఈ వ్యాస రచయిత శ్రీశ్రీ 'అనంతం'పైన సమీక్ష రాశాక ఆరుద్ర అభినందనలు రాస్తూ 'ప్రముఖ సామ్యవాద కవిగా మాత్రమే ఆయనను మనం గుర్తుంచుకోవాలి' అని ఆరుద్ర తేల్చి చెప్పారు. ఈ కారణంగానే నా శ్రీశ్రీ జయభేరి ఆరుద్రకే అంకితమిచ్చాను.

> **అంతర్జాతీయంగా సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీకరణ, దేశంలో అయోధ్య వివాదం తర్వాత మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న తరుణంలో ఆరుద్ర మరింత పట్టుదలగానూ అధ్యయన శీలంగానూ గడిపారు. మనీ ప్రపంచం మనీ ప్రపంచం/ మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?/ పీడిత శక్తుల స్వప్నాలన్నీ/పీడ కలలుగా మారాయా?/మరో ప్రపంచం మరో ప్రపంచం/ మాతామహులను మరిచేరా?/ మతిభ్రమించిన అతిరథులంతా / గతితర్కాన్నే తిడతారా?/ కారల్ మార్క్స్ ఉపదేశాలకు కాలదోషమని అంటారా?**

అరవైల తర్వాత ఇంకో అరుణారుణంగా

1985లో ఆరుద్ర షష్టి పూర్తి తెలుగు సాహిత్య లోకంలో ఒక పండుగలా జరిగింది. అనేక పట్టణాల్లో ఆయనను సత్కరించారు. ప్రచురణ సంస్థలు తలా ఒక సంపుటం వెలువరించాయి. మద్రాసు రాణీ శీతల్ హాలులో జరిగిన ఆ సభ ఇప్పటికీ గుర్తుంది. ప్రజాకళలు ప్రగతివాదులు కాపీలు తీసుకుని వెళ్లాను. ఆ తర్వాత కాలంలో ఆరుద్ర ఉద్యమానికి మరింత దగ్గరయ్యారు. కీలకమైన పలు సభలకూ సందర్భాలకూ హాజరవుతూ వచ్చారు. సుందరయ్య కన్ను మూసినపుడు రాత్రి ఫోన్ చేసి మరీ చిన్న కవిత చెప్పి నివాళులర్పించారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల మలి ముద్రణ కూడా ఆరుద్ర అప్పగించడం, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రజాశక్తి చేయడం యాదృచ్ఛికం కాదు. బొమ్మారెడ్డిగారు, గోళ్ల రాధాకృష్ణమూర్తి గారు ఆయనతో ఎక్కువగా మాట్లాడుతుండేవారు. మేడిపల్లి రవికుమార్ ఆరుద్రకు రాసిపెట్టడంలో సహకరించేవారు. తర్వాత కాలంలో ఆయన సాహిత్య అకాడమీ కోసం ఆరుద్ర జీవితం రాశారు.

అంతర్జాతీయంగా సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీకరణ, దేశంలో అయోధ్య వివాదం తర్వాత మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న తరుణంలో ఆరుద్ర మరింత పట్టుదలగానూ అధ్యయన శీలంగానూ గడిపారు. మనీ ప్రపంచం మనీ ప్రపంచం/ మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?/ పీడిత శక్తుల స్వప్నాలన్నీ/పీడ కలలుగా మారాయా?/మరో ప్రపంచం మరో ప్రపంచం/ మాతామహులను మరిచేరా? /మతిభ్రమించిన అతిరథులంతా / గతితర్కాన్నే తిడతారా?/ కారల్ మార్క్స్ ఉపదేశాలకు కాలదోషమని అంటారా? /డెబ్భయ్యేళ్ల త్యాగాలన్నీ / ఇబ్బందుల పద్దుకు జమ కట్టి వర్గ శత్రువుల దుర్గంధాల వాకిట ముష్టికి వెడతారా?/ బొచ్చె పట్టుకుని బిచ్చమెత్తుకుని/ చచ్చిన చావు వద్దు సుమా అని హెచ్చరించారు. మార్క్సూ లెనినూ మనకై వేసిన మార్గంలోనే చరిద్దాము/ మరో ప్రపంచం మరో ప్రపంచం / మరలా మనమూ రచిద్దాం/విశ్రమించక విధిగా సరిగా శ్రీశ్రీ గీతిక పఠిద్దాం అని అమెరికాలో వుండగా రాసిన పాట ప్రజాశక్తికి పంపించారు.

ఆరుద్ర 1998 జూన్ 4న కన్నుమూసిన సంగతి అంత్యక్రియలు ముగిశాక తెలిసిందంటే అది కూడా ఆయన నిరాడంబరతకు ఓ నిదర్శనమే. తన అంతిమ ఘట్టం అలా నిశ్శబ్దంగా జరిగిపోవాలని ఆయన ఆకాంక్షించారట. ఆయన భార్య రామలక్ష్మి 2023 మార్చి 3న కన్నుమూశారు. చరిత్రనే తిరగదోడే సంఘ పరివార్ దాడులు, సాహిత్యంలోనూ సమిష్టి ప్రయోజనం కన్నా వ్యక్తిగత ధోరణులు వాణిజ్య ప్రభావాలు పెంచుతున్న ఈ తరుణంలో ఆరుద్ర జీవిత ప్రస్థానం జిజ్ఞాసులు, చైతన్య గత ప్రాణుల అధ్యయనానికి మార్గదర్శకం. అన్ని అవకాశాలు వుండి కూడా ఉద్యమంతో మమేకం కావాలని పరితపించిన ఆరుద్ర జీవితం, కృషి ఆదర్శప్రాయం. శత జయంతి సంవత్సరంలో ఆరుద్ర సాహిత్యం అధ్యయనాల వారసత్వాలను సంస్కరించుకుందాం. అలవర్చుకునే ప్రయత్నం చేద్దాం.

(ఆరుద్ర శత జయంతివత్సరం సందర్భంగా)

కొత్తతరాన్ని తయారు చేస్తున్న తెలంగాణ సాహితి

తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు నల్లగొండ ఉమ్మడి జిల్లా కేంద్రంలోని యూటిఎఫ్ భవన్‌లో ఈనెల 3వ తేదీన ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆరు విభాగాలుగా నిర్వహించారు. ముఖ్యంగా సాహితీ కార్యక్రమాల్లో యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలతోపాటు మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని విద్యార్థులను, ఉపాధ్యాయులను కలిసి కవితా పోటీలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. అందుకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 147 మంది యువతీ, యువకులు తమ కవితలను పోటీకి పంపారు. దశాబ్ది ఉత్సవాల్లోనూ పాత, కొత్త కలయికలా యువతీ యువకులతో పాటు సీనియర్ కవులు, రచయితలు సుమారు వంద మంది పాల్గొన్నారు. ఉదయం ఎలా ఉత్సాహ పూరిగంగా ప్రారంభమైందో సాయంత్రం 6గంటల వరకుఅదే ఉత్సాహంతో కార్యక్రమం జరగడం సంతోషదాయకం. కవితా పోటీల్లో విజేతలకు బహుమతులు, అందజేయడమే కాకుండా కవిసమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు ఇవ్వడం విశేషం.



మనువాదాన్ని మరో మారు రుద్దే ప్రయత్నం



'సమాజం- సాహిత్యం ' అనే అంశం పై ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రముఖ కవి, రచయిత, పరిశోధకులు, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ సాహితి స్థాపించిన తర్వాత అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించింది. తెలంగాణ సాహితి యువరచయితలను తయారు చేస్తున్నది. సాహిత్య రంగంలో అభ్యుదయ సాహిత్యం నుంచి ఇప్పటివరకు వచ్చిన సాహితీ సంస్థలు, వాటి దృష్టి కోణాలు, పరిమితులను వివరించారు. ఇన్నాళ్లు అణగారిన వారి జీవితాలపై ఆధిపత్యం చేసిన మత దురహంకారం మళ్లీ పడగా విప్పి విజృంభిస్తున్నదని, ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదం అని, అందువల్ల వాటిని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలి.. ముఖ్యంగా విద్యార్థులైన యువ రచయితలు ఈ పనికి పూనుకోవాలని తెలియజేశారు. సమాజంలో మహిళలు, దళితులు, గిరిజనులు ఇలా విభిన్న వర్గాలు, జాతుల వారు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో సాహిత్య ప్రక్రియల ద్వారా వెలుగులోకి తేవాలన్నారు. సాహిత్యం ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. అలనాటి రాజుల కాలంలో ప్రేమ, యుద్ధాలు ఉన్నవి తప్ప ఆనాటి సాహిత్యం సామాన్యుల జీవన పరిస్థితులు కనిపించలేదన్నారు. మనువాదం ఈ సమాజాన్ని శాసించింది. సాహిత్యం మాత్రం మానవ వాదాన్ని ప్రచారంలోకి తెచ్చింది. ఇప్పుడు తిరిగి మనువాదాన్ని మరోమారు మనపై రుద్దేందుకు తీసుకొస్తున్నారు. శ్రీశ్రీ, గురజాడ వంటి వారు సాహిత్యంలో కొత్త కోణాలను వెలుగులోకి తీసుకొచ్చారు. సమాజంలో కాల క్రమంలో జరిగే పరిణామాల వల్ల విప్లవ, దళిత, స్త్రీవాద, బహుజన వాద సాహిత్యాలు వచ్చాయి. ఏ వాదమైన సమాజాన్ని చైతన్య పరచడమే లక్ష్యంగా ఉండాలి.

- సుంకిరెడ్డి నారాయణరెడ్డి

పీడనకు గురైన వారి గొంతుక తెలంగాణ సాహితి



తెలంగాణ సాహితి ఏర్పడిన ఈ దశాబ్ద కాలంగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాము. లిటరరీ ఫెస్ట్, పాటకు జేజే.. వంటి ఆనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాము..ఉన్నతులుగా ఎదగడానికి సాహిత్యం చదవాలి. సాహిత్యం అమ్మలాంటిది. వ్యక్తి ఉన్నతిని, అభివృద్ధిని కోరుకుంటుంది. ఇప్పుడు యువత మనసుల్లో విషబీజాలు నాటుతున్నారు. వారిని చైతన్య పరిచే బాధ్యత అభ్యుదయ రచయితలు, కవులపై ఉంది. ప్రేమ, మానవత్వం ఉన్న వారే కవిత్వాన్ని రాస్తున్నారు. సమాజం సమూహం నుండి చీలి ఒంటరితనంలోకి వెళ్ళిపోవటం చాలా ప్రమాదకరం. కవులు, రచయితలు స్తబ్దత నుండి బయటపడి సరికొత్త సజనకై ఉపక్రమించాలి. అందుకోసం సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మనిషి రాను రాను ప్రేమ భావన నుండి వెదొలిగి కాటిన్యం వైపు ఆలోచించడం ఆందోళనకరం. పుట్టుక నుండి చావు వరకు పాటమనకు తోడుగా ఉంటుంది. వేదన, ఆవేదన, సుఖం, దు:ఖం అన్నిటినీ పాట రూపంలో చెప్పవచు. పాలస్తీనాపై జరుగుతున్న దాడిని మీడియా చూపడం లేదు. దానిని కవులు, రచయితలు మాత్రం కొద్ది మొత్తంలో వెలుగులోకి తీసుకొస్తున్నారు. అనేక మంది ఆకలి, ఆవేదన, అనారోగ్యంతో అలమటిస్తున్నారు. యుద్ధం వలన ప్రజల జీవనం ఛిద్రం అవుతుంది. ఇలాంటి జీవన బీభత్సాన్ని ఒక్క సాహిత్యం మాత్రమే చూపగలుగుతుంది. ఆకలి, కష్టాలు, దారిద్ర్యం, సుఖ, సంతోషాలన్నీ అందరికీ ఒక్కటేననీ దానికి మతం ఉండదు. వట్టికోట ఆళ్వారు స్వామి పుట్టిన గడ్డ నల్లగొండ. ఈ గడ్డపై నుండి ఇంకా అనేక మంది కవులు, రచయితలు తయారు కావాల్సిన అవసరం ఉంది. అందుకు ఈ తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు నాంది పలకాలి.

- కె. ఆనందాచారి

నూతన ప్రయోగాలతో తెలంగాణ సాహితి



తెలంగాణ సాహితి ఓ కొత్త ప్రయోగానికి పూనుకొంది. గతంలో ఓ అంశం ఇస్తే వారు దానిపై మాట్లాడాల్సి వచ్చేది. కానీ నేడు ఎంపిక చేసిన విధానం చాలా బాగుంది. ఎవరు రాసిన సాహితీ ప్రక్రియలపై వారినే విశ్లేషించమనడంలోనే దీనిపై ఓ స్పష్టమైన, నిర్దిష్టమైన విషయ పరిజ్ఞానాన్ని సాహితీ మిత్రులకు అందజేయాలనే ఆలోచన బాగుంది. ఎవరి అంశం వారే మాట్లాడటంతో ఆ విషయం పట్ల పూర్తి పరిపక్వత వస్తుంది. తెలంగాణ ఉద్యమాన్ని నడిపింది గేయాలే. సమాజంలో అసమానతలు ఉన్నాయి. సామాజిక స్పృహ లేని వారిని విజ్ఞాన వంతులుగా చేయాల్సిన బాధ్యత సాహిత్యకారులపై ఉంది. అందుకు తెలంగాణ సాహితి విద్యార్థులను ఉత్సాహ పరిచి కవితల పోటీలు నిర్వహించి, కవిసమ్మేళనం నిర్వహించి తన కర్తవ్యాన్ని నిర్వహించడం అభినందించదగింది.

- పెరుమాళ్ల ఆనంద్

అనుభవాల్లోంచి వచ్చే పాటలకు ఆదరణ



'దోమలపెల్లి బడిలో చదువుకున్న విద్యార్థులం.. బతుకు బడి నేర్చుకొని మా భవితకు బాటలు వేసుకున్నం.. ఎవరికి వారు వేరై పోయి.. ఒకటిగ నేడు కలిసిన తరుణం... చెప్పన్నా నాది అనందం.. చెరిగిపోని అనుబంధం' అని పాటను రాసిన. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏ వేదికపైకి రాలేదు. కానీ నేడు తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాహిత్య కార్యక్రమానికి హాజరయ్యాను. 1996 నుండి సాహిత్యం అంటే ఆకళింపు చేసుకున్నాను. కథ, కవిత కన్నా పాట సామాన్య ప్రజల వరకూ వెళుతుందని నమ్మి జీవితానుభవంలో నుంచి ఎన్నో పాటలు రాశాను. తెలంగాణ ఉద్యమ కాలంలోఎన్నో పాటలు పాడి ప్రజలను చైతన్యపరిచాను. ఇప్పుడు సమాజం విభజించబడి ఉంది. దళితులు, గిరిజనులు, అగ్రవర్ణాల వారు, వృత్తి దారులు ఇలా ఎన్నో రకాలుగా విభజించబడిఉంది. వృత్తి దారులను గౌరవించాలి. కాళోజీ సాహిత్యం, జయశంకర్‌సార్ పుస్తకాలు, మునాసు వెంకట్ వంటి వారి పుస్తకాలు చదివితే జీవితం తెలుస్తది. జీవితాన్ని అనుభవించి అనుభవంలోంచి రాస్తున్నాను. పాటను పాడటం వేరు పాటను ప్రదర్శించిడం వేరు.

- అంబటి వెంకన్న,


అనుభవాల్లోనుండి కథలు రావాలి



నా బాల్యం మొత్తం కష్టాల మయంగానే గడిచింది. వీధిబాలల కష్టాలు నేను పడ్డాను. చదువు మాత్రమే మన బతుకులు మార్చుతుందని అర్థం చేసుకున్నాను. బాగా చదివి ఈ స్థాయికి వచ్చాను. నా కథ, నవలల్లో నేను ప్రస్తావించిన అంశాలన్నీ నా చుట్టూ ఉన్న సమాజంలోనివే. నేను అనుభవించిన పరిస్థితులే కథా వస్తువులుగా తీసుకొని రచనలుగా వెలుగులోకి తెచ్చాను. అందుకే నా కథల్లో అణచివేతకు గురైన వారి జీవనచిత్రణ ఉంటుంది. నేను రాసిన వాటిలో నాకు బాగా నచ్చిన కథ మీనా.

- భూతం ముత్యాలు


ప్రజా సాహిత్యం ఎప్పటికీ సజీవం



సమాజంలో రెండు రకాలైన సాహిత్యాలు ఉన్నాయి. ఒకటి వ్యాపార సాహిత్యం రెండు ప్రజా సాహిత్యం. వ్యాపార సాహిత్యం అప్పటి కప్పుడు ఉత్తేజ పరచొచ్చు. ఉధృతంగా రావచ్చు. కానీ తర్వాత అది కనిపించదు. కానీ ప్రజా సాహిత్యం ఎప్పటికీ సజీవంగా ఉంటుంది. సమాజంలో నిలబడి ఉంటుంది. శ్రీశ్రీ మహాప్రస్థానం చదివిన తర్వాత నాలో ఉత్సాహం పెరిగింది. అలా సాహిత్యంపై ఆసక్తి కలిగింది. రిక్షా కార్మికునికి సంబంధించిన ఓ కథ నాలో అలజడి రేపింది. ఇప్పటికీ అది నన్ను వెంటాడుతూ ఉంటుంది. రాస్తే అలా అణగారిన వర్గాలకు సంబంధించిన కథలు రాయాలని అప్పుడే అనుకున్నాను. అలా 1987లో ఉద్యోగంలో చేరిన తర్వాత కాటిపాపల జీవితాల గురించి కథ రాసాను. ఆ కథ చదివిన చాలా మంది ప్రశంసించారు. అలా గ్రామీణ నేపథ్యం, అట్టడుగువర్గాల సమస్యలను తీసుకొని రాసిన కథలతో 'జీవితచిత్రం' సంకలనం తీసుకొచ్చాను. ఇలా సీరియస్ కథల వైపు నుండి బాల సాహిత్యం వైపు మళ్లడానికి కారణం సమాజంలో దోపిడీకి గురయ్యేవారు బాలలు,స్త్రీలు. బాలలు వారి సమస్యలను కూడా చెప్పుకోలేరు. వారి సమస్యలను కథల రూపంలో వెలుగులోకి తీసుకు రావడం కోసం ఇప్పటి వరకూ వెయ్యికి పైగా బాలల కథలు రాశాను. నేను రాసిన కథలను 1990లో ప్రజాశక్తి దినపత్రిక ప్రతివారం ప్రచురించి ప్రోత్సహించింది. ఆ తర్వాత నవతెలంగాణ పత్రిక కూడా కథలలను ప్రచురించడమే కాకుండా సంకలనాలుగా తీసుకొచ్చింది.

- పుప్పాల కృష్ణమూర్తి

ఉత్పత్తి కులాల భాషను కవిత్వం చేయాలి



ఉత్పత్తి కులాల భాషను కవిత్వమయం చేసినప్పుడు అది జీవిస్తుంది. కవితలో చిత్రకారుడు కనిపిస్తాడు. జ్ఞానోదయం అయిన బుద్ధునిలా ఉండాలి కవిత్వం. ఇప్పటికీ కవిత్వ సభలే నాకు పండుగ దినాలు. విప్లవ కవిత్వంతో మొదలై హేతువాద ఉద్యమాన్ని బలంగా ప్రచారం చేశాను. చుండూరు, కారంచేడు ఘటనల తర్వాత బహువచనం అనే కవితా సంకలనం వచ్చింది. తర్వాత 'మేమే', 'మొగి' లాంటి కవితా సంకలనాలు తీసుకొచ్చాం. గోసంగి మిత్రులమైన అంబటి వెంకన్న, దుర్గాప్రసాద్, వేముల ఎల్లయ్య లాంటి వారు దళిత, బహుజన కవిత్వాన్ని స్థానిక భాషల్లో రాశారు. కాలానుగుణంగా సాహిత్యంలో మార్పులు వస్తున్నాయి. ఎన్ని మార్పులు వచ్చిన సామాన్యుల కష్టాలను, దు:ఖాలను, బాధలను వారి భాషలో వ్యక్తం చేయగలిగితేనే కవిత్వానికి ఓ సార్థకత ఉంటుంది.

- మునాసు వెంకట్

ప్రారంభ సభకు తెలంగాణ సాహితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్దన్ అధ్యత వహించారు. ఈ సభలో గౌరవ అతిథితులుగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహనకృష్ణ, బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సృజన సాహితి ప్రధాన కార్యదర్శి సాగర్ల సత్తయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు పాల్గొన్నారు. ప్రారంభ సభ అనంతరం మొదటి సమావేశంలో 'స్వీయ కవితల్లో వస్తువు' అంశంపై కవి, గాయకుడు ఏభూషి నరసింహ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ప్రధాన వక్తగా ప్రముక కవి మునాసు వెంకట్ ప్రసంగించారు. ఆత్మీయ అతిథిగా కవి వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రెండవ సమావేశం 'స్వీయ కథల్లో సామాజిక జీవిత చిత్రణ' అంశంపై ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య అధ్యక్షతన జరిగింది. ప్రధాన వక్తగా ప్రముఖ రచయిత భూతం ముత్యాలు ప్రసంగించారు. ఆత్మీయ అతిథిదిగా బాలసాహితీ వేత్త పుప్పాల కృష్ణమూర్తి మాట్లాడారు. మూడవ సమావేశం ఉనికి సాహిత్య వేదిక అధ్యక్షులు బండారు శంకర్ అధ్యక్షతన జరిగింది. 'స్వీయ గీతాల్లో సామాజిక స్పృహ' అనే అంశంపై ప్రధాన వక్తగా హాజరైన ప్రముఖ వాగ్గేయ కారుడు అంబటి వెంకన్న మాట్లాడారు. ఆత్మీయ అతిథిగా సృజన సాహితి అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ పాల్గొని ప్రసంగించారు. కవి సమ్మేళనానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ హసేన అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథిగా కవి, రచయిత మోత్కూరు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తండు కృష్ణ కౌండిన్య సమన్వయం చేశారు. ప్రముఖ కవులు, రచయితలు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ముఖులను సన్మానించి, మెమొంటోలతో సత్కరించారు.

- పుప్పాల మట్టయ్య

రుణ మాఫీ, రైతు భరోసా బోగస్

- మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్

అబద్ధాల ప్రచారం : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధు బోగస్, రుణమాఫీ బోగస్, వరికి బోనస్ బోగస్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం మహారాష్ట్రకు వెళ్లి అన్ని అబద్ధాలే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.రుణమాఫీపై మాట తప్పామని మహారాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 42 లక్షల మందికి రూ.31 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామనీ, రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని అన్నారు. 100 రోజుల్లో చేస్తామన్న కాంగ్రెస్ హామీలు ఎక్కడ అమలవుతున్నాయని ప్రశ్నించారు.రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇచ్చారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న వడ్లను ప్రభుత్వం కొనకపోవడంతో రైతులు తక్కువ రేటుకు దళారులకు అమ్ముకునే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో మద్దతు ధరకు వడ్లు కొనకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1,900కే వడ్లు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మీద ఉన్న వరి కుప్పల కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలకు సాక్ష్యమని వ్యాఖ్యానించారు. "రేవంత్‌రెడ్డి సర్కార్11 నెలల్లో ఒక్క ఇల్లూ కట్టక పోగా, కూలుస్తోంది. 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏ ఇవ్వలేదు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చింది ఎవరు? ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ పాలనలో పోలీసు కానిస్టేబుళ్లు రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి ఏర్పడింది. హాస్టళ్ల తిండి తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారు. వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో ఇవ్వలేదు. సోనియమ్మ మాట.. రాహుల్ గాంధీ మాట అంటూ ఇచ్చిన హామీలేమయ్యాయి, ఇప్పుడా గాంధీలు ఎక్కడికి పోయారో తెలియదు. కాంగ్రెస్ చెప్పేదానికి.. చేసేదానికి పొంతనలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అబద్దాలు మాని, నిజాలు మాట్లాడాలని హితవు పలికారు.

తెలంగాణాలో పెట్టుబడులు పెట్టండి

- మలేషియా పారిశ్రామిక వేత్తలకు

మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో విరివిగా పెట్టబడులు పెట్టాలని మలేషియా పారిశ్రామిక వేత్తలకు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మలేషియా తెలంగాణా దశాబ్ది ఉత్సవాలకు హాజరైన ఆయన ఆదివారం కౌలాంలపూర్‌లో అక్కడి పారిశ్రమిక వేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సులభతర వాణిజ్య విధానాల వల్ల పరిశ్రమల స్థాపనకు దేశంలో ఎక్కడా లేనంత అనుకూల వాతావరణం ఏర్పడిందని వారికి వివరించారు. రెండు దేశాల సంస్కృతుల్లో అనేక సారూప్యతలు ఉన్నందున పరస్పర సహకారం మరింత తేలిక కానుందని ఆకాంక్షించారు. పెట్టుబడులతో తమ దేశానికి వచ్చే వారందరికి హైదరాబాద్ ఎంట్రీ పాయింట్‌గా ఆహ్వానం పలుకుతోందని పేర్కొన్నారు. డిసెంబర్‌లోగా ఇక్కడి పారిశ్రామిక వేత్తలు రాష్ట్రాన్ని సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా వారికి తెలిపారు.

రాజకీయ ప్రస్థానానికి 25 ఏండ్లు

అనూహ్య పరిస్థితుల్లో ప్రజాసేవలోకి వచ్చిన తాను ప్రజా ప్రతినిధిగా నవంబరు పదితో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయం ఇక్కడి మిత్రులు చెప్పేదాక తనకు గుర్తు లేదని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు అన్నారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పార్టీలో ఎంతో ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహిస్తూ వచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. మంత్రిగా తాను పనిచేసిన నలుగురు ముఖ్యమంత్రులు తన పట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబర్చారని గుర్తు చేసుకున్నారు.

విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏడాది పాలనలో కోలుకోలేని విధ్వంసం సృష్టించిన కాంగ్రెస్ పార్టీకి విజయోత్సవాలు జరుపుకునే అర్హత లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. "కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా ?ఎనుముల వారి ఏడాది ఏలికలో.. తెలంగాణ బతుకు చీలికలు, పీలికలే..!! నిర్వహించాల్సింది విజయోత్సవాలు కాదు.. కుంభకోణాల కుంభమేళా. ప్రజావంచన వారోత్సవాలు. మూసీలో లక్షన్నర కోట్ల మూటల వేట. కొడంగల్ లిఫ్టులో వేలకోట్ల అక్రమాలు. బావమరిదికి అమృత్ టెండర్లను, కొడుకులకు వేలకోట్ల కాంట్రాక్టులను కట్టబెట్టే ముఖ్యమంత్రి, మంత్రులు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదు కరప్షన్ కార్నివాల్" అంటూ కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. "రుణమాఫీ లేదు. పెట్టుబడి సాయం లేదు. వృద్దులు పింఛన్ల పెంపు కోసం వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నారు. 75 ఏండ్ల స్వతంత్ర భారత చరిత్రలో అతితక్కువ సమయంలో అత్యధిక ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న తొలి ప్రభుత్వం ఇదే. ముఖ్యమంత్రికి పాలనపై పట్టు లేదు. ఈ ప్రభుత్వానికి తెలంగాణపై ప్రేమలేదు. పేదల ఇండ్లు కూల్చి రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కారుకు అసలు మనసే లేదు. విజయోత్సవాలు అంటే ఏంటో కూడా తెలియని ఈ అసమర్థ పాలకులకు ఆ పదాన్ని వాడే హక్కే లేదు" అని కేటీఆర్ విమర్శించారు.

గిరిజన గురుకుల విద్యార్థుల ప్రాణాలంటే ఇంత చిన్నచూపా?

- హరీశ్ రావు ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కాలంచెల్లిన మందులుండటం పట్ల వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి పత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని జత చేస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. "ఇంతకంటే నిర్లక్ష్యం మరొకటి ఉంటుందా? గిరిజన గురుకుల విద్యార్థుల ప్రాణాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత చిన్న చూపా? ఈ మందుల వల్ల ప్రాణాల మీదకు వస్తే ఎవరు బాధ్యులు? కాలం చెల్లిన మందులు మెడికల్ క్యాంపులోకి ఎలా వచ్చాయి.? అదిలాబాద్ జిల్లాలో ఇంత జరుగుతుంటే జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఏం చేస్తున్నట్లు? ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులకు పట్టించుకునే తీరిక లేదా? కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర ఇంకెప్పుడు వీడుతుంది?..." అని ప్రశ్నల వర్షం కురిపించింది.

పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్త మృతదేహం

- పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఘటన

కోల్‌కతా : అదృశ్యమైన బీజేపీ కార్యకర్త ఆ పార్టీ కార్యాలయంలో హత్యకు గురయ్యాడు. పార్టీ ఆఫీస్ డోర్ పగులగొట్టిన పోలీసులు లోపలకు వెళ్లి చూడగా రక్తం చారలతో ఉన్న అతడి మృతదేహం కనిపించింది. బీజేపీ కార్యకర్త హత్యకు సంబంధించి ఒక మహిళను అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఉస్తికి చెందిన బీజేపీ కార్యకర్త పృథ్వీరాజ్ నస్కర్ ఆ జిల్లాలో పార్టీకి చెందిన సోషల్ మీడియా ఖాతాలను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5 నుంచి అతడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా, పోలీసులు శుక్రవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో లోపల నుంచి లాక్ వేసి ఉన్న ఒక డోర్‌ను పగులగొట్టారు. లోపలకు వెళ్లి చూడగా రక్తంతో తడిసిన పృథ్వీరాజ్ నస్కర్ మృతదేహం కనిపించింది. ఆయన ఫోన్ కాల్స్ డేటాను పరిశీలించిన తర్వాత ఒక మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

బీళ్లు తడవలే..వెతలు తీరలే..

మూసీకి మల్లన్న సాగర్ నీళ్లా..?

- రూ.7 వేల కోట్లతో గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు
- కరువు పీడిత ప్రాంతాలను విస్మరించి పట్నానికి నీళ్లు
- ఉమ్మడి మెదక్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో 11.29 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేదెన్నడు
- 14 గ్రామాలు, 17871 ఎకరాల భూములు మునక
- మీరు అవినీతి చక్రవర్తన్న వాడికేనా..?
- సాగునీరు, నిర్వాసితులకు పరిహారం ఇచ్చాకే.. : సీపీఐ(ఎం)

మూసీ ప్రక్షాళన, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పునరుజ్జీవం పేరిట గోదావరి జలాల తరలింపునకు రంగం సిద్ధమైంది. గోదావరి ఫేజ్-2 పేరిట భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. మహానగరం హైదరాబాద్ అవసరాల పేర నీటి తరలింపు పర్వాలేదు. కానీ, 11.29 లక్షల ఎకరాల కరువు పీడిత ప్రాంత బీడు భూములు తడవకముందే..14 గ్రామాలు, 18 వేల ఎకరాల భూముల్ని కోల్పోయిన నిర్వాసితుల వెతలు తీరకముందే మల్లన్నసాగర్ జలాశయం నుంచి నీటిని తరలించుకోవటం ఏమిటీ..? మల్లన్నసాగర్ ప్రాజెక్టు అసలు లక్ష్యాన్ని నీరుగారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేయటం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి మెదక్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల సాగునీటి అవసరాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రూ.5560 కోట్లు కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ గతంలోనే జీవో 345 జారీ చేశారు. హైదరాబాద్‌కు తరలించే అదనపు జలాలను మూసీ ప్రక్షాళనతోపాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పునరుజ్జీవం కోసం ఉపయోగిస్తారంటున్నారు. హైబ్రీడ్ యాన్యుటీ (బీఓటీ ఫస్ ఈపీసీ) మోడ్‌లో పనులు పూర్తి చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాప్కోస్ కంపెనీ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం చేసింది. అందులో భాగంగా పంప్ హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3600 ఎంఎం డయా భారీ పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. ఘన్‌పూర్ వద్ద 780 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటి శుద్ది కేంద్రం నిర్మిస్తారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టేలా ప్రాజెక్టు రూపొందిస్తున్నారు. రెండేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై జీడీడబ్ల్యూఎస్ పథకం పేజ్-1 కింద హైదరాబాద్ ప్రజల నీటి అవసరాల కోసం ఇప్పటికే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి జలమండలి 10 టీఎంసీల నీటిని వాడుకుంటోంది. ఇకపై 2030 నాటి నీటి అవసరాల కోసం మల్లన్నసాగర్ నుంచి గోదావరి రిజర్వాయర్ ద్వారా 15 టీఎంసీల నీటిని వాడుకునేలా ప్రాజెక్టు నిర్మించనున్నారు. 10 టీఎంసీలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించేలా 5 టీఎంసీలను మూసీ ప్రక్షాళనతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పునరుజ్జీవం కోసం ఉపయోగిస్తారు.

మొదట కొండపోచమ్మ.. తాజాగా మల్లన్నసాగర్ ఎందుకు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2023 మే 18న అప్పటి మంత్రివర్గం కొండపోచమ్మసాగర్ జలాశయం నుంచి గంధమల్ల ద్వారా 10 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు రూ.1100 కోట్ల అంచనాతో ప్రాజెక్టు కోసం తీర్మానం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తొలుత కొండపోచమ్మ సాగర్ నుంచే గోదావరి నీళ్లను తరలిస్తుందని సీఎం ప్రకటించారు. అయితే చిన్నపాటి వ్యయం కావడం, కొండపోచమ్మ సాగర్‌లో నీటి లభ్యత తక్కువ ఉండటం పేరిట ప్రాజెక్టును మార్చేశారు. మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించేందుకు వీలుగా భారీ ప్రాజెక్టును రూ.7 వేల కోట్ల అంచనాతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. భారీ ఖర్చుతో చేపట్టే ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని మెఘా కంపెనీకే కట్టబెట్టినట్టు సమాచారం. లక్ష కోట్ల అవినీతి కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, అవినీతి చక్రవరి మెఘా అంటూ గతంలో విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎంగా అదే 'మెఘా కంపెనీకే పనులివ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది

బీళ్లు తడవే..

మెట్ట ప్రాంతాలకు సాగు, తాగు నీరివ్వాలన్న లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక, గందమల్ల, తపస్‌పల్లి జలాశయాలు నిర్మించారు. మల్లన్నసాగర్ జలాశయం 50 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. ప్రస్తుతం 21 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశారు. ఒకేసారి కుదరనందున దశల వారీగా నీటి నిల్వను పెంచుతూపోవాలి. 50 టీఎంసీలు నింపాలంటే మరో 15 ఏండ్లు పట్టొచ్చు. జలాశయానికి ఐదు తూములు (స్లూయిజ్‌లు) ఉన్నాయి. వీటి ద్వారా కొండపోచమ్మ, గందమల్ల, తపాస్‌పల్లి రిజర్వాయర్లకు సింగూరు ప్రాజెక్టుకు, ఉమ్మడి మెదక్ జిల్లాలో మిషన్ భగీరథ కోసం నీటిని తరలిస్తారు. 20 టీఎంసీలతో సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతానికి సింగూరు ద్వారా మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌కు, సిద్దిపేట జిల్లాల్లోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట ప్రాంతాలకు సాగునీరివ్వాలి. మెదక్, భువనగిరి, చౌటుప్పల్, చిట్యాల, వలిగొండ, ఆలేరు, రామన్నపేట వంటి ప్రాంతాలకు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు కలిపి 11.29 లక్షల ఎకరాలకు గోదావరి జలాలివ్వాలనే లక్ష్యంతో మల్లన్నసాగర్ ఇతర జలాశయాలు కట్టారు. కానీ, ఇంత వరకు పావొంతు భూములకు కూడా నీళ్లివ్వలేదు. 14 గ్రామాలు, 17871 ఎకరాల భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ సాయం అందలేదు. కానీ, ప్రారంభ దశలోనే పట్నానికి నీళ్ల తరలిస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏం కావాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కొండపోచమ్మ నుంచి ఇవ్వొచ్చు : ఎమ్మెల్యే హరీశ్‌రావు, సిద్దిపేట

హైదరాబాద్ అవసరాల కోసం 10 టీఎంసీల గోదావరి జలాల్ని కొండపోచమ్మ సాగర్ నుంచి తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తీర్మానించాం. రూ.1100 కోట్లతో పనులు పూర్తవుతాయి. మల్లన్నసాగర్ సాగర్ నుంచి తరలించే పనుల పేరిట వేల కోట్ల ఖర్చు దేని కోసమో ప్రభుత్వం చెప్పాలి. మెఘా కంపెనీ దోచుకుందని విమర్శించిన రేవంత్‌రెడ్డి అదే కంపెనీకి పనులు కట్టబెట్టడం వెనకాల ఏం జరిగిందో చెప్పాలి.

అవినీతి కోసమే రూ.7 వేల కోట్లు : రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ

కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తరలిస్తే రూ.1100 కోట్లతో పనులవుతాయి. ఇదే విషయాన్ని సీఎం చెప్పారు. తాజాగా మల్లన్నసాగర్‌లో నీటి లభ్యత ఎక్కువని చెప్పి రూ.7 వేల కోట్లతో డీపీఆర్ తయారు చేయడం వెనకాల పెద్ద అవినీతి కోణముంది. నీటి లభ్యత అవసరమనుకుంటే మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు నీటిని తరలిస్తే సరిపోతది.

సాగునీటి అవసరాల తీరకముందే తరలింపా



ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి

సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, గజ్వేల్‌తో పాటు సిద్దిపేట ప్రాంతంలోని ఎతైన భూములకు సాగునీరివ్వాలని మల్లన్నసాగర్ ప్రాజెక్టు కట్టారు. ఇప్పటి వరకు ఆ భూములకు నీళ్లివ్వలేదు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ రాలేదు. 21 టీఎంసీల నీటిని నింపితేనే కట్ట నాణ్యతపై అనుమానులొచ్చాయి. 50 టీఎంసీలు నిండేదెప్పుడో తెల్వదు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడే నీటిని తరలించుకుపోతే ఈ ప్రాంత ప్రజల పరిస్థితి ఏం కావాలి. సాగునీరిచ్చే పెండింగ్ పనుల్ని పూర్తి చేయాలి.

ఐలాపూర్‌లో సమగ్ర సర్వే బహిష్కరణ

- తమ గ్రామ సమస్యలు పరిష్కరించాకే సర్వే..



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

జనగామ జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ గ్రామంలో గ్రామస్తులు సమగ్ర సర్వేను బహిష్కరించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు ఆదివారం ఐలాపూర్ గ్రామంలో సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ మల్లె లక్ష్మయ్య గ్రామస్తులతో కలిసి సర్వేను అడ్డుకొని మాట్లాడారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించినప్పుడే కులగణన, సమగ్ర సర్వే ఇంకా ఏ సర్వేలైనా చేసుకోవాలని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు కావస్తున్నా ఇప్పటివరకు తమ గ్రామానికి తారు రోడ్డు కానీ బీటీ రోడ్డు గానీ లేకపోవడం అధికారులు, ప్రభుత్వాలు సిగ్గుపడాలన్నారు. గిరి వికాస పథకం ద్వారా బోర్లు దింపి ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఆ బోర్లకు మూడు తీగల కరెంటు విద్యుత్ లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాకే సమగ్ర సర్వే చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోడే సుధాకర్, చంద్రయ్య, మల్లేష్, బాలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు అడ్డంకులు తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలు, వాటిని పరిష్కరించుకుంటున్న తీరును వివరించారు. హైదరాబాద్‌లోని మారేడ్ పల్లిలో పోలీస్ స్టేషన్ ఎదురుగా కూర్చుని పోకిరీలు ఈవ్ టీజింగ్ చేస్తున్నారనీ, ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రులు ఎలా చదువులకు పంపిస్తారని ప్రశ్నించారు. అదే విధంగా ఆయా జిల్లాల ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకట్ రెడ్డి రచించిన నాణ్యమైన విద్యతోనే బాలలకు న్యాయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ' మంచి పుస్తకం ' ప్రచురించింది.

బియ్యం దిగుమతికి మలేషియా వ్యాపారుల హామీ

- బిజినెస్ మీట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ నాణ్యమైన బియ్యాన్ని దిగుమతి చేసుకుంటామంటూ మలేషియా వ్యాపారులు హామీ ఇచ్చారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఆదివారం మలేషియాలో నిర్వహించిన బిజినెస్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో పండుతున్న ఉత్పత్తులపై ఆయన వివరించారు. తెలంగాణలో సాగు చేస్తున్న వరి, ధాన్యం రకాల గురించి, వాటి నాణ్యత తదితరాంశాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్, విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో165 మంది సైబర్ నేరస్థుల అరెస్ట్

- టీజీసీఎస్‌బీ డీజీ షికా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

గత ఆరు నెలల్లో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు 165 మంది సైబర్ నేరస్థులను అరెస్ట్ చేశామని ఆ విభాగం డీజీ షికా గోయెల్ తెలిపారు. మొత్తం రాష్ట్రంలో నమోదైన కేసులలో 76 కేసులకు సంబంధించి ఈ నేరస్థుల అరెస్ట్ జరిగిందని ఆమె వివరించారు. వీరంతా దాదాపుగా ఇతర రాష్ట్రాలకు చెందినవారేననీ, అందులో ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, మహారాష్ట్ర, గోవా, హర్యానా, ఒడిశా, తమిళనాడు, కర్నాటక, ఏపీ లకు చెందనవారున్నారని తెలిపారు. ఇందులో ఎక్కువగా నేరస్థులను అరెస్ట్ చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోని స్థానికుల నుంచి ప్రతిఘటనను, దాడులను సీఎస్‌బీ టీమ్‌లు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆమె చెప్పారు. కొన్ని ప్రదేశాల్లో నేరస్థులను అరెస్ట్ చేయటానికి స్థానిక పోలీసులు కూడా సహకరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ దర్యాప్తు బృందాలు ధైర్యంగా నేరస్థుల డెన్‌లపై దాడులు జరిపి అరెస్ట్‌లు చేశాయని వివరించారు. ఈ నేరస్థులను పసిగట్టటంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన టెక్నికల్ బృందం కీలకమైన పాత్రను పోషించిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏడు సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్లు, రాష్ట్రస్థాయిలోని టీజీసీఎస్‌బీకి చెందిన దర్యాప్తు బృందాలు కలిసి, సమన్వయంతో పని చేసి ఈ ఫలితాలను రాబట్టటం జరిగిందని తెలిపారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి అరెస్టయిన ఈ నేరస్థులకు సంబంధించిన వివరాలను ఆయా రాష్ట్రాల పోలీసులకు కూడా అందజేశామని చెప్పారు. ఇందులో కొందరు నేరస్థులు తెలంగాణలోగాక ఇతర రాష్ట్రాలకు సంబంధించిన సైబర్ నేరాలలో ఉన్నారని షికా గోయెల్ వివరించారు. అరెస్టయినవారిలో ఎక్కువగా బీటెక్, ఎంటెక్‌తో పాటు డిగ్రీ, ఆ పైస్థాయి విద్యావంతులేననీ, ఇందులో 21 నుంచి 45 సంవత్సరాల వారు ఎక్కువగా ఉన్నారని ఆమె తెలిపారు. వీరంతా 76 కేసులలో 765 నేరాలకు పాల్పడినవారున్నారని అన్నారు. వీరు చాలా వరకు బ్యాంకుల మోసాల నుంచి నకిలీ లాటరీల మోసాల వరకు పాల్పడినవారున్నారని ఆమె చెప్పారు. సైబర్ నేరగాళ్ల బారి నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసే లక్ష్యంతో టీజీసీఎస్‌బీ కృత నిశ్చయంతో పని చేస్తున్నదనీ, ప్రజలు కూడా ఇలాంటి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని షికా గోయెల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు...

- న్యూయార్క్ టైమ్స్



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఇంధనం , పర్యావరణ విధానాలను సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నారు. "మేల్కొన్న" ఎజెండా అని పిలవబడే వాటిని విచ్ఛిన్నం చేయడం, దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించే కార్యక్రమాలను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నారని న్యూయార్క్ టైమ్స్ రాసింది. శుక్రవారం ప్రచురించిన కథనం ప్రకారం, ట్రంప్ విద్యుత్తు , పర్యావరణ పరివర్తన బృందం ఇప్పటికే "వాతావరణం , శక్తిపై కార్యనిర్వాహక ఆదేశాలతో పాటు అధ్యక్ష ప్రకటనల స్లేట్"ను సిద్ధం చేసింది. 2015లో ఆమోదించిన వాతావరణ మార్పుపై అంతర్జాతీయ ఒప్పందం అయిన పారిస్ ఒప్పందాన్ని అమెరికా విడనాడడం కూడా ఈ చర్యలలో ఉంది.

డ్రిల్లింగ్ , మైనింగ్ కోసం భూమిని తవ్వడానికి దక్షిణ ఉటాలోని బేర్స్ ఇయర్స్ , గ్రాండ్ స్టెయిర్‌కేస్-ఎస్కలాంటే జాతీయ స్మారక చిహ్నాల సరిహద్దులను మార్చడం కూడా ఎజెండాలో ఉంది. రక్షిత ప్రాంతాన్ని 2021లో యూఎస్ అధ్యక్షుడు జో బైడెన్ విస్తరించారు. క్లీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్, కాలుష్యం తగ్గింపునకు అనుకూలంగా ఉండే బైడెన్ పర్యావరణ న్యాయ కార్యక్రమాలు అని పిలవబడే వాటిని రద్దు చేయడానికి డొనాల్డ్ ట్రంప్ బృందం సిద్ధంగా ఉన్నట్టు నివేదించబడింది. కొత్త సహజవాయువు ఎగుమతి టెర్మినల్స్, ఇతర విషయాలతోపాటు అనుమతుల సస్పెన్షన్‌ను ముగించడం ఇందులో భాగంగా ఉంటుంది.

బైడెన్ "క్లైమేట్ జార్" స్థానంలో ట్రంప్ "ఎనర్జీ జార్" ను నియమించాలని యోచిస్తున్నట్టు ప్రచురణ పేర్కొంది. డిమాండ్ పరిమితం కాకుండా సరఫరాను పెంచడానికి చమురు, గ్యాస్ , బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన విధానాలను క్రమబద్ధీకరించడానికి ఈ పాత్ర అంకితం చేయబడుతుంది. నార్త్ డకోటా గవర్నర్ డౌగ్ బుర్గమ్, గతంలో మిలియన్ల ఎకరాల ప్రభుత్వ భూమిని ఫ్రాకింగ్ కోసం తెరవడంలో సహాయం చేసారు . ఇంధన శాఖ మాజీ కార్యదర్శి డాన్ బ్రౌలెట్‌లను ఈ పదవికి పరిశీలిస్తున్నారు. యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ తో సహా ఫెడరల్ ఏజెన్సీలను వాషింగ్టన్ నుంచి మార్చడం తదుపరి ప్రణాళికలలో ఉంది. అటువంటి ఫెడరల్ విభాగాలు , ఏజెన్సీలను "అమెరికాను ప్రేమించే దేశభక్తులతో నిండిన ప్రదేశాలకు" తరలించాలని గతంలో ట్రంప్ వాదించాడు.

ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఉద్యోగులు ఈ చర్యతో ఏకీభవించనప్పటికీ, వాతావరణ మార్పు కార్యక్రమాలను అమలు చేయడానికి మొదటి రోజు "వందలాది మంది సిబ్బందిని" నియమించుకున్నప్పుడు, పరివర్తన నమూనా రివర్స్ లో బిడెన్ పరిపాలన విధానాలపై ఆధారపడి ఉందని ట్రంప్ మిత్రపక్షాలు చెబుతున్నాయి. "మొదటి రోజు, మొదటి వారం, మొదటి నెలలో బైడెన్ ఏమి చేశాడో వారి నమూనా ఉంది" అని ట్రంప్ మొదటి పదవీకాలంలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ పరివర్తనకు నాయకత్వం వహించిన మైరాన్ ఎబెల్ చెప్పాడు. "మేం బైడెన్ ఏమి చేసాడో చూద్దాం . దాని ముందు 'కాదు' అని ఉంచుతాము."

గత సంవత్సరం ఐక్యరాజ్యసమితి వాతావరణ చర్చలలో, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి చమురు, గ్యాస్ మరియు బొగ్గుకు దూరంగా మారడానికి అమెరికా ప్రధాన చమురు ఎగుమతిదారులు శిలాజ ఇంధనాల పూర్తి "దశలీకరణ" కోసం ప్రారంభ పిలుపులను తిరస్కరించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను "బూటకపు" అని పిలిచే వాటిని ముగించడం, సరసమైన ఇంధనం అమెరికా ఆర్థిక వ్యవస్థకు కీలకమనేవి ట్రంప్ ఎన్నికల వాగ్దానాలలో ఉన్నాయి.

ప్రపంచ సమకం

పెంటగాన్ ఉక్రెయిన్ క్షిపణి అభ్యర్థనను తిరస్కరణ

- వాల్ స్ట్రీట్ జర్నల్



వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రకారం, దీర్ఘశ్రేణి క్షిపణి వ్యవస్థల కోసం ఎదురుచూస్తున్న ఇతర కస్టమర్లతో దీర్ఘకాలంగావున్న అమెరికా ఆయుధ ఒప్పందాలను ఉల్లంఘించడం "అతిగా అడగటమే" అని డిఫెన్స్ సెక్రెటరీ లాయిడ్ ఆస్టిన్ ఉక్రెయిన్ వ్లాదిమిర్ జెలెన్స్కీకి తెలియజేశాడు. ఉక్రెయిన్‌కు తెలియని సంఖ్యలో అమెరికా ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్‌లను పంపింది. . కీవ్ చాలా నెలలుగా మరిన్ని అభ్యర్థిస్తోంది. అలాగే రష్యా భూభాగంలోకి లోతుగా దాడి చేయడానికి అనుమతిని కోరుతోంది.

పెంటగాన్ అదనపు క్షిపణులను పంపడానికి వెనుకాడింది. మాస్కో ఇప్పటికే తన లక్ష్యాలను పరిధి వెలుపలకు మార్చిందని, అమెరికా మిలిటరీ తన నిల్వలలో పరిమిత సంఖ్యలో ఈ క్షిపణులను కలిగి ఉందని వాదించింది. అదనంగా క్షిపణి సిస్టమ్‌లను ముందుగా ఆర్డర్ చేసిన కస్టమర్‌లకు చెల్లించాల్సిన బాధ్యత అమెరికాకు ఉంది. పెంటగాన్ చీఫ్ ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి క్షిపణుల డెలివరీకి ప్రాధాన్యత ఇవ్వాలని జెలెన్స్కీ చేసిన ఇటీవలి అభ్యర్థనను తిరస్కరించాడు. వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రకారం, ఇద్దరు అమెరికా అధికారులు , ఉక్రేనియన్ ప్రభుత్వ సలహాదారు అందించిన సమాచారాన్నిబట్టి ఇప్పటికే ఉన్న ఆయుధ ఒప్పందాలను విచ్ఛిన్నం చేయడం "అడగడానికి చాలా ఎక్కువ" అని చెప్పటం జరిగింది.

వాషింగ్టన్ , దాని నాటో భాగస్వాములు ఉక్రెయిన్‌కు మూడు రకాల సుదూర క్షిపణి వ్యవస్థలను అందించారు: 300కిమీల పరిధి కలిగిన అమెరికన్-నిర్మిత క్షిపణులు, అలాగే బ్రిటిష్ స్టార్మ్ షాడో , ఫ్రెంచ్ స్కాల్ క్షిపణులు ఉన్నాయి. క్షిపణి ప్రతి ఒక్కటి దాదాపు 250కి.మీ టార్గెట్ చేయగలదు. ఈ దాడిలో క్రిమియాలోని సెవాస్టోపోల్‌లోని బీచ్‌లో నలుగురు వ్యక్తులు మరణించగా, 150 మందికి పైగా గాయపడ్డారు. దాడితో సహా రష్యా మౌలిక సదుపాయాలు , పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడానికి కీవ్ ఈ క్షిపణులను పదేపదే ఉపయోగించింది.

కీవ్ ప్రధాన స్పాన్సర్ అమెరికాకు "విక్టరీ ప్లాన్" అని పిలవబడే వాటిని అందించడానికి తన తాజా పర్యటనలో, జెలెన్స్కీ "రహస్యంగా" టోమాహాక్ క్షిపణులను అభ్యర్థించాడు. దీని 2,400 కి.మీ పరిధి గతంలో అందించిన పాశ్చాత్య నిర్మిత ఆయుధాలను మించిపోయింది. ఈ అభ్యర్థనను "పూర్తిగా అసంభవం"గా అమెరికా అధికార వర్గాలు అభివరి?ంచాయి. రష్యాకు వ్యతిరేకంగా విదేశీ నిర్మిత ఆయుధాలను ఉపయోగించి పశ్చిమ దేశాలు సుదూర దాడులకు అనుమతిస్తే, అది ఆ దేశానికి వ్యతిరేకంగా నాటో "యుద్ధం చేస్తోంది" అని సూచిస్తుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. కీవ్ స్వతంత్రంగా ఇటువంటి దాడులను నిర్వహించడం అసమర్థంగా ఉందని, అమెరికా నేతృత్వంలోని కూటమి మాత్రమే అందించగల లక్ష్యాల డేటా అవసరం అని ఆయన అన్నాడు.

దీనికి ధీటుగా రష్యా అణు సిద్ధాంతంలో మార్పులను పుతిన్ ప్రతిపాదించాడు. ప్రతీకార ప్రతిస్పందనను నిర?యించేటప్పుడు అణు దేశం మద్దతుతో అణు రహిత దేశం చేసే దాడిని రష్యాపై ఉమ్మడి దాడిగా మాస్కో పరిగణిస్తుందని పేర్కొంది. ఉక్రెయిన్ పాశ్చాత్య మద్దతుదారులు హెచ్చరికను విన్నారని అతను తరువాత ఆశాభావం వ్యక్తం చేశాడు.



నేడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జాతీయ అవార్డుల ప్రదానం

- 2019 నుంచి అవార్డులు ఇవ్వనున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని పలువురు విద్యారంగ ప్రముఖులకు జాతీయ అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2019 నుంచి ఈ అవార్డులు ఇవ్వడం నిలిచిపోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వీటిని పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. సోమవారం ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ అవార్డులు ఇవ్వనున్నారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ, మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎమ్ఆర్ఈఐఎస్), రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖల సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తాహెర్ బిన్ హమ్దాన్, టీజీఎమ్ఆర్ఈఐఎస్ వైస్ చైర్మెన్ మహ్మద్ ఫహీదుద్దీన్ ఖరేషీ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డిని కూడా ఆహ్వానించారు. వారితోపాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా దీనికి హాజరవుతున్నారు.

అవార్డు గ్రహీతలు వీరే...

మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జాతీయ అవార్డులను 2019 నుంచి 2023 వరకు ప్రదానం చేయనున్నారు. ఆసిఫ్ పాషా (2019), గులాం యజ్దాని (2020), శ్రీమతి లక్ష్మీదేవిరాజ్ (2021), జాహిద్ అలీ ఖాన్ (2022), అమీన్ ఉల్ హసన్ జాఫ్రీ (2023) ఈ అవార్డులు స్వీకరించనున్నారు. ప్రతిష్టాత్మకమైన మగ్దూం అవార్డుకు ప్రొఫెసర్ నసీముద్దీన్ ఫారిస్ (2024) ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు ప్రకటించారు. అంజనీకుమార్ గోయల్ (కవిత్వం), తయ్యబ్ పాషా ఖాద్రీ (కవిత్వం), సురియా జబీన్ (ఫిక్షన్), అథెర్ సుల్తానా (పరిశోధన, విమర్శ), డాక్టర్ మహ్మద్ జాఫర్ (విద్య, శిక్షణ), అహ్మద్ అలీఖాన్ (జర్నలిజం), షేక్ అహ్మద్ (ఉర్దూభాషాభివృద్ధి), మహ్మద్ మొయినుద్దీన్ అమర్ (కవిత్వం) ఎలిజబెత్ కురైన్ (కవిత్వం), మహ్మద్ అబ్దుల్ హమీద్ ఆదిల్ (ఫిక్షన్), ఎమ్ఏ ఖాదర్ (పరిశోధన, విమర్శ), మహ్మద్ జావెద్ అలీ (జర్నలిజం), చాంద్‌బీబీ (విద్య), మహ్మద్ రఫియుద్దీన్ ఫారూఖీ (ఉర్దూ భాషాభివృద్ధి), మహబూబ్ షరీఫ్ (కవిత్వం), మహ్మద్ మన్సూబ్‌ఖాన్ (కవిత్వం), మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ (ఫిక్షన్), డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖ్వావీ (పరిశోధన), మహ్మద్ మెహబూబ్ (విద్య), రఫియా నౌషీన్ (ఉర్దూ భాషాభివృద్ధి), మహ్మద్ అబ్దుల్ రఫీక్ (జర్నలిజం)కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రదానం చేయనున్నారు.

చేపల పెంపకం, విక్రయాల అధ్యయనం కోసం..

- 11 నుంచి 13 వరకు కర్నాటక పర్యటన :

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుసాయికుమార్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మత్స్యకారుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సర్కారు ముందడుగేసింది. చేపల పెంపకం, విక్రయాల అధ్యయనం కోసం తెలంగాణ ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13 వరకు కర్నాటకలో పర్యటించనుంది. చేపల పెంపకం, విక్రయా ల్లో బెంగుళూరు, మైసూరు తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు తీసుకుం టున్న జాగ్రత్తలపై మూడు రోజులపాటు అధ్యయనం చేయనుంది. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఆదర్శవంతమైన పాలసీ ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంమేరకు అధ్యయన బృందం బయలుదేరుతుంది. గత పదేండ్లలో చేపల పెంపకం పేరుతో బీఆర్ఎస్ నాయకులు కోట్లాది రూపా యలు లూటీ చేసినట్టు మెట్టుసాయికుమార్ విమర్శించారు. పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత రాష్ట్రంలో నూతన పాలసీ తేనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వరంగల్ ఎన్ఐటీలో ముగిసిన 'టెక్నో జియాన్-2024'

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వరంగల్ ఎన్ఐటీలో ఆదివారం 'టెక్నో జియాన్-24' ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు దాదాపు 58 ఈవెంట్‌లు, అతిథి ఉపన్యాసాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించగా చివరి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అనేక ఈవెంట్లు ప్రదర్శించారు. వోల్టేజ్ వోర్టెక్స్ ఈవెంట్, ప్రోడక్ట్ లాంచ్ ఈవెంట్, లాబ్రింత్ ఈవెంట్, చాక్లెట్ డిస్పెన్సర్, మెకానికల్ కిట్ అసెంబ్లీ, వండర్ కాస్మోస్ ఈవెంట్, సెల్యూషన్ జీ, ఈగేమ్స్ ఈవెంట్ తదితర ఈవెంట్లు నిర్వహించి ఆహూతులను ఆకట్టుకున్నారు. టెక్నోజియాన్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ విద్యార్థులకు డీజే నైట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మొత్తంగా టెక్నోజియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తమ్ముడు మోసం చేశాడని.. పిల్లలతో సహా చెరువులో దూకి అన్న ఆత్మహత్య

- సిద్దిపేటలో దారుణ సంఘటన
- తమ్ముడిని కష్టపడి చదివించి ప్రయోగకుడిని చేస్తే..
- తీసుకున్న అప్పు చెల్లించకుండా చెప్పుతో కొట్టి తరిమేశాడు
- అవమానం భరించలేక మనస్తాపంతో ఆత్మహత్య



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేటలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. తన తండ్రి మరణం తర్వాత అన్నీ తానై రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి తమ్ముడిని చదివించాడు. తీరా తమ్మునికి ప్రభుత్వ ఉద్యోగం రాగానే తనను దూరం పెట్టడంతో పాటు, అతనికి తాను అప్పుగా ఇచ్చిన డబ్బులను ఇవ్వకపోగా, వాటిని అడిగేందుకు వెళ్లిన తనపై చెప్పుతో కొట్టి, తనతో పాటు తన కొడుకును గెంటివేశాడు. ఈ అవమానాన్ని తట్టుకోలేక.. మనస్తాపంతో తన ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలచెరువులో ఆదివారం జరిగింది. సిద్దిపేట ఏసీపీ మధు, టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని నెహ్రూ పార్క్ వాసవీ కాలనీకి చెందిన తేలు సత్యం (48) సిద్దిపేట పట్టణంలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, సత్యంకు కొద్ది రోజుల క్రితం అనారోగ్య సమస్యలు రావడంతో పాటు, హార్ట్ సర్జరీ జరిగి రూ.9 లక్షల వరకు అప్పు అయింది. దాంతో తన తమ్ముడు అయిన శ్రీనివాస్‌ను తనకు ఇవ్వాల్సిన రూ.5.50 లక్షలు ఇవ్వాలని అడగ డానికి కొడుకుతో కలిసి అతని ఇంటికి వెళ్లాడు. డబ్బులు అడిగిన సత్యంను శ్రీనివాస్.. బూతు మాటలు తిట్టి చెప్పుతో కొట్టి, సత్యంని, అతని కొడుకును ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన సత్యం శనివారం రాత్రి.. తన భార్య శిరీషకు చెప్పకుండా పిల్లలు అద్వేష్ నందా (08), త్రివన్న హాసిని(06)ని తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లి చింతల చెరువుకు చేరుకొని అక్కడ సెల్ఫీ వీడియో తీసుకొని తన చావుకు కారణం తన తమ్ముడు శ్రీనివాస్ అని సూసైడ్ నోట్ సైతం రాసి పిల్లల్ని చెరువులోకి తోసి తానూ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లులకు పోటెత్తిన ధాన్యం

మద్దతు ధర కోసం రైతుల రాస్తారోకో

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ చెప్పినా వినని మిల్లర్లు
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, మేములపల్లిలో రైతుల ఆందోళన



నవతెలంగాణ-మిర్యాలగూడ/వేములపల్లి

నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, మేములపల్లి పరిసర ప్రాంతాల మిల్లులకు ఆదివారం భారీ ఎత్తున ధాన్యం లోడ్లతో రోడ్ల వెంట ట్రాక్టర్లు బారులు తీరాయి. దాంతో మిల్లర్ల యజమానులు సాకులు చెబుతూ తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దాంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసి రాస్తారోకో నిర్వహించారు. మిర్యాలగూడ రైస్ మిల్లులకు ఆదివారం ఒక్కరోజే 8వేల ట్రాక్టర్లకుపైగా ధాన్యం రాగా కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. కోదాడ రోడ్డు వైపు యాద్గార్‌పల్లి మిల్లుల్లో శైలోలు నిండిపోవడంతో ఉదయం 11గంటల వరకు ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. దాంతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రోడ్లపైనే ట్రాక్టర్లను నిలిపి రైతులు రాస్తారోకో చేశారు. కాగా నల్లగొండ రోడ్డులో వేములపల్లి మండల పరిధిలోని రైస్‌మిల్లుల వద్ద ట్రాక్టర్లు భారీ ఎత్తున తరలివచ్చాయి. రోడ్డుపై ఒక ట్రాక్టర్ ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో 2గంటల పాటు ధాన్యం ట్రాక్టర్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. మరోవైపు ధాన్యాన్ని రైతులు మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో చేశారు. రోడ్డుపై ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి అధికారులు తొలగించడంతో పలు మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. మహీంద్ర, పద్మ చింట్లు రకాలైన సన్న రకం ధాన్యానికి రూ.2150-రూ.2250 వరకు ధరలు వేస్తున్నారని రైతులు ఆరోపించారు.

అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష చేసినా అందని మద్దతు

రైతుల ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలంటూ శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్.. 8గంటల సమీక్ష నిర్వహించారు. సన్నరకం ధాన్యాన్ని రూ.2320 నుంచి రూ.2400 వరకు కొనుగోలు చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు చెప్పిన దానికి అంగీకరించారు. తీరా ఆదివారం మిల్లుల వద్ద భారీగా ట్రాక్టర్లు బారులు తీరడంతో పచ్చి గింజ, తేమశాతం అధికంగా ఉందని, ధాన్యం రంగు మారిందని, పలురకాల సాకులతో రూ.2150 నుంచి రూ.2250 వరకు కొనుగోలు చేశారు. కాగా ఎమ్మెల్యే అదనపు కలెక్టర్ చెప్పినా



రూ.2300లోపు ధరకు ధాన్యం కొనుగోలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన పంటను మిల్లర్లు గంటల వ్యవధిలోనే దోచుకుంటున్నారని ఆరోపించారు.

కొనుగోళ్లు నిలిపివేసిన మిల్లర్లు

వేముపల్లి మండలంలోని శెట్టిపాలెం సమీపంలో 15 రైస్ మిల్లులు ఉండగా మూడు, నాలుగు రైస్ మిల్లులు మాత్రమే ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నాయి. మిల్లర్లు సిండికేట్‌గా మారి కొన్ని మిల్లులు మాత్రమే కొనుగోలు చేయడంతో ధాన్యం లోడ్లు రహదారికి ఇరువైపులా నిలిచిపోయాయి. ఎన్నో వ్యయ ప్రయాసాలతో పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్మకోలేక శెట్టిపాలెం సమీపంలో మిల్లుల వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. అన్ని మిల్లులు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని బీష్మించుకు కూర్చున్నారు. దాంతో ఆదివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిల్లులు తిరిగి.. రూ.2,300 నుంచి రూ.2,320ల వరకు రకాన్ని బట్టి ధర చెల్లించాలని యాజమానులకు సూచించారు. కాగా, అప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు చేసిన మిల్లులు.. మరుక్షనం ఖరీదు లేవంటూ కొనుగోళ్లను నిలిపివేశారు. రెండు మూడేండ్లుగా రూ.2600 నుంచి రూ.2900 వరకు ధర పలికిన సన్నధాన్యం కొనే దిక్కు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ధాన్యం అమ్ముకోలేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ధాన్యానికి రూ.3వేల వరకు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న. రెవెన్యూ, పోలీస్ అధికారులు రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

రైతులకు క్వింటాకు రూ.3 వేలు చెల్లించాలి: పాదూరి

రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.3 వేలు చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో 3వేలు పెట్టి కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం ఖరీదు లేదంటూ చౌకగా కొనేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్నారు. జిల్లా అధికారులు మిల్లుల్ని సందర్శించి కొనుగోలు చేయని మిల్లులపై చర్య తీసుకోవాలని కోరారు.

లెబనాన్, గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులు

గాజాలో 13 మంది చిన్నారులతో సహా 30 మంది మృతి



డిర్ అల్-బాలా, గాజాస్ట్రిప్ : లెబనాన్, ఉత్తర గాజా స్ట్రిప్‌లపై ఆదివారం ఇజ్రాయిల్ నరమేధం కొనసాగించింది. ఈ దాడుల కారణంగా గాజాస్ట్రిప్‌ల్లో 13 మంది చిన్నారులతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. లెబనాన్‌లో మరో 20 మంది మరణించారు. లెబనాన్‌లో తూర్పు బెకా లోయలోని బాల్‌బెక్ సమీప ప్రాంతంపైన, బీరూట్‌కు ఉత్తరాన ఉన్న అల్మాట్ గ్రామంపైన ఇజ్రాయిల్ ఆదివారం వైమానిక దాడికి పాల్పడింది. ఈ దాడుల్లో 20 మంది మరణించారని, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దాడుల గురించి ఇజ్రాయిల్ ఇప్పటి వరకూ స్పందించలేదు.

ఉత్తర గాజా జబాలియా పట్టణంలోని శరణార్థుల శిబిరంపైన, ఒక నివాస గృహంపైన ఆదివారం ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 30 మంది మరణించగా, మరో 30 మంది గాయపడ్డారు. మృతుల్లో 13 మంది చిన్నారులు, తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. శరణార్థుల శిబిరం వద్ద 25 మంది మరణించారని, ఈ ప్రాంతంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గాజా నగరంలోని అల్ అహ్లీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఫాడెల్ నయీమ్ తెలిపారు. నివాస గృహంపై చేసిన దాడిలో హమాస్ ప్రభుత్వంలోని మంత్రి వేల్ అల్-ఖౌర్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలు మరణించారు. ఈ విషయాన్ని పాలస్తీనా పౌర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉగ్రవాదులను ఏరివేసే లక్ష్యంతోనే ఈ దాడులు చేశామని చెబుతున్న ఇజ్రా యిల్... చిన్నారులు, మహిళలే అధిక సంఖ్యలో మరణించడంపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

ఇజ్రాయిల్ దిగ్బంధంలో పలు పట్టణాలు

జబాలియాతో పాటు దాని సమీప పట్టణాలైన బీట్ లాహియా, బీట్ హనౌన్‌లను ఇజ్రాయిల్ గత నెల నుంచి దిగ్బంధించింది. మానవతా సహాయాన్ని మాత్రమే అనుమతిస్తోంది. ఉత్తర గాజాలో ఇప్పటికే కరువు ఆసన్నమైందని, ఇక్కడకి అనుమతిస్తున్న మానవతా సహాయం స్థాయిని పెంచాలని ఆహార భద్రతను పర్యవేక్షించే ప్యానెల్‌కు చెందిన నిపుణులు శుక్రవారం తెలిపారు. గాజాపై ఇజ్రాయిల్ గత 13 నెలల నుంచి చేస్తున్న దాడుల కారణంగా ఇప్పటి వరకూ 43 వేల మందికి పైగా మరణించారు. గాజాలో అత్యధిక ప్రాంతం శిథిలావస్థకు చేరుకుంది. లెబనాన్‌కు కూడా ఇజ్రాయిల్ ఈ దాడులను విస్తరించింది. లెబనాన్‌లో మూడు వేల మందికి పైగా మరణించారు.

ప్రేమోన్మాది ఘాతుకం



- ప్రేయసిని దూరం చేశారనే కోపంతో యువతి తండ్రిపై కాల్పులు
- సరూర్ నగర్ పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ - దిల్‌సుఖ్ నగర్

ప్రేమించిన యువతిని దూరం చేశారనే కోపంతో యువతి తండ్రిపై ప్రేమోన్మాది కాల్పులు జరిపిన ఘటన ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సరూర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన బల్వీందర్‌సింగ్ సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న 23 ఏండ్ల యువతిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న యువతి తండ్రి రేవంత్ ఆనంద్.. తన కూతురిని ఉన్నత చదువుల కోసం అమెరికాకు పంపించాడు. దాంతో బల్వీందర్‌సింగ్ తాను ప్రేమించిన యువతిని దూరం చేశాడనే ఆగ్రహంతో యువతి తండ్రి ఇంటికి వెళ్లి తుపాకీతో కాల్పు జరిపాడు. దాంతో రేవంత్ ఆనంద్ కంటి నుంచి బుల్లెట్ దూసుకుపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. రేవంత్‌ను హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న సరూర్ నగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

- నేత కార్మికులను ఆదుకోండి..
- వస్త్ర వ్యాపారాన్ని చంపేలా సీఎం వ్యవహరించొద్దు : కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల

'నేను సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉండటం వల్లనే సిరిసిల్ల ప్రజలపై ముఖ్యమంత్రి ప్రేమ కలగడం లేదంటే.. ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేస్తానని' బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రకటించారు. కాని మంచిగా నడుస్తున్న వస్త్ర వ్యాపార రంగాన్ని చంపేసే విధంగా ఓ శాడిస్టులా వ్యవహరించడం మంచిది కాదని సూచించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఆత్మహత్య చేసుకున్న దంపతుల ముగ్గురు పిల్లలను తన సొంత బిడ్డల్లా చూసుకుంటానని, వారు ఎంత వరకు చదువుకున్నా అంత వరకు చదివించే పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని భరోసానిచ్చారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న అమర్-స్రవంతి దంపతుల కుటుంబాన్ని ఆయన ఆదివారం పరామర్శించారు. ముగ్గురి పిల్లల చదువు బాధ్యత తనదేనని, తలా రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 10లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 11 నెలల్లో సిరిసిల్లలో 20 మంది, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో 14 మంది ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 34 మంది నేత కార్మికుల ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతి తరమడంతో.. కేజీబీవీ భవనంపై నుంచి పడిన విద్యార్థిని

తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-ఏర్గట్ల

కోతి తరమడంతో భవనం రెండో అంతస్తు నుంచి విద్యార్థిని కింద పడి తీవ్ర గాయాలపాలైన ఘటన నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆదివారం జరిగింది. గాయాలైన విద్యార్థినిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన కర్రె అంజలి ఏర్గట్లలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతుంది. ఇటీవలే తన స్వగ్రామం వెళ్ళి ఆదివారం తిరిగి వచ్చింది. రెండో అంతస్తులో తన బట్టలు ఆరేసుకునేందుకు వెళ్లగా.. ఒక్కసారిగా కోతి తరమడంతో భయాందోళనకు గురై అక్కడున్న కిటికీలోనుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. గమనించిన కేజీబీవీ ఉపాధ్యాయులు హుటాహుటిన బాలికను అంబులెన్స్‌లో మెట్‌పల్లి మండలం మేడిపల్లి ఎముకల వైద్యశాలకు తీసుకెళ్లింది. ఎడమ చేయి విరగడంతో పాటు నడుముకు, వెన్నుపూసకు తీవ్రగాయాలైనట్టు వైద్యులు తెలిపినట్టు సమాచారం. గాయాల తీవ్రతను తెలుసుకునేందుకు స్కానింగ్ సెంటర్‌కు, ఆపై మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు సమాచారం. విషయం తెలియడంతో అంజలి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనై ఆస్పత్రికి వెళ్లారు.

కేజీబీవీలు, గురుకులాలు, హాస్టళ్ల వద్ద కోతుల బెడద

జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతుంది. విద్యార్థులు తమ దుస్తులను ఆరేసుకునేందుకు భవనం మీదకు వెళ్లిన క్రమంలో అక్కడే గుంపులుగా సంచరిస్తున్న కోతులు.. ఒక్కసారిగా తరిమినట్టు చేస్తుండటంతో విద్యార్థులు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు. పలు చోట్ల కోతులు దాడులు సైతం చేస్తున్నాయి.

పిల్లలపైకి దూకి కరుస్తూ, రక్కుతున్నాయి. దాంతో అక్కడ ఉండేందుకు వారు జంకుతున్నారు. అటు విద్యార్థులతో పాటు ఇటు సిబ్బంది, ఉపాధ్యాయులు సైతం కోతుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి కోతుల బెడద తీరేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం

- సహాయక చర్యలు చేసిన మంత్రి పొన్నం
- క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-కొండపాక

సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం రామచంద్రపూర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలం రామచంద్రాపూర్ వద్ద డీసీఎం వ్యాన్‌ను ఓ ఆటో వెనక నుంచి ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే ప్రమాదాన్ని గ్రహించి క్షతగాత్రులను పరిశీలించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులతో పోలీస్ సిబ్బందిని హాస్పిటల్‌కి పంపించారు. గజ్వేల్ కాంగ్రెస్ నాయకులను హాస్పిటల్‌కి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అదేవిధంగా చూడాలని సూచించారు. ప్రమాద బాధితులకు మంచి వైద్యం అందించాలని డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడ్డ బాధితులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. కుకునూర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు..

- అమరుడైన ఆర్మీ.. ముగ్గురు జవాన్లకు గాయాలు
- కిశ్త్‌వాడ్ జిల్లాలో ఘటన



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రత బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ ఆర్మీ అధికారి అమరుడయ్యాడు. మరో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కిశ్త్‌వాడ్ జిల్లాలో ఇద్దరు గ్రామ రక్షక భటులను (విలేజ్ డిఫెన్స్ గార్డ్స్) ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి హతమార్చారు. దీంతో వారిని పట్టుకునేందుకు బలగాలు స్థానికంగా పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి.

ఈ క్రమంలోనే కేశ్వాన్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రత సిబ్బందికి మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. "ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి అందిన నిఘా సమాచారం ఆధారంగా బలగాలు సంయుక్త ఆపరేషన్ ప్రారంభించాయి. ఇటీవల ఇద్దరు గ్రామ రక్షక భటులను హతమార్చిన ఉగ్రవాదులు కూడా వీరే. ఎన్‌కౌంటర్‌లో తొలుత జేసీవో సహా నలుగురు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. చికిత్స పొందుతూ జేసీవో ప్రాణాలు కోల్పోయారు" అని సైన్యానికి చెందిన వైట్ నైట్ కోర్ ట్వీట్ చేసింది.

ఆ జేసీవోను ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) నాయబ్ సుబేదార్ రాకేశ్ కుమార్‌గా గుర్తించారు. విధి నిర్వహణలో అమరుడైన రాకేశ్ త్యాగానికి సెల్యూట్ అని వైట్ నైట్ కోర్ తెలిపింది. ఈ ప్రాంతంలో ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నట్టు భావిస్తున్నామని, ఆపరేషన్ కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

దోపిడీకి పాల్పడితే జైలుకే..

- రాంచీలో ప్రధాని మోడీ రోడ్‌షో



రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని మోడీ రాంచీలో రోడ్ షో నిర్వహించారు. దాదాపు 3కి.మీల రోడ్‌షో చేపట్టిన ఆయన.. ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార రథంపై నిలబడి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. రాంచీలోని ఓటీసీ మైదానం వద్ద ప్రారంభమైన ఈ రోడ్‌షో న్యూ మార్కెట్ చౌక్ వరకు సాగింది. జేఎంఎం సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వ పాలనలో ఇసుక, అటవీ సంపద, నీటి వనరుల దోపిడీతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీకి సైతం లంచం వసూలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజా ధనాన్ని దోచుకుంటే మోడీ సర్కార్ సహించదన్న ఆయన.. దోపిడీకి పాల్పడితే జైలు జీవితం గడపాల్సి ఉంటుందని హెచ్చరించారు. జార్ఖండ్‌కు రాబోయే 25 ఏండ్లకు వచ్చే ఐదేండ్లు ఎంతో కీలకమని, ప్రజలు వేసే ఓటు రాష్ట్రాభివ ృద్ధికి దోహదం చేసేలా ఉండాలన్నారు.

సర్వేను అడ్డుకుంటే ఊరుకునేది లేదు

● బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మదేశి రాజేందర్



నవ తెలంగాణ-ముషీరాబాద్

సమగ్ర కుటుంబ సర్వేను అడ్డుకుంటే ఊరుకునేది లేదని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మదేశి రాజేందర్ అన్నారు. ఆదివారం తన ఇంటికి వచ్చిన సర్వే సిబ్బందికి రాజేందర్ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. బీసీ కులగనణ కోసం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విమర్శించడం పద్ధతి కాదన్నారు. కుటుంబ సర్వేతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ముషీరా బాద్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు మదేశి కళావతి, మహిళా గ్రూప్ సభ్యులు మహేశ్వరి, శివాని తదితరులు పాల్గొన్నారు.

25జీవోనూ రద్దు చేయాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి క్వాలిఫైడ్ తెలంగాణ హిందీ పండిత్ అభ్యర్థులు గత ప్రభుత్వం తీసుకొచ్చిన 25జీవోను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 17న సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం కొనసాగు తుందని అర్హత పొందిన ప్రతి అభ్యర్థి నాంపల్లిలోని హిందీ భాష కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 25కు సవరణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'చిన్న వయస్సు నుండే రహదారి భద్రత స్పృహను పెంపొందించాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చిన్న వయస్సు నుండే రహదారి భద్రత స్పృహను పెంపొందించాలని హెచ్ఎంఎస్ఐ సేఫ్టీ రైడింగ్ విభాగం జనరల్ మేనేజర్ హర్ ప్రీత్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించే దిశగా హెూండా మోటర్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) హైదరాబాద్‌లో కీలకమైన రోడ్ సేఫ్టీ సదస్సును నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 100కి పైగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. హెచ్ఎంఎస్ఐ గ్లోబల్ సేఫ్టీ స్లోగన్ 'అందరికీ భద్రత' ద్వారా ఈ ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిన వయస్సు నిర్దిష్ట మాడ్యూల్స్ పాఠశాల పాఠ్యాంశాలలో విలీనం చేయడానికి ఉద్దేశించబడిందన్నారు. విద్యార్థులకు అవసరమైన రహదారి భద్రత పరిజ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని, ఎడతెగని ప్రయత్నాలతో హెచ్ఎంఎస్ఐ ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 9 రోడ్డు భద్రతా సమావేశాలను విజయవంతంగా నిర్వహించిందని, అవి ఇప్పటికే 1,200 పాఠశాలలకు పైగా చేరాయని, దేశ వ్యాప్తంగా 3 లక్షల మందికి పైగా విద్యార్థులకు రోడ్డు భద్రతా అవగాహన విద్యనందించిందన్నారు.ఈ విజయాల ఆధారంగా హెచ్ఎంఎస్ఐ రాబోయే నెలల్లో మరిన్ని నగరాలకు తన రహదారి భద్రతా కార్యక్రమాలను విస్తరించేందుకు సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం

● కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధమని అర్హులైన వారందరూ నూతనంగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం కాచిగూడ డివిజన్ పరిధిలోని ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ లిస్టులో తప్పు ఒప్పులను సరిచేసుకోవాలని, ఓటు హక్కు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీమ్ రాజు, సంతోష్, కృష్ణ, రవి యాదవ్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఈనెల 12న తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి డాక్టర్ రాపోలు సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. పాల్గొనబోయే ప్రతి విద్యార్థి ఈ క్రింది ఫోన్ నంబర్ లలో 9963449557, 9441779688 సంప్రదించాలని కోరారు.

సీఎం గారు.. 'టీప్రైమ్'పై ప్రకటన చేయండి..!

● ఆరేండ్లుగా జీవోకు పరిమితమైన టీ-ప్రైమ్ స్కీమ్

● ఎస్సీ, ఎస్టీల తరహాలో మైనార్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించాలి

● తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల టీ-ప్రైడ్ తరహాలోనే మైనార్టీ ఔత్సాహిక పారిశ్రామికవేతలను ప్రోత్సహించే టీ-ప్రైమ్ పథకం అమలుపై మైనార్టీ సంక్షేమ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ (టెక్‌టీప్) వ్యవస్థాపక డైరెక్టర్ అబూ ఫతేసయ్యద్ బందగీ బాషా రియాజ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేండ్ల క్రితం ప్రకటించిన టీ-ప్రైమ్ స్కీమ్ కేవలం దస్త్రాలకు పరిమితిమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఒక పర్యాయం నిధులు కేటాయించినా.. మార్గదర్శకాలు రూపొందిచకపోవడంతో పథకం అమలు కాస్త అటకెక్కిందని తెలిపారు. గతంలో దళితుల తరహాలోనే మైనార్టీ వర్గాల పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని టెక్‌టీప్ పలుమార్లు చేసిన విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలూ పంపించిందని ఆయన గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని సాధ్యసాధ్యాలను పరిశీలించి దళితరుల తరహాలోనే మైనార్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సమానంగా ప్రయోజనాలు కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. 2018 మార్చి 3న జీవో నెంబర్ 16 ద్వారా టీ-ప్రైమ్ స్కీమ్ వర్తింపజేసిందని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 25 కోట్లు కేటాయించడంతో మైనార్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంతో సంతోషించారనీ, అప్పటి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ పథకాన్ని అమలు చేయడానికి మార్గదర్శకాల రూపొందించాలని మెమొ జారీ చేసిందని, కానీ ఇప్పటివరకు ఆరేండ్లు గడిచినా తదుపరి ఉత్తర్వులతో కూడిన మార్గదర్శకాలు కానీ, పథకం అమలుకు సంబంధించి ఎలాంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదని ఖాద్రీ ఆవేదన వ్యక్తం చేశారు. సచార్, రంగానాథ్ మిశ్ర కమిటీ సిఫార్సులు ముస్లింల జీవన పరిస్థితి దళితుల కంటే అధ్వానంగా ఉందని స్పష్టం చేస్తోందని రియాజ్ ఖాద్రీ తెలిపారు. మైనార్టీలు అధిక శాతం ట్రాన్స్‌పోర్టు, హెూటల్, సర్వీస్, నిర్మాణ రంగాల్లో కొనసాగుతున్నారని, వారికి కనీస ఆర్థిక ప్రోత్సాహం లేదన్నారు. ఔత్సాహికులను ప్రోత్సహిస్తే మైనార్టీ వర్గాల అభివృద్ధి సాధ్య మవుతుందని పేర్కొన్నారు. టీ-ప్రైమ్ అమలు చేస్తే ఎలాంటి పూచీకత్తు అవసరం లేకుండా పరిశ్రమల స్థాపనకు రుణాలు, ప్రోత్సాహకాలు, రాయితీలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైనార్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీ- ప్రైమ్ వరంప్రసాదంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నవంబర్ 11న నిర్వహించే జాతీయ మైనార్టీ సంక్షే మ దినోత్సవంలో టీ-ప్రైమ్ స్కీమ్ అమలుపై ప్రకట న చేసి మైనార్టీల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని టెక్‌టీప్ డైరెక్టర్ ఖాద్రీ విజ్ఞప్తి చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘ టన నాంపల్లి ప్రభుత్వ రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ప్రభుత్వ రైల్వే స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భాగ్యరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైటెక్ సిటీ -హఫీజ్ పెట్ వద్ద రైలు ఢీకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఒంటి ఎడమ ఛాతిపై పుట్టుమచ్చ ఉందని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించామని తెలిపారు. మృతిని సంబంధికులు ఎవరైనా ఉంటే నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదిం చవచ్చని సూచించారు.

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చు



● హైడ్రా కమిషనర్ రంగనాథ్

నవతెలంగాణ-ముషీరాబాద్

పట్టుదల ఏకాగ్రత కఠోర శ్రమతో చదివితే ఏదైనా సాధించవచ్చునని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతీ, యువకులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ బాలలత ఆధ్వర్యంలో బైలోరో ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన కల్పతరు 3.0 విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి ఎంతోమంది యువత సివిల్స్‌లో సత్తా చాటడానికి అశోక్ నగర్‌లోని కోచింగ్ సెంటర్‌లలో కోచింగ్ తీసుకుంటూ శ్రమిస్తారన్నారు. అటువంటి ఎంతోమంది విద్యార్థులకు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ బాలలత ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తూ వారికి ఉన్నతమైన శిక్షణ అందిస్తున్నారన్నారు. పోటీ పరీక్షల్లో కొన్ని కొన్ని సార్లు విజయం సాధించకపోయినా నిరుత్సాహ పడవద్దు తాము ఎంచుకున్న రంగంలో విజయం సాధించకపోతే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకొని రాణించాలన్నారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ ఈ కల్పతరు స్కాలర్‌షిప్ టెస్ట్ కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10,000 లకు పైగా యువతి, యువకులు దరఖాస్తు చేయగా సుమారు 4000 మందికి పైగా హాజరవ్వటం జరిగిందని తెలిపారు. వారిలో నుండి ప్రతిభ కనబరిచిన టాప్ 10 విద్యార్థులకు అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్‌తో పాటుగా టాప్ 200 వచ్చినవారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్ ను బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ కల్పతరు స్కాలర్‌షిప్ టెస్ట్ సంవత్సరానికి 2 దఫాలుగా జరుగుతుందని గత మూడు సంవత్సరాలుగా ఎంతోమంది గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడంలో తమ వంతు పాత్ర పోషిస్తూ వారిని ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల యువతకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

● 26న ప్రభుత్వాలకు హెచ్చరిక అర్జీలు ఇవ్వండి

● టీయుసీఐ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జీ పిలుపు



నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన టీయుసీఐ 3వ తెలంగాణ రాష్ట్ర మహాసభలో ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ పార్లమెంట్‌లో చర్చ జరగకుండా కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపకుండా నాలుగు లేబర్ కోడ్స్‌ని కేంద్ర, రాష్ట్రాల మంత్రి వర్గాలు ఆమోదించి, అమలు చేయాలనుకోవటం అప్రజాస్వామిక విధానమని మండపడ్డారు. బడాకార్పొరేట్ కంపెనీల దోపిడీకి అనుకూలంగా చట్టాల సవరణ చేయటం, కార్మికుల విద్రోహ చర్యలని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కార్మిక, కర్షక కేంద్ర సంఘాలు 26న తలపెట్టిన హెచ్చరిక అర్జీలను అధికారులకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని సంఘాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. వివిధ రంగాల కార్మికుల సమస్యలపై సంఘటిత పోరాటాలు తీవ్రతరం చేయాలన్నారు. ఈ సభకు టీయుసీఐ రాష్ట్ర అధ్యక్షులు దొంతి రాజేష్ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, కర్నాటక కార్యదర్శి బసవలింగప్పా మాట్లాడుతూ యూనియన్‌ని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వేమూరి భాస్కర్ రాష్ట్ర నివేదికను ప్రవేశపెట్టారు. ఏఐకేఎమ్ స్టేట్ ప్రెసిడెంట్, సుధమళ్ళ భాస్కర్. మాన్య బుజేందర్ కార్యదర్శి,రుద్రంగి సుధా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంగం కన్వీనర్ హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షులుగా దొంతి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా వేమూరి భాస్కర్, కార్యదర్శిగా మహ్మద్ ఖాశీం, ఉపాధ్యాకులుగా లింగస్వామి, కోశాధికారిగా యాకయ్య, సభ్యులుగా డి. అనిల్, హనుమంతరావు, ప్రభాకర్, కె. వీరయ్య ఎన్నికయ్యారు. డోలక్ యాదగిరి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గీతాలు ఆలపించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

● సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఎల్‌ఐజీ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తూ హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కే. వీరయ్య మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరంలో కంటి, చెవి ముక్కు గొంతు, డెంటల్, బీపీ - షుగర్, జనరల్ విభాగాలలో ఉచిత వైద్య సేవలు అందించామని తెలిపారు. వైద్యంలో వ్యాపారీకరణ పెరిగిపోయి, ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా వైద్య రంగాన్ని ప్రయివేట్‌కు అప్పగించి తన బాధ్యతల నుండి వైదొలుగుతుందని విమర్శించారు. వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో హెచ్‌సీఎఫ్ పనిచేస్తుందని మా వంతు బాధ్యతగా వివిధ వైద్య సంస్థల సహకారంతో ఈ మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి సహకరించిన నోవా ఆస్పత్రి మోహన్ రెడ్డి, ప్లానెట్ ఆప్టిక్ ఐ క్లినిక్ అనిల్ కుమార్, డెంటల్ సర్జన్ ఆదిత్య సందీప్‌కు హీల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ జనరల్ ప్రాక్టీషనర్స్ డాక్టర్ అనిష్ రెడ్డి, డాక్టర్ నికిత కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ సి ఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, పి.నాగేష్, హస్మిత, సంగీత, మాధవి, లలిత, మోహన్, రాజమౌళి, గోపాల్, సైదులు, శంకర్, రమేష్ , శంకరయ్య నాయకత్వం వహించారు.

రజక వృత్తిదారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



● జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి

నవతెలంగాణ-ధూల్‌పేట్

రజక వృత్తిదారులకు ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సెంట్రల్ జిల్లా అధ్యక్షులు చారగొండ వెంకటస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నాంపల్లి జోన్ కమిటీ ఎస్. రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేటికీ రజకవృత్తిదారులపై గ్రామీణ ప్రాంతంలో కుల వివక్షత, దౌర్జన్యాలు సామాజిక దాడులు పెత్తందారి వర్గాలచే కొనసాగుతున్నయన్నారు. వాటినీ అరికట్టడానికి సామాజిక భద్రత ప్రత్యేక చట్టం కల్పించి ఆదుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నేటికి రజక వృత్తిదారులకు కులవృత్తి జీవన ఆధారంగా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. నిరుపేదలుకు ఇంద్రమ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, బీసీ(ఏ) ఉన్నటువంటి రజకులకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, ప్రభుత్వ సంస్థలలో, ప్రభుత్వ కార్యాలయలో రజకులకే వృత్తి కాంట్రాక్టులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి పాత రజక సంఘాలన్నీ రెన్యువల్ చేసుకోవాలని, కొత్త సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సహకార సంఘానికి అనుసంధానం చేసుకోవాలన్నారు. రజక వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని, రజకులకు రక్షణ చట్టం కల్పించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి రజకులకు ప్రభుత్వ భూములలో మోడ్రన్ దోబి గాట్లు, కమ్యూనిటీ హాల్ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే రజక వృత్తిదారులని ఆదుకోవడానికి రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి రూ: 10 లక్షల వరకు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సిహెచ్ నగేష్ , జిల్లా ఉపాధ్యక్షురాలు వి యాద్దమ్మ, సిహేష్ పద్మ, జోన్ సభ్యులు లక్ష్మి, వి రమేష్, చంద్రమోహన్, విఠల్ యాదయ్య, జే బాబు, రవీందర్, పద్మ, శివ, కామేష్, కేశవులు వెంకటేశ్వర్లు, పాండు, వేంకటేష్, బాబు, శ్రీకాంత్, భరత్ గమల్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులపై అవగాహన పెంచుకోవాలి

● ప్రముఖ న్యూట్రీషన్ ట్రైనర్ దిలీప్ కులకర్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

నేడు ఉన్న కల్తీ సమాజంలో ప్రజలు నిత్యావసర వస్తువులపైన అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యూట్రీషన్ ట్రైనర్ దిలీప్ కులకర్ణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రైట్ కాన్సెప్ట్ మార్కెటింగ్ (ఆర్సీఎం) ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్ కులకర్ణి మాట్లాడుతూ బియ్యం, పప్పులు, మంచినూనె, ఎరువులు, కారం, పసుపు తదితర వస్తువుల నాణ్యతను తెలుసుకున్నాకే వినియోగించాలని ఆయన సూచించారు. టీవీల్లో వచ్చే ప్రకటనలను చూసి వినియోగదారులు మోసపోవదన్నారు. ముఖ్యంగా న్యూట్రిషన్ ఆహార పదార్థాలపైన అవగాహన పెంచుకోకపోతే అనేక అర్థాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ ఇన్‌చార్జి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రహ్మణ సమైక్య నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-అంబర్‌పేట

శ్రీ విశ్వబ్రాహ్మణ సమైక్య అంబర్‌పేట నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ వ్యవస్థాపకులు ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ జైన్ కుమార్ విశ్వకర్మ చీఫ్ ఎలక్షన్ అధికారి, కేఎంఎం శ్రీకాంత్ చారి, ఎలక్షన్ అధికారి ఆగాచారి, ఎలక్షన్ అధికారులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇన్‌చార్జి శ్రీరామ చారి, చైర్మెన్ కొక్కొండ స్వామి చారి, వైస్ చైర్మెన్ గన్నోజ్ కృష్ణ చారి, అధ్యక్షులుగా వెన్నోజు కృష్ణ చారి, ప్రధాన కార్యదర్శి సింగోజు నరేంద్ర చారి, కోశాధికారి కంది పెంటా చా రి, ఉప కోశాధికారి వెల్దోజు నాగరాచారి, ఉపాధ్యక్షులు ధర్మాజీ బాల చంద్రం చారి, బ్రహ్మాజీ, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో వేములవాడ రాజన్న కళ్యాణం

నవతెలంగాణ-ముషీరాబాద్

భక్తి టీవీ కోటి దీపోత్సవం మహా కార్యక్రమం అశేష జన వాహిని మధ్య మొదలైంది. విశేషంగా రెండో రోజు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అనంతరం స్వామి అమ్మవార్లను నంది వాహనంపై ఊరేగించారు. ఈ దీపోత్సవంలో కుర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠం శ్రీ సిద్దేశ్వరానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం నిర్వహించారు. నండూరి శ్రీనివాస్ తన ప్రవచనంతో భక్తుల్లో భక్తి భావాన్ని వెలివెత్తించారు. వివిధ పండితులు భక్తుల చేత స్వయంగా నర్మదా బాణ లింగానికి కోటి భస్మార్చన చేయించారు. ఈ కోటి దీపోత్సవ కార్యక్ర మానికి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి వీహెచ్‌పీ అధ్యక్షులు అలోక్ కుమార్ హాజరై స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ కార్తీక మాస పుణ్య తిథుల్లో భక్తి టీవీ కోటి దీపోత్సవ కార్యక్రమం ఆధ్యాత్మిక పరిమ ళాలు వెల్లవిరుస్తుందన్నారు. ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.



మైనారిటీ ఉపకార వేతనాలు తక్షణమే చెల్లించాలి



● మేవా రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మసూదుద్దీన్ అహ్మద్

● మైనారిటీ కమిషన్‌కు వినతి పత్రం

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రయివేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఎంటీఎఫ్, ఆర్టీఎఫ్ ఉపకార వేతనాలు తక్షణమే విడుదలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మసూదుద్దీన్ అహ్మద్ అన్నారు. మేవా ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మైనారిటీ కమిషన్ చైర్మెన్ తారిఖ్‌అన్సారీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు ఏళ్లుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో ట్యూషన్ ఫీజు చెల్లించాలని యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. ఇప్పటికే కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సైతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ధృవీకరణ పత్రాలు జారీ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

శ్రీ విశిష్ట సెమినార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అపోలో ఎఐహెచ్‌ఏ డాక్టర్ ఎం.చంద్రకాంత్, డాక్టర్.కె లక్ష్మీ ప్రసాద్ ద్వారా ఆయుష్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్, ఆయుర్వేద అంశంపై త్రయోగ్ శ్రీ విశిష్ట సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో శ్రీ విశిష్ట సూపర్ స్పెషాలిటీ ఆయుర్వేద డాక్టర్ లక్ష్మీప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సెమినార్ నిర్వహించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

'వంట కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ గత ఏడాది నుంచి కోడి గుడ్లు, అల్పాహారం బిల్లులతో పాటు వంట కార్మికులకు గడిచిన 6 నెలలుగా వేతనా బిల్లులు రావడం లేదన్నారు. ఈ విధంగా ఉంటే కార్మికులు ఎలా జీవించాలని, పిల్లలకు వంటలు ఎలా చేసిపెట్టాలో రాష్ట్ర ప్రభుత్వం ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ఒక్క కోడిగుడ్డుకు రూ.5 ఇస్తోందని, బహిరంగ మార్కెట్‌లో రూ.7కు లభిస్తుందన్నారు. రెండు రూపాయల నష్టంతో ఎలా అందించాలని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కోడిగుడ్లు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని, లేకపోతే వాటిని రాష్ట్ర వ్యాప్తంగా అందించలేమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం వెంటనే చెల్లించాలని, వంట కార్మికులను రాజకీయ ఇతరత్రా కారణాలతో ఎవరిని తొలగించకుండా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 22న యూనియన్ రాష్ట్ర నిర్మాణ మహా సభలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు కుంటాల రాములు, ముంతాజ్, వెంకటేష్, కార్యదర్శులు ప్రసాద్, రామకృష్ణ, లక్ష్మణ్, వసంత, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం నవంబర్ 11, 2024 www.navatelangana.com

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కీసర

టిప్పర్ లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని కుషాయిగూడ ప్రాంతానికి చెందిన నల్ల పెంటయ్య (50) తన స్కూటీపై కుషాయిగూడ నుండి తన సొంత ఊరు వరదరాజ్ పూర్, మర్కుక్ మండలం, సిద్దిపేట జిల్లాకు వెళ్తుండగా మార్గ మధ్యలో కీసర గ్రామంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గరకు రాగానే అతడి వెనుక నుండి వస్తున్న టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి స్కూటీని కొట్టింది. దీంతో పెంటయ్య తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. కాగా లారీ డ్రైవర్ కదారి రాజుగా గుర్తించారు.

శ్రేయా పాండేకు అభినందనల వెల్లువ



నవతెలంగాణ-అల్వాల్

మిస్ టీన్ యూనివర్స్ ఏషియా టైటిల్‌ను సాధించిన శ్రేయా పాండేను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రేయా పాండే, ఆమె తల్లిదండ్రులు ఎస్.కె పాండే, ప్రియా పాండేలను అభినందించారు. శ్రేయాపాండే ఈ అద్భుతమైన విజయం సాధించడంపై మల్కాజిగిరి వాసులు గర్వించదగిన విషయం అని ఎమ్మెల్యే అన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో పి. మల్లికార్జున గౌడ్, పద్మిని, సుభాష్ అగర్వాల్, విపిన్ ఆచార్య, మహిపాల్ రెడ్డి, అజిత్ సాయి, అవినాష్, మోహన్ పాఠక్, జయ ప్రకాష్ ఓజా తదితరులు పాల్గొన్నారు.

చర్చిల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని చర్చిల అభివృద్ధి తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ చర్చిలో ఆదివారం జరిగిన హార్వెస్ట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్యాతిథులుగా స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేవుడి యందు భక్తితో మెలగాలని కోరారు. తన తల్లి పేరుతో పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న అరుంధతి ఆస్పత్రి వారి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, పాస్టర్ బక్క ఏలియా, యేసు రత్నం, ప్రదీప్ ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ గుప్తా జన్మదిన వేడుకలు కర్మన్ ఘాట్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ మిత్ర మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో పలువురు లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలాజీ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ది నాగరాజు గుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, రామిణి తిరుమలేష్ గుప్తా, తాటి శ్రీనివాస్ గుప్తా, చందా సంతోష్ గుప్తా, మిరియాల అరుణ్ గుప్తా, గజ్జల రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్‌లో ఎమ్మెల్యే బండారి పర్యటన

నవతెలంగాణ-కాప్రా



కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్‌లోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం పర్య టించారు. అక్కడ నెలకొన్న సమస్య ల గురించి స్థానికులతో చర్చించారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, బంక వెంకటేష్, గౌస్ , రహీం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ సంఘం సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-కాప్రా

మౌలాలి హెచ్‌బీ కాలనీలో నూతనంగా ఎన్నికైన రాజస్థానీ మార్వాడీ సంఘం సభ్యులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌లు ఆదివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలాలి హెచ్‌బీ కాలనీ రాజస్థానీ మార్వాడీ సంఘం నూతన అధ్యక్షులుగా కైలాష్ ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. రాజస్థానీ సంఘం సభ్యులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకే మరోసారి అధ్యక్షులుగా ఎన్నుకున్నారని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు కైలాష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మూడోసారి రాజస్థానీ సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. హెచ్ బీకాలనీలో కార్పొరేటర్ ప్రభుదాస్ సహకారంతో రాజస్థానీ సంఘం సభ్యుల అభ్యున్నతికి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నవీన్ గౌడ్, కుమార్, నిస్సార్ అహ్మద్ గోరి, నరేందర్, రాజస్థానీ మార్వాడీ సంఘం ఉపాధ్యక్షులు సోహన్ లాల్ సిర్వి, మనోజ్ శర్మ, కార్యదర్శులు దగ్లారాం, జాయింట్ సెక్రటరీ నరేందర్ సాంక్ల, కోశాధికారి కిషోర్ శర్మ, మీడియా ప్రభారి పవన్ కుమార్‌శర్మ, సలహాదారులు చేతన్‌శర్మ, బాబూలాల్ ములెవ, దుర్గారావు పవార్,నారాయణ్‌లాల్ పరిహార్, చెనరాంపరిహార్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో పెండింగ్ పనులను పూర్తి చేస్తా



- బీఆర్ఎస్ నాయకులు గద్వాల్ వంశీ ముదిరాజ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని ఆండాల్ నగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో జరుగుతున్న రెండు ఫీట్‌ల ఆర్‌సీసీ అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మౌలాలి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు గద్వాల వంశీ ముదిరాజ్ మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలో కొన్ని కారణాలతో ఆగిపోయిన పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలకు స్థానిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందా బాగ్ అధ్యక్షులు దుర్గేశ్, జంగయ్య, ఆండాల్ నగర్ కాలనీ వాసులు సాయి కిషోర్, నాగరాజ్ గౌడ్, రాజేష్, ప్రదీప్, రామచర్య శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి

- సర్వే అధికారులకు సహకరించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన





నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యులు సర్వే నిర్వహిస్తున్న అధికారులకు సహకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు కోరారు. ఆదివారం నిజాంపేట్ బాచుపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ఎన్యుమరేటర్లకు నిర్దేశిత ప్రొఫార్మాల నమోదులను, కోడింగ్‌ను అత్యంత జాగ్రత్తతో నింపాలనీ, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాల్లో ప్రత్యేకించి కోడింగ్‌ను సూపర్ వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను కలెక్టర్ పరిశీలించారు. ఏ విధంగా ప్రొఫార్మాలను నింపుతున్నారని ఎన్యుమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మాల్లో నిర్దేశించిన చోట పుస్తకంలో ఇచ్చిన విధంగా కోడింగ్‌లను నింపాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. తప్పులు జరుగకుండా చూసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట నిజాంపేట కార్పొరేటర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ షాబీర్ అలీ, తహశీల్దార్ ఫూల్ సింగ్, నోడల్ ఆఫీసర్ ఇందిరా, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు గ్రాండ్ పేరెంట్స్‌పై ప్రేమ, ఆప్యాయతలు పెంపొందించడం అభినందనీయం





నృత్యం చేస్తున్న చిన్నారులు

- సురన ఇండస్ట్రీస్ డైరెక్టర్ విజయ సురన
- అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు

నవతెలంగాణ-చర్లపల్లి

విద్యార్థి దశలోనే పెద్దల పట్ల గౌరవం, ప్రేమ, ఆప్యాయతలు నేర్పించడం, వారు తమతో పాటే ఉండాలని ఆలోచన పిల్లల్లో పెంపొందించడం అభినందనీయమని సురన ఇండస్ట్రీస్ డైరెక్టర్ విజయ సురన అన్నారు. నాచారంలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో బచ్‌పన్ ప్రీస్కూల్‌లో నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురన ఇండస్ట్రీస్ డైరెక్టర్ విజయ సురన హాజరయ్యారు. వారిని పాఠశాల డైరెక్టర్ చిలక శివ్‌కుమార్, కరస్పాండెంట్ చిలుక కల్పన, ప్రధానోపాధ్యాయులు నిషాత్ అంజుమ్ సాధారంగా ఆహ్వానించారు. స్వాగతం నృత్యంతో కార్యక్రమం ప్రారంభించారు. తదుపరి చిన్నారులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ పేరెంట్స్ అంతా వారి మనవళ్లతో, మనవరాళ్లతో కలిసి రాంప్ వాక్ చేసి, వారు పొందిన ఆనందాన్ని ప్రతి ఒక్కరితో పంచుకున్నారు. ఇంత గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహించిన డైరెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు విజయ సురన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించటం వల్ల విద్యార్థులు గ్రాండ్ పేరెంట్స్ పట్ల ప్రేమ, ఆప్యాయతలు పెరిగి వారు తమతో పాటే ఉండాలని భావన పిల్లల్లో పెరుగుతుందని చెప్పారు.

బంధుత్వాలు తెలిపేలా విద్యా బోధన

-పాఠశాల డైరెక్టర్ చిలక శివ్ కుమార్

తమ పాఠశాలలో విద్యా, క్రీడల పరంగానే కాకుండా, విద్యార్థులలో నైతిక విలువలు, బంధుత్వాలు తెలిపే విధంగా కూడా విద్యా బోధన చేస్తున్నామని పాఠశాల డైరెక్టర్ చిలక శివ్ కుమార్ తెలిపారు. బాల్యం నుంచి పెద్దల పట్ల ఆ ప్యాయత, అనురాగాలు, ప్రేమలు, నైతిక విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ గ్రాండ్ పేరెంట్ (నానమ్మ అమ్మమ్మ) లకు పాద పూజలు చేసి, వారి ఆశీస్సులు తీసుకొన్నారు. నర్సరీ పిల్లలు పద్యాలు, గేయాలు, శ్లోకాలతో పాటు ప్రాథమిక విద్యార్థులు ప్రదర్శించి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ చిలుక కల్పన, ప్రధానోపాధ్యాయులు నిష త్ అంజుమ్, బచ్ ప న్ కో ఆర్డినేటర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు : కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా జిల్లాలో జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు సర్వేలో విధులు నిర్వహిస్తున్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఓటు నమోదు శిబిరాన్ని వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ నాయకుడు సంతోష్ రెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎస్ యువసేన, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి సూచించారు. ఆదివారం నాచారం వైజయంతి టాకీస్ వద్ద సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఓటు నమోదు, సవరణలు సంబంధించి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకొని, మంచి ప్రజా నాయకులను ఎన్నుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణారెడ్డి, ఎం.రాజా రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రమాకాంత్ లోకే, లోకేందర్ రెడ్డి, శంకర్, రమేష్ పటేల్, లక్ష్మా రెడ్డి, వీరేంద్ర, కృష్ణ కిషోర్ రెడ్డి, అబ్దుల్ కుదూస్ ఖాన్, మధు ముదిరాజ్, సునీల్ రెడ్డి, విజయ్ కుమార్ సింగ్, గురు, షబ్బీర్, కరుణాకర్, సాయిచంద్, శ్రీధర్, సురేందర్, ఆలేటి శ్రీకాంత్, వివాన్ ఆకాష్, సయ్యద్ ఫరూక్ నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే తప్పనిసరి



- కరాటే మాస్టర్ జంగయ్య

నవతెలంగాణ-కీసర

ఆత్మ రక్షణకు ప్రతి ఒక్కరికీ కరాటే తప్పనిసరి అని కరాటే మాస్టర్ చీర్యాల జంగయ్య అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రజాసాయి కాలనీలో గ్రేడింగ్ టెస్ట్ సన్ బుడోకాన్ కరాటే క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ టెస్ట్ ఏషియాన్ చీఫ్ మాస్టర్ పరమేష్ కరాటే క్రీడాకారులు నామాల మనస్వి నాయర్, ఆదిరా లింగాల వైష్ణవి , లింగాల వర్షిత, లింగాల సాయిచరణ్ అనే విద్యార్థులకు సర్టిఫికెట్స్, బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ చీర్యాల జంగయ్య మాట్లాడు తూ.. మార్షల్ ఆర్ట్ నేర్చుకునే విద్యార్థులకు దేహదారుఢ్యం తోపాటు ఆరోగ్యం జ్ఞాపకశక్తి, చురుకుదనం ఏకాగ్రత ఉంటుందన్నారు. కాగా పిల్లలకు విలువలతో కూడిన శిక్షణను ఇస్తున్న కరాటే మాస్టర్ జంగయ్యకు కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

భూగర్భ డ్రయినేజీ ప్రారంభం

చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి

నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలో అన్నోజిగూడలో సూర్యనగర్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన భూగర్భ డ్రయినేజీని మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రూ.లక్ష అంచనా వ్యయంతో 50 మీటర్ల డ్రయినేజీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. దాతలు నరసింహులు, ఆనంద్ రెడ్డి, సాయి, శ్రీనివాస్ రావు, యాదగిరి, షకీల్, రుక్మారెడిని శాలువాతో సత్కరించారు. దాతల సహకారం మారువలేనిదని, మున్సిపాలిటీ అభివృద్ధికి మరికొంత మంది దాతలుముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జయలక్ష్మి, రూప, మున్సిపల్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం వినాయక నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. దీంతో కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో బోర్వెల్ రిపేరు, కొత్త పోల్స్ , త్రీ ఫేజ్ లైన్స్, డ్రయినేజీ మరమతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులకు సమస్యలకు మరమత్తు పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్, ఇంజనీరింగ్ అధికారులు, వాటర్ వర్క్స్ మేనేజర్లు కృష్ణ ప్రసాద్ మరియు ఉదయ్ పాల్గొన్నారు. అనంతరం సాయినగర్‌లోని గవర్నమెంట్ స్కూల్, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. స్కూల్ దగ్గర పరిశుభ్ర పనులు చేపట్టాలని, దోమల మందు స్ప్రే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ స్కూల్ వద్ద పోలీస్ పెట్రోలింగ్ చేయాలని సీఐ సందీప్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉపేందర్, కార్యదర్శి రమేష్, జగదీష్ చారీ, చంద్రమౌళి,వెంకటేష్, రమాదేవి, సుజాత, పద్మ, సుమతీ, సంగీత, సోమేష్, ధనరాజు, పండు, కృష్ణ, రాజేష్, ఓం ప్రకాష్, సాయి సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

- తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావు
- క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ చేసిన మాధవరం సందీప్ రావు



నవతెలంగాణ-శామిర్‌పేట

క్రీడలతో శరీర దారుఢ్యంతోపాటు మానసికొల్లాసం కలుగుతుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తూంకుంట మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని హకీంపేట్, సింగాయిపల్లిలోని క్రికెట్ క్రీడాకారులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనయుడు సందీప్ రావు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిలుగా మున్సిపల్ చైర్మెన్ రాజేశ్వర్ రావు, కౌన్సిలర్ కోమటిపల్లి సురేష్ హాజరై క్రికెట్ కిట్లు అందజేశారు. యువతకు క్రీడా సామగ్రి అందజేసి ప్రోత్సహిస్తున్న దాత మాధవరం సందీప్ రావును అభినందించారు. క్రీడలపట్ల ఆసక్తి ఉన్న వారు రోజు ప్రాక్టీసు చేసి మంచి క్రీడాకారులుగా తయారు కావాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-అల్వాల్

విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం (నేడు) ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, మాచబోల్లారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్ట అధికారులు తెలిపారు. ఉదయమ 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కృష్ణానగర్, సూర్యనగర్, చంద్రనగర్ కాలనీల్లో, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 5:00 ఎఫ్‌బీనగర్, భవానీనగర్, సిటీజన్ కాలనీ, లక్ష్మీనగర్, అంబేద్కర్ నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

ఘనంగా శ్రీ గాయత్రీ మాత యజ్ఞం



నవతెలంగాణ-నేరేడ్ మెట్

నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని మధురా నగర్ లో భారత సేవాశ్రమ సంఘం, శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి బాల మల్లయ్య సహకారంతో ఆదివారం శ్రీ గాయత్రీ మాత యజ్ఞంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల మల్లయ్య మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీ మయబ్రహ్మ లక్ష్మణాచారి, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ కే ఎల్ నారాయణ రెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్‌పురి స్పోర్ట్స్ హబ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ సైనిక్‌పురి పరిధిలోని స్పోర్ట్స్ హబ్‌లో పీప స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. పీప స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు ప్రశాంత్ ఎదులాపురం మాట్లాడుతూ.. మొత్తం 32 టీమ్‌లు పోటీలలో పాల్గొంటున్నాయని వివరించారు. విన్నర్ టీంకు రూ. 15 వేలు, రన్నరప్ రూ. 8 వేలతో పాటు బెస్ట్ బ్యాట్స్‌మన్ ట్రోఫీ, బెస్ట్ బౌలర్ ట్రోఫీ అందజేస్తున్నామని తెలిపారు.

128వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో ప్రతి ఆదివారం జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం 128వ వారానికి చేరింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే, డా బీ.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మా చారి, మెకానిక్ కొండల్, నాగేష్, సింగం రాజు, స్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు.

టీ టీడీపీ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డాఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్ కాలనీలో ఇంటి ఇంటికీ పార్టీ శ్రేణులు తిరుగుతూ సభ్యత్వం నమోదు చేయించారు. ఈ సందర్భంగా సభ్యత్వం నమోదు చేసుకుంటే కలిగే సౌకర్యాలు వివరిస్తూ 30 మందితో సభ్యత్వం నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ అడహక్ కమిటీ మెంబర్ గడ్డామిది రాములు యాదవ్, తెలుగుదేశం పార్టీ మాజీ సెక్రటరీ నీరుకొండ సతీష్‌బాబు, కృష్ణారావు, శ్రీనివాసరావు, రమేష్, శ్రీనివాస్ తదతరులున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నవతెలంగాణ -శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ, కండ్లకొయ్య సబ్‌స్టేషన్ పరిధిలోని అంజన్న టెంపుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మల్లన్న కాలనీ ఫేజ్-1, ఫేజ్-2, గోదాములకు, దేవి విహార్ ఎన్‌క్లేవ్, సాయి గీతాశ్రమం ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు తిరిగి 2గంటల నుంచి 4గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు శామిర్‌పేట విద్యుత్ ఏఈ రాఘవేందర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు వినియోదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

డిసెంబర్ 21న తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ 2కే రన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21వ తేదీన నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్న తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ 2కె రన్ పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి గచ్చిబౌలిలోని రోలింగ్ హిల్స్‌లో ఉన్న తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి అధ్యక్షులు పెండెం తారక్‌గౌడ్, అందె రవికుమార్, లయన్స్ క్లబ్ మెంబెర్స్ కెరీర్ అశోక్, నాయుడు, రమేష్ బెల్లంకొండ రామ్ ప్రసాద్, భరత్ దాచెపల్లి, రామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గండి మైసమ్మ మండలంలోని జయభేరి కాలనీలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి పరిశీలించారు.

కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం



● **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన కార్పొరేటర్లు, నాయకులు అండగా ఉండాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. కార్పొరేటర్లు అందరూ, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ...పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. నిధుల కొరత ఉంటే వెంటనే, వాటిని తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. నిధులు కేటాయించి, ఆ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులను, ఎండగట్టాలని, ప్రజలకు కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులూ వచ్చినా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, సబియ గౌసుద్దిన్, మందడి శ్రీనివాసరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులున్నారు.

ఏఐటీయుసీ భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం



● **జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగప్ప, పరమేష్**

నవతెలంగాణ-బాలానగర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో మండల సీపీఐ కార్యదర్శి జి.కృష్ణ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగప్ప, పరమేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు వి. హరినాధరావు, భవాని కార్మిక సంఘం ఏఐటీయూసీ (అనుబంధం) అధ్యక్షులు బాలాజీ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ మండలి నుంచి ప్రభుత్వ గుర్తింపు కార్డులను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. యూనియన్ సభ్యత్వం కూడా తీసుకుని ఐక్యమైత్యంతో కలిసి, మెలిసి ఉండాలన్నారు. కార్మికులకు ఏ విధమైన సమస్యలు వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ప్రతినెల సమావేశంలో పాల్గొనలన్నారు.మరింత ఎక్కువ మందిని భవన నిర్మాణ కార్మికులను కలుస్తూ.. సంఘాన్ని విస్తృత పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల స్థాయి భవన నిర్మాణ కమిటీని ప్రకటించారు. అనంతరం కూకట్‌పల్లి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులుగా జి.కృష్ణ, అధ్యక్షులుగా కే. మనోజ్ చారి, ప్రధాన కార్యదర్శిగా ఎం.దావీద్, వైస్ ప్రెసిడెంట్ జి.రాములు, జాయింట్ సెక్రెటరీగా పెంటయ్య, కోశాధికారిగా గంగన్న, ఆర్గనైజర్ కే.కృష్ణ చారి, కమిటీ సభ్యులుగా ఎండి.హైమద్, మొగులయ్య, నటరాజ్, చంద్రమ్మ, మాధవి తదితరులను ఎన్నుకున్నారు.

పార్కుల అభివృద్ధి పనులు పరిశీలన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీలోని పార్కుల అభివృద్ధి పనులను స్థానిక కాంగ్రెస్ నాయకుడు శివ చౌదరి ఆదివారం పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన పార్కు అభివృద్ధి పనులను ఆటంక పరచకుండా పార్కులో ఉన్న ఆట వస్తువులను, జిమ్ పరికరాలను నష్ట పరచకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాకాలం రోడ్లపై నుంచి కాలనీపై, పార్కుపై పడే వరదలు మళ్లించడానికి చిన్న తురాలు స్థానములో, పెద్ద తురాలు వేయాలని కాంట్రాక్టర్‌కు తెలియజేశారు. అసిస్టెంట్ ఇంజనీర్‌కు తగు సూచనలు వివరించాడు.

ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రజాధనం వృధా చేయకుండా.. నాణ్యత లోపించకుండా త్వరతగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు శివ చౌదరి**

రక్తదాన శిబిరంలో శివ చౌదరి..

కేపీహెచ్‌బీ గోపాల్ రావు నగర్ కాలనీలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల రక్షణ కోసం, టిని ట్రోట్స్ ఆధ్వర్యంలో.. నిర్వహించిన రక్తదాన శిబిరంలో శివ చౌదరి పాల్గొన్నారు. రక్తదానం చేసిన దాతలను ప్రశంసించి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అలాగే ఈ నెల 17వ తేదీన కేపీహెచ్‌బిలో జరగబోయే రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొననున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, రక్తదాన దాతలు, పలువురు పాల్గొన్నారు.



అనునిత్యం ప్రజా సేవలో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పలు సంక్షేమ సంఘాల నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద కలిశారు. పలు సమస్యలు గురించి ఆయనకు విన్నవించారు. వినతులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఇన్‌చార్జి మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసి, కాలనీలు బస్తీలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని అన్నారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు మాజీ ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన కార్తీక మాసవన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం పలు వివాహ వేడుకలలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాలకు కూన శ్రీశైలం గౌడ్ హాజరైనారు.



ది ఆదర్శ్ బ్యాంక్ 25 వ శాఖ ప్రారంభం

● **ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



నారాయణఖేడ్‌లో నూతనంగా నెలకొల్పిన ది ఆదర్శ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 25 వ శాఖను ఆదివారం ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలో ఆదర్శ్ బ్యాంక్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆదర్శ్ బ్యాంక్ ప్రజల అవసరాల రిత్యా అందరికీ బ్యాంకు సేవలను అందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ది ఆదర్శ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మెన్ మదన గోపాల స్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల, ప్రజా ప్రతినిధుల, కోరిక మేరకు తమ యొక్క 25న శాఖను ఈ ప్రాంతంలో నెలకొల్పామని తెలిపారు. తమ బ్రాంచీ అందరి ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారస్తుల కొరకు ఏటువంటి పూచీకత్తులు లేకుండా 1000 నుంచి 10,000 వరకు తాకట్టు లేకుండా గ్యారంటీలతో అప్పు ఇవ్వబడునని తెలిపారు. అలాగే సెక్యూరిటీ ఉన్న ఎడల వారి యొక్క వ్యాపార అభివృద్ధి అవసరాల కనుగుణంగా అప్పు ఇవ్వబడునని తెలిపారు. తమ బ్రాంచ్‌లో లాకర్ల సౌకర్యం కూడా ఉందని.. తమ బ్రాంచ్ వారంలో ఏడు రోజులు ప్రజలకు అవసరాల రీత్యా తెరిచే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తాహిర్, వార్డు కౌన్సిలర్ సద్దాం, ముజీబ్ ఖాన్, సీఈవో ఎంవి.రమణ, ఏజిఎంలు అయ్యప్ప నాయుడు, కామినేని శ్రీనివాస రావ్, నూతన బ్రాంచ్ మేనేజర్ దాసరి నవీన్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



నవతెలంగాణ-బాలానగర్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. అనారోగ్యంతో వివిధ సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్సలు పొందలేని వారు.. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్‌కు చెందిన 8 మంది అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు అల్లాపూర్ డివిజన్ ప్రాంతానికి చెందిన సతీష్ రెడ్డి, కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన బి. నేహా, ఓల్డ్ బోయినపల్లి, మూసాపేట్ ప్రాంతానికి చెందిన సూరజ్, జరీనా బేగం, బోయినపల్లి, ప్రవీణ్ కుమార్, మూసాపేట్, బేగం పేట ప్రాంతానికి చెందిన బి.లక్ష్మి, ఓల్డ్ బోయినపల్లి ప్రాంతానికి చెందిన ఖదీర్ హుస్సేన్ పలు కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.నాలుగు లక్షల రూ.32 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాలానగర్ కార్యాలయంలో బండి రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆశాజ్యోతిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బండి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, అస్లాం, సునీల్ యాదవ్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

తూము శ్యామ్ సుందర్ కుటుంబాన్ని పరామర్శించిన బండి రమేష్..

కూకట్‌పల్లి: కాంగ్రెస్ నాయకుడు తూము శ్యాంసుందర్ భార్య వనిత, ఇటీవల పరమపదించారు. ఆదివారం రోజున కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మూసాపేటలోని శ్యాంసుందర్ నివాసానికి వెళ్లి.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్ తో పాటు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సప్పిడి భాస్కర్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి బోర్ ప్రారంభం..



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు లక్ష్యమని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు ప్రెసిడెంట్ సోమ రాజు గారి భార్యను పరామర్శించి, ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బూచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు ప్రెసిడెంట్లు కామేశ్వర రావు సోమరాజు, నాయకులు భూషణ్ బాబి శ్యామ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్ డివిజన్ వివేక్ నగర్‌లో శ్రీకాంత్ ముదిరాజ్ ఆహ్వనం మేరకు.. అయ్యప్ప స్వామి మహా పడి పూజకు హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రత్యేక పూజలో దొడ్ల రామకృష్ణ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, దత్తాత్రేయ కాలనీ కట్ట మైసమ్మ గుడి వద్ద, ఎల్లమ్మబండ శెట్టిబలిజ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో.. శెట్టిబలిజ కార్తీక మాస వనభోజన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై ప్రత్యేక పూజాలు చేశారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ కార్తీక మాసంలో అందరూ వనబోజనాలు ఏర్పాటుచేసుకుని, భక్తి భావంతో పూజలు చేస్తూ.. ఉసిరి చెట్టునీడన భోజనం చేయడం మన సంప్రదాయం అని గుర్తుచేశారు. బిజీ లైఫ్‌లో నుండి బయటకు వచ్చి, చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ కలిసి, ఆడుతూ పాడుతూ రోజంతా ఆనందంగా గడపడం, మంచి విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్, లక్ష్మణ్ ముదిరాజ్, రామకృష్ణ, బి.శ్రీనివాస్, సత్యనారాయణ, సోమశేకర్, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్డియాక్ మల్టి స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం...



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, వివేకానంద నగర్ కాలనీలో బండారు హాస్పిటల్, కార్డియాక్ అండ్ మల్టీ స్పెషాలిటీని ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఈరోజుల్లో వయసుతో సంబంధం లేకుండా చాలా మంది గుండె పోటుకు గురవుతున్నరన్నారు. పెద్దవాళ్ళకే కాకుండా తక్కువ వయస్సు ఉన్న వాళ్ళకి కూడా గుండె సంబంధిత వ్యాధులు రావడం జరుగుతుందని తెలిపారు. ఈ బండారు హాస్పిటల్ వారు వివేకానందనగర్ డివిజన్‌లో, గుండెకు సంబంధించిన ఆస్పత్రి ప్రారంభించడం.. ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉండటం సంతోషంగా ఉందని తెలియజేశారు. కమర్షియల్‌గా కాకుండా పేషెంట్స్‌కి వీలైనంత తక్కువ చార్జీలతో చికిత్సను అందిస్తూ.. వారి ఆరోగ్య రక్షణకి కృషి చేయాలని కోరుతూ.. ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన శుభాకాంక్షల వెల్లువ..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, సామాజిక సేవ తత్పరులు, ఆర్యవైశ్య సంఘ ఆణిముత్యం, అమరవాది లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా.. ఆదివారం నగరంలోని కర్మాన్ ఘట్‌లోని అయన నివాసంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నేతి రాములు గుప్తా, మేడ్చల్ జిల్లా మహాసభ కార్యనిర్వాహక అధ్యక్షులు బల్లి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారు బల్లి శ్రీధర్ గుప్త, జిల్లా మహాసభ కార్యనిర్వాహక అధ్యక్షులు మేడ్చల్ జిల్లా మహాసభ మాజీ అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా, మాజీ ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం జగద్గిరిగుట్ట ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తాలు పుష్పగుచ్చాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వం శెట్టిబలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలి



● **వై.ఏఫ్.సి.ఏ.జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వం శెట్టిబలిజ కులస్తులకు అన్ని రంగాలలో సరైన ప్రాధాన్యతనివ్వాలని వై.ఎఫ్.సి. ఏ.జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ ప్రాంతంలో స్థానిక శెట్టిబలిజ కులస్తులు ఏర్పాటుచేసిన వనభోజన మహోత్సవ వేడుకలకు అయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలో అత్యధికంగా తమ కులస్తులు ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా,రాజకీయంగా ఎదగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తానని వారికి హామీ ఇచ్చారు.

వనభోజనాలు ఐక్యతకు దోహదం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వనభోజనాలు ఐక్యతకు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో.. గాజులరామారం, షాపూర్ నగర్ డివిజన్ జరిగిన కార్తీక మాస వనసమారాధన మహోత్సవ వేడుకలు వీనస్ ఎన్క్లేవ్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆర్యవైశ్య కులస్తులకు తాను అండగా ఉంటానని తెలిపారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆశీస్సులు అందరికీ కలగాలని అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాసా శ్రీనివాస్ గుప్తా, సోమిశెట్టి పవన్ కుమార్ గుప్తా, బచ్చు వంశీ గుప్తా, ఉపాధ్యక్షులు శేఖర్ గుప్తా, కార్య నిర్వాహక అధ్యక్షులు జగదీష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సభ్యులు ఉప్పల నాగరాజు గుప్తా, ప్రసాద్ గుప్తా, వీవీఎస్ మూర్తి, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

టీజిఎయిమ్స్ లైన్ నిర్వహణ పనుల కారణంగా గండి మైసమ్మ ఫీడర్ లో ఉదయం 11:00 గం॥ నుండి మధ్యాహ్నం 01.30 వరకు అలాగే మధ్యా హ్నం 3 :00 గంటల నుండి 04.30 ని॥ల వరకు గండిమైసమ్మ ఎక్స్ రోడ్డు, శ్లోకా స్కూల్, ఆంధ్రా బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలలో అంత రాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డి.పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ సురేందర్ రెడ్డి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | నవంబర్ 11, 2024 | www.navatelangana.com

విజేతలను అభినందించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియ వారు నిర్వహించే 62వ జాతీయ స్కేటింగ్ పోటీలలో అన్న నగర్‌కు చెందిన సాత్విక్, మారేడ్పల్లికి అభిషేక్ ఎంపిక అయ్యారు. ఈ మేరకు ఆదివారం వారు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజేతను అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో విశ్వ క్రీడా వేదిక పై తెలంగాణ బిడ్డలు సత్తా చాటాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడు తరుణ్ పుట్టిన రోజు వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తరుణ్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ యువకులు భారీగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. రహమత్ నగర్ డివిజన్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటామని వచ్చే కార్పొరేటర్ ఎన్నికలలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నాయకత్వంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని, కార్పొరేటర్‌గా బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరు పోటీలో ఉన్న, మైనార్టీ ఓటర్లు అండదండలతో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు.

ప్రజారోగ్యం కోసం ఎనలేని కృషి



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు ఆదివారము మర్ఫీడ్ సేయింట్ ఆంతోనిస్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని పేదలకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలిసికట్టుగా అందరూ కలిసి పని చేస్తే సాధ్యం కానిది ఏది ఉండదని అన్నారు. అలాగే మెడికల్ క్యాంపు ఇంత విజయవంతం అవ్వడానికి కారణమైన చర్చ్ ఫాదర్ జోసఫ్, డాక్టర్ బాల్ రెడ్డికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన పేదలకు తన సొంత నిధుల నుంచి కంటి ఆపరేషన్లు చేయిస్తానని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం పెద్దపీట వేస్తోందని చెప్పారు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలను అందించేందుకు కూడా గణనీయమైన కృషి చేస్తూ ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లెస్లి, జేసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన ఎస్ఎఫ్ఐ సికింద్రాబాద్ జోన్ కమిటీని 28 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మణ్, మూల విగ్నేష్, గర్ల్స్ కన్వీనర్‌గా బీరెడ్డి చరణ్‌శ్రీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అన్నం రాజేష్, అన్నం భగత్, శశాంక్, లక్ష్మి ప్రసాద్, సహాయ కార్యదర్శిలుగా, కార్తీక్, వంశీ, సంతోష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో ఉన్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడు సాయంగా ఉంటుందని, విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను ఇకపై ప్రశ్నిస్తుందని, ప్రభుత్వం సికింద్రాబాద్లో వెనుకబడుతున్న ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మెరుగుపరచాలని ఇంటర్మీడియట్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెంచిన మెస్, కాస్మెటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంకే స్టాలిన్ పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే మీటింగ్‌లో పాల్గొన్న కోట నీలిమ



నవతెలంగాణ-.బేగంపేట్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమరావతి పార్లమెంట్ సెగ్మెంట్ తియోసా అసెంబ్లీ నియోజకవర్గంలో మోజ్రీ గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కోట నీలిమ పాల్గొన్నారు. మోజ్రీ గ్రామంలో మహా వికాస్ అగాడి కూటమి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొని ప్రసంగించారు. సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కోట నీలిమ ఈ సభ ఏర్పాట్లను పర్యవేక్షించి తియోసా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ వ్యూహాలు ప్రస్తుత కార్యక్రమాలకు సంబంధించిన పరిస్థితులు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఖర్గే అమరావతి పార్లమెంట్ పరిధిలో చేయాల్సిన పనులు గురించి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మీడియాతో దూరవాణిలో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికలలో ఇన్‌చార్జిగా బాధ్యత వహించడం చాలా ఆనందంగా ఉందని, ఏఐసీసీ తన మీద ఇంతటి బాధ్యత పెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్తీలో భారీ పేలుడు.. స్థానికులపై పడిన ఇటుకలు



- ఒక్కసారి ఉలిక్కిపడ్డ బస్తీ వాసులు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు

నవతెలంగాణ-బంజారా హిల్స్

తెలంగాణ స్పైసీ కిచెన్‌లో ఫ్రిజ్ కంప్రెజర్ పేలి భారీ శబ్దం రావడంతో సిమెంటు ఇటుకలు గాల్లో ఎగిరి పక్కనే ఉన్న బస్తీ నివాసాలపై పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కొన్ని గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పేలుడు తీవ్రతకు తాము అదిరిపోయామని వరంగల్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని దుర్గా భవానీ నగర్ బస్తీ వాసులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాకా ఆదివారం తెల్లవారిజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు బస్తీ వాసులు అంటున్నారు. పేలుడు జరిగిన సమయంలో తామంతా గాఢ నిద్రలో ఉన్నామని నివాసులు తెలిపారు. హోటల్లో ఏం జరిగిందో అర్థం కాక ఆ చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లు పరుగులు తీశారు. హోటల్లో పేలుడు ఘటనపై సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఐపీఎస్, ఏసీపీ వెంకటగిరి, జూబ్లీ హిల్స్ పోలీసు అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకున్నారు. అప్పటివరకు హోటల్ కిచెన్‌లోని ఎల్పీజీ సిలిండర్ పేలినట్లుగా ప్రచారం జరిగింది. కానీ పోలీసులు దర్యాప్తు చేపట్టిన తరువాతే తెలిసింది, హోటల్లో పేలింది సిలిండర్ కాదు, రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ అని, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. దుర్గాభవానీ నగర్ బస్తీ వాసులతో మాట్లాడారు. గుడిసెలు దెబ్బతినడంతో తమకు ఒక్కో కుటుంబానికి రూ.50 వేల నుంచి లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ఇంట్లో వస్తువులు, సామాన్లు కూడా దెబ్బతిన్నాయని బాధితులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వమే ఆ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బస్తీ వాసులు కోరారు. న్యాయం చేయాలంటూ జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌కూ సామాగ్రి తీసుకొని బస్తీ వాసులు భారీగా వెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఖాళీలతో కుంటుపడుతున్న ఓయూ పరిపాలన

- ఓయూ కీలక శాఖల్లో గెజిటెడ్ ఆఫీసర్ ఖాళీలు
- ఎఆర్,డిఆర్ ఫలితాల కోసం ఆశావహుల పడిగాపులు
- పదోన్నతులు పొందిన బదిలీలు కరువు



నవతెలంగాణ-ఓయూ

107 సంవత్సరాల ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇప్పుడు ప్రొఫెసర్స్‌లేక బోధన, పరిశోధన కుంటుపడుతున్న విషయం తెల్సిందే. ఇది ఇలా ఉండగా గెజిటెడ్ ఆఫీసర్స్, బోధనేతర ఉద్యోగులు నెల నెల పదవీ విరమణ చెందుతున్న వారి సంఖ్య పెరిగి పోతుంది తప్ప నూతన నియామకాలు లేక, అనుభవం గల ఆఫీసర్స్ ఉద్యోగులు లేక యూనివర్సిటీ అనేక పరిపాలనా పరమైన సమస్యలు, చిక్కులు ఎదుర్కొంటున్నది.

ఎక్కిరిస్తున్న ఖాళీలు..నత్తనడకన పాలన

ఫైనాన్స్ సెక్షన్‌లో సూపరింటెండెంట్ లేరు. ఇది కీలక సెక్షన్. నెలనెల పింఛన్స్, ఇతర పింఛనర్స్ లావాదేవీలు ఇక్కడ నుంచే జరుగుతాయి. ఆర్ట్స్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇటీవలే పదవీ విరమణ చేసిన విషయం తెల్సిందే. ఇక్కడ 18 విభాగాలు ఉన్నాయి. సైఫబాద్ పీజీ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ట్రాన్స్‌ఫర్ అయి నెలలు గడుస్తున్నా నేటికీ అక్కడ కొత్త వారిని నియమించలేదు. యూనివర్శిటీ అతి ప్రధానం అయిన లీగల్ సెల్ ఇక్కడ న్యాయ వ్యహారాలు, కోర్టు కేసులు, తీర్పులు లాంటి కార్యకలాపాలు తరచుగా ఉంటాయి ఇలాంటి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ లేక పోవడం శోచనీయం. యూనివర్సిటీ ఆర్థిక పరిస్థితులు చూసుకునే అత్యంత కీలకమైన బడ్జెట్ సెక్షన్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్ లేరు. ఇక ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ లేక సుమారు సంవత్సరం పైనే అయ్యిందని తెలిసింది. సైన్సు కళాశాలలో డిప్యూటీ రిజిస్ట్రార్ లేక సంవత్సరాలు గడుస్తునట్లు అక్కడి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్డింగ్ డివిజన్ సూపరింటెండెంట్ లేరు, అత్యవసర సేవాలు అందజేసే ఓయూ హెల్త్ సెంటర్‌లో కేర్ టెకర్ పోస్టు, రెగ్యులర్ డాక్టర్ పోస్ట్, చివరికి రెగ్యులర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సైతం లేరు. ఇక్కడ 90%ఉద్యోగులు, నర్సులు ప్రవేట్ వారే. గార్డెనింగ్ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇది ఇలా ఉండగా ఇన్ని ఖాళీలు వెక్కిరిస్తున్న సమయంలో నిజాం కాలేజ్‌లో ఇద్దరు డిప్యూటీ రిజిస్ట్రార్‌లు పని చేయడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాల కోసం పడిగాపులు...

ఈ జులై మాసంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్ పదోన్నతుల కోసం నోటిఫికేషన్ జారీ చేసి సెప్టెంబర్ మాసంలో పరీక్షలు నిర్వహించిన విషయం తెల్సిందే. సుమారు 30 మంది ఉద్యోగులు పరీక్షలు రాసినట్లు తెలిసింది. నేటి వరకు ఫలితాలు విడుదల కాక పోవడంతో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇక కొందరు ఉద్యోగులు వృత్తి రీత్యా పదోన్నతులు పొందినప్పటికి పాత పోస్టులో అక్కడే తిష్ట వేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు అయితే జాయిన్ అయినచోటే పదోన్నతులు పొందినప్పటికి అదే కార్యాలయంలో పదవీ విరమణ చేసే పని చేయడం విశేషం. మరి నూతనంగా వీసీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రో.యం.కుమార్ ఈ విషయం ఏం చేస్తారో వేచి చూడాల్సిందే. మరొక వైపు అయిన వీసీ పలు కీలకమైన అంశాలకు చెందిన ఫైల్స్ పై లోతుగా అధ్యయనం చేస్తోన్నట్లు తెలిసింది.

చిరు వ్యాపారస్తులకు అండగా ఉంటా

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-అమీర్పేట్

సుందరీకరణ, అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల పొట్టకొట్ట వద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి అమీర్ పేటలోని హనుమాన్ టెంపుల్, కనకదుర్గమ్మ టెంపుల్ ప్రాంతాలలో పర్యటించి స్థానిక వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చేపట్టే అభివృద్ధి పనులతో తాము ఇబ్బందులకు గురవుతామని మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను తన కార్యాలయంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జోనల్ కమిషనర్‌తో మాట్లాడారు. శనివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నో సంవత్సరాల నుంచి చిన్న, చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, రోడ్ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో తాము వ్యాపారాలు చేసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని మీకు అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుమారు 70 సంవత్సరాలకు పైగా అమీర్ పేట సర్కిల్ నుంచి హనుమాన్ దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, గురుద్వార్, మైత్రివనం తదితర ప్రాంతాలలో తోపుడు బండ్లు, ఫుట్ పాత్‌లపై వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ వేలాది మంది జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనులు చేపడతాం, సుందరీకరణ చేస్తామంటే వారు ఎక్కడికి పోవాలి, వారి కుటుంబాలు ఏమై పోవాలని అధికారులను ఆయన ప్రశ్నించారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. అసలే ఇరుకుగా ఉన్న ఈ ప్రాంతాలలో ఫుట్ పాత్‌ల నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఏముందని అన్నారు. వ్యాపారాలు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మరింత ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు, అసోసియేషన్‌ల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలగని రీతిలో ఫుట్‌పాత్‌లను నిర్మించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలను నిర్వహించు కోవాలని ఎమ్మెల్యే వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, జీహెచ్ఎంసీ ఈ ఈ వెంకటనారాయణ, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, డీజీఎం వంశీ, ఎలెక్ట్రికల్ సుధాకర్, స్ట్రీట్ లైట్ ఎఈ శ్రీనివాస్, లా అండ్ ఆర్డర్ ఎస్సై శవణ్, ట్రాఫిక్ ఎస్సైలు కాంతారావు, రాంబాబు, మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుర్మిత్ సింగ్, తదితరులు ఉన్నారు.

డి6 ఛానల్‌ను ప్రారంభించిన ఎంపీ విల్సన్



నవ తెలంగాణ-ఓయూ

దేశ పరిపాలన విభజన జరిగి ప్రజలు సమగ్రంగా అభివృద్ధి చెందే దిశగా రాష్ట్ర విభజన గాని న్యాయవ్యవస్థ శాసనవ్యవస్థ విభజన జరిగినప్పుడే దేశంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని డీఎంకే ఎంపీ రాజ్యసభ సభ్యులు పీ విల్సన్ అన్నారు. అందుకే దక్షిణ భారతదేశముకు భారత రాజ్యాంగ పితా బాబా సాహెబ్ అంబేద్కర్ 1955 లోనే హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాలని సుప్రీంకోర్టు బెంచ్‌ని దక్షిణాదిలో ఏర్పాటు చేయాలన్నారు. దక్షణాది రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేసి సత్వర న్యాయము, సమన్యాయము అన్ని ప్రాంతాలకు రావాలంటే దేశంలో న్యాయవేస్తతో పాటు పార్లమెంటు దక్షిణాదిలో ఏర్పాటు కావలని దక్షిణాది అభివృద్ధి మండలి ఐటీ కారిడార్ దక్షణాధికి ప్రత్యేక రిక్రూట్మెంట్ బోర్డ్ ఆంధ్రప్రదేశ్‌కు, ప్రత్యేక హోదా తెలంగాణ, కర్ణాటక, కేరళకు ప్రత్యేక ప్యాకేజీ కావేరి, కృష్ణ, గోదావరి జిల్లా వివాదాల పరిష్కారం, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలని తక్షణమే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించి దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలని ఎంపీ పీ.విల్సన్ డిమాండ్ చేశారు. తార్నాకలోని డి6 న్యూస్ ఛానల్, డీజాక్ ఆన్లైన్ ద్వారా కేంద్ర కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి6 ఎండి, డీ జాక్ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ బీజాకు మేధావుల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ యం.పవన్, సిహెచ్ పవన్ కుమార్ బీజాకు, చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ సుంకే సంపత్, వి6 చీఫ్ రిపోర్టర్ సిహెచ్ శ్యాంసుందర్ ఆన్లైన్లో తమిళనాడు, కర్ణాటక కేరళ, ఆంధ్రప్రదేశ్ డీజాగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహనతో పిల్లల కంటి సమస్యలు కట్టడి చేయగలం

- సంగీత దర్శకులు ఎస్ ఎస్ తమన్, నటుడు విశ్వ కార్తికేయ



నవ తెలంగాణ-బంజారా హిల్స్

నేత్ర సంరక్షణ అవగాహన నడకను ప్రారంభించిన సంగీత దర్శకుడు ఎస్.ఎస్ తమన్, నటుడు విశ్వ కార్తికేయ. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రతి సంవత్సరం పిల్లలలో అనేక కంటి వ్యాధుల పట్ల సామాజిక అవగాహన పెంచడానికి బాలల నేత్ర సంరక్షణ అవగాహనా వారన్నీ నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం దీనిని నవంబర్ 7 నుంచి 14 వరకూ నిర్వహించింది. ఈ ఏడాది 'బాల్య శుక్లం' అనే థీమ్‌తో నడక నిర్వహించారు. బాల్య శుక్లాలు పిల్లల చూపుపై వాటి ప్రభావం, త్వరిత గుర్తింపు చికిత్స ప్రాధాన్యత పట్ల అవగాహన పెంచడం, సత్వర వైద్య సలహా పొందడానికి తల్లితండ్రులను ప్రోత్సహించడం నడక లక్ష్యమనీ బంజారా హిల్స్‌లోని ఎల్వీపీ నేత్ర ఆస్పత్రిలోనీ కల్లం అంజిరెడ్డి ప్రాంగణంలో నడకలో సంగీత దర్శకుడు ఎస్.ఎస్ తమన్ తెలుగు నటుడు విశ్వ కార్తికేయ ముఖ్య అతిథులుగా హాజరై బాల్య శుక్లాలపై అవగాహన కలిగించడానికి దాదాపు 300 మంది పిల్లలు తల్లితండ్రులు ప్లకార్డులు పట్టుకుని నడకలో పాల్గొన్నారు. ఈ ముఖ్యమైన అవగాహనా కార్యక్రమంలో భాగం చేసినందుకు తమన్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు."త్వరగా గుర్తించండి, పిల్లలు స్పష్టంగా చూడగలిగేటట్లు త్వరగా చర్య తీసుకోవాలనీ పిల్లలకు దయచేసి అవసరమైతే తప్ప ఎలక్ట్రికల్ వస్తువులు, ముఖ్యంగా సెల్ ఫోన్, టీవీ లాప్టాప్ వంటి వాటికి దూరంగా ఉంచాలని తల్లితండ్రులను ఆయన కోరారు. నవంబర్ 7 నుంచి 14 వరకూ ఎల్వీపీ వ్యవస్థ అంతటా అనేక పోటీలు సరదా కార్యక్రమాలు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, క్లే మోడలింగ్, బ్రెయిలీ చదవడం, పాటరీ సెషన్లు నిర్వహిస్తున్నారు. కార్యకలాపాలు ఉద్యోగుల పిల్లలకు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. వారమంతా జరిగిన వేడుకలు బాలల దినోత్సవమయిన 14తేదీన సాంస్కృతిక కార్యక్రమం, బహుమతుల ప్రధానం, ఇంద్రజాల ప్రదర్శన, బాల్య శుక్లంపై అవగాహనా ఉపన్యాసంతో ముగుస్తాయనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. అధిపతి, చైల్డ్ సైట్ ఇన్స్టిట్యూట్, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ.డా రమేష్ ముందుగా మాట్లాడుతూ.. రోగ నిర్ధారణ చేయబడిన దశకు నిష్పత్తిలో నేరుగా ఫలితాలు ఉంటాయనీ త్వరగా గుర్తించండంటూ పిల్లలు స్పష్టంగా చూడగలిగేటట్లు త్వరగా చర్య తీసుకోండనీ బాల్య కంటిశుక్లం చికిత్స చేయకుండా వదిలేస్తే పునరుద్ధరించలేని దృష్టిహాని కలిగిస్తుందనీ అన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ-ఓయూ

ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తూ పేద, బడుగు బలహీన వర్గాలకు విద్యను అందనియకుండా దూరం చేస్తున్నారు. ముఖ్యంగా నూతన జాతీయ విద్యా విధానంతో కేంద్ర ప్రభుత్వము విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ మతోన్మాదానికి ప్రేరేపించి దేశంలో ఒకే మతం, ఒకే ఎన్నిక ఒకే కార్డు పేరుతో దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. భారతదేశం ప్రజలు ప్రస్తుతం క్లిష్టమైన సమయంలో ఉన్నట్లు చెప్పారు. యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థి సమస్యల పైన పోరాడాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ 21 మంది సభ్యులతో ప్రకటించాడు. భారతదేశంలో 1970 సంవత్సరంలో కేరళ రాష్ట్రంలో కేవలం 11 మందితో ఎస్ఎఫ్ఐ పురుడు పుసుకొని స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంతో నేడు దేశంలో లక్షలాది విద్యార్థి సైన్యంతో అతిపెద్ద సంఘంగా విద్యార్థి సమస్యలపై నిరంతరము పోరాడుతుందని అన్నారు. దేశంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోలీసుల లాఠీలకు ఎదురుండి ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర ఎస్ఎఫ్ఐ కుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కృష్ణ సహకార్యదర్శి ఆనంద్ శర్మ, మల్సూర్, కృష్ణ, మనోజ్ కార్తీక్, వెంకటేష్, ఈశ్వర్, హరీష్, రాకేష్, సాయి భార్గవ్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

టీచింగ్ పోస్టుల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాలి



- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-ఓయూ

ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... గత 10 సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యంగా వించబడిన విద్యా రంగాన్ని ప్రక్షాళన చేసే ఉద్దేశంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం, విద్యా రంగంలో పనిచేసిన ప్రముఖులను విద్యా కమిషన్‌కు సలహా మండలి సభ్యులుగా నియమించడం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్ సమర్థులను నియమించడం, అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు బోధన పరిశోధన అనుభవం ఉన్న ప్రొఫెసర్లను రెగ్యులర్ వీక్‌లుగా నియమించడాన్ని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంగా స్వాగతిస్తున్నామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోకుండా యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, క్యాంపస్ డెమోక్రసీని గౌరవించాలని, అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వం కోరారు విద్యా కమిషన్ సభ్యులు, ఉన్నత విద్యా మండలి పెద్దలు, వీసీ విద్యార్థులకు ప్రొఫెసర్లకు, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ తెలంగాణలో ఉన్నత విద్యకు నూతన ఉత్సాహం తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికమమే నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యా కమిషన్‌కు, ఉన్నత విద్యా మండలి పెద్దలకు, వీసిలకు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ప్రతిపాదనలు ఉంచారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్ ఓయూ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శిలు ఉప్పల ఉదయ్ కుమార్ ఆరెకంటి భగత్, నాయకులు అశ్వన్, ప్రసాద్, రాధాకృష్ణ, మధు, రాఘవేందర్, సంతోష్, ఆదర్శ్ పాల్గొన్నారు.

చేనేతను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

- సాత్విక గుప్తా

నవ తెలంగాణ-బంజారా హిల్స్

చేనేతను ప్రతి ఒక్కరు ఆదరించాలనీ వస్త్ర ప్రదర్శన జాతీయ రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ ఫౌండర్ ఆక్యుపేషనల్ హెల్త్ ఫౌండర్ ఎన్విరాన్మెంటల్ సేఫ్టీ ఆఫీసర్ సాత్విక గుప్తా తెలిపారు. ఆదివారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన పట్టు వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాలులో కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగి మాట్లాడారు.. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశం లోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శ్రీదేవి పరామర్శ



నవతెలంగాణ-చర్లపల్లి

తెలంగాణ ఉద్యమకారుడు సీనియర్ నాయకుడు నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి, తిరుపతి రెడ్డి మాతృమూర్తి కమలమ్మ ఇటీవల మరణించారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కృష్ణపూర్ గ్రామంలోని వారి స్వగృహమునందు నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బుడిగ ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, రాజు గౌడ్, సదానంద్, సత్తిబాబు, వెంకట్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

12 వ తేదీ తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలు ప్రదానం

నవతెలంగాణ-కల్చరల్

వివిధ సాహిత్య ప్రక్రియలలో తెలుగు విశ్వవిద్యాలయం 2022 ఏడాదికిగాను ఇవ్వాల్సిన పురస్కారాలు ఈ నెల12వ తేదీన ఎన్‌టీఆర్ కళా వేదికపై ప్రదానం చేస్తున్నట్లు రిజిస్ట్రార్ విస్తరణ సేవా విభాగం డైరెక్టర్ రింగు రామమూర్తి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రెడ్డి శ్యామల తెలిపారు. పద్య కవితలో వరదాభ్యుదయం రచయిత కిషన్ శర్మ, వచన కవితలో కాలం వలిపోతున్న వైపు కవయిత్రి మెర్సీ మార్గరెట్, బాల సాహిత్యంలో ఆటా పాటా రచయిత రాజ మౌళి, కథ ప్రక్రియలో నూనె చుక్క రచయిత రామ కృష్ణారెడ్డి, నవల ప్రక్రియలో కెరటం రచయిత్రి డాక్టర్ యకమ్మ, సాహిత్య విమర్శలో అనుభూతి అన్వేషణ రచయిత నిత్యానంద రావు, నాటక ప్రక్రియలో స్వాతంత్రోద్యపు వీరుల నాటక త్రయం రచయిత్రి పీఏ శ్రీదేవి అనువాద ప్రక్రియలో వీరయ్య గ్రంథ రచయిత జి గురుమూర్తి, వచన రచనలో ఆజాద్ హింద్ ఫౌజ్ ముస్లిం పోరాట యోధులు రచయిత ఏస్ ఎన్ అహ్మద్, లతో పాటు రచయిత్రి ఉత్తమ గ్రంథంగా రంగంటే ఇష్టం రచయిత్రి డాక్టర్ చాగంటి తులసిని ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కేవీ రమణ పూర్వ ఉపాధ్యక్షుడు టి.కిషన్ రావు అతిథిగా పాల్గొనే కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానంద రావు అధ్యక్షత వహిస్తారు.

వాజపేయి నగర్ రైల్వే క్రాస్ వద్ద ఆర్‌యూబి నిర్మించాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం

అందజేసిన వాజ వాజపేయి నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన వాజపేయి నగర్ రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్.యు.బి.నిర్మించాలని ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని వాజపేయి నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు కలిసి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యాత్మకంగా ఉన్న పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఫెన్స్, రైల్వే చక్రబంధంలో ఇరుక్కుపోయిన మల్కాజిగిరి ప్రజలకు ట్రాఫిక్ సమస్య కొరకరాని కొయ్యగా మారిందన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ, ట్రాఫిక్ సమస్య మాత్రం రోజు రోజుకు తీవ్రమవుతుందన్నారు. పెరుగుతున్న జనాభాకు తోడు వాహనాల సంఖ్య కూడా పెరగడమేనని తెలిపారు. సంవత్సర కాలంగా ఆర్.యు.బి.లు నిర్మించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆరాటపడుతున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్తశుద్ధిని చూసి యువకులు కూడా వారికి తోడుగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ ..ఎన్నికల ప్రచార సమయం లో తాను తెలుసుకున్న ప్రధాన సమస్య రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య, నిత్యం మల్కాజిగిరి ప్రాంతం నుండి ఉద్యోగాలకు, కళాశాలలకు, ఇతర పనుల కోసం బయటకి వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందని, వారు సమయానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్నానని తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రావడానికి ఇబ్బందులను తీర్చడానికి ఆర్.యు.బి లు నిర్మించాలని నిర్ణయించుకున్నానన్నారు.

త్వరలోనే వాజపేయి నగర్‌తో పాటు గౌతమ్ నగర్ ఆర్.యు.బి.కూడా ప్రారంభం కానున్నాయని తెలిపారు. రైల్వే అధికారులు సహకరిస్తున్నారని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. మొదట మార్కింగ్ వేసినప్పుడు 150 ఇండ్లు కూల్చాలని అధికారులు నివేదిక ఇస్తే, దాని కుదింపు చేసి, ఎవరికీ ఇబ్బంది లేకుండా డిజైన్ చేయించడంతో ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా కేవలం 5 నుండి 6 ఇండ్లు మాత్రమే కూల్చడం జరుగుతుందని, దీనికి అందరి సహకారం కావాలన్నారు. ఎవరైనా రాజకీయం చేస్తే పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తుందని, ప్రజలందరూ సహకారం అందిస్తే పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలుగు కథలు నవలలో సన్నివేశ విశ్లేషణ ప్రాధాన్యత



నవతెలంగాణ- కల్చరల్

తెలుగు కథలు నవలలు సంఘటనలు చిత్రణ కన్నా సన్నివేశ విశ్లేషణతో అధిక శాతం ఆదరణ పొందాయని ప్రముఖ కథా రచయిత విహారి తెలిపారు. చిత్రాపు హనుమంత రావు రచనలను ఆ దృష్టితో చూడాలని వివరించారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో మానస ఆర్ట్స్ థియేటర్, చిరునవ్వు సంస్థల నిర్వహణలో చిత్రపు హ నుమంతరావు రచించిన ఏడడుగులు నవలిక, వర్ణ చిత్రం కథల సంపుటి ఆవిష్కరణ సభకు ముఖ్యతిథిగా పాల్గొన్న విహారి సంపుటిలని ఆవిష్కరించి మాట్లాడారు. రచయిత హనుమంతరావు నాలుగు దశాబ్దాలు నాటి మధ్య తరగతి కుటుంబ పరిస్థితులు వారి మనస్తత్వంను తమ రచనల్లో ప్రతి ఫలింపజేశారని తెలిపారు. నాటి సామాజిక జీవనాన్ని తెలిపే కథ వస్తువులు కావున ప్రతి వారూ తెలుసుకోవాల్సిన విషయాలు అని చెప్పారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో రచయిత ఏడడుగులు సంపుటిని వారి తల్లికి వర్ణ చిత్రం సంపుటిని భార్యకు అంకితం ఇచ్చారు. రాయవరపు గణేశ్వరరావు ఏడడుగులు సంపుటిని రాంబాబు వర్ణ చిత్రంను సమీక్షించారు. ప్రేమా మన్వీ తదితరులు పాల్గొన్న సభలో రఘుశ్రీ స్వాగతం పలుకగా రామ చంద్రరావు వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా చిత్రపు హనుమంత రావును సంస్థ పక్షాన అతిథులు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని ఈస్ట్ సుధా నగర్‌లో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టబోతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని కాలనీకి గత సంవత్సరం డ్రయినేజీ పనులను, ఈ సంవత్సరం సీసీ రోడ్డు పనులను తీసుకువచ్చామని తెలిపారు. డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు కార్పొరేటర్ కు ధన్యవాదాలు తెలియజేస్తూ, సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గిరి, సెక్రటరీ సంపత్ కుమార్, కృష్ణ కాంత్, కార్యకర్తలు శివ, నటరాజ్, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన





నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడ హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద నిర్మించ తలపెట్టిన భారీ హనుమాన్ విగ్రహ భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఉదయం అత్యంత భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ మహోత్సవాల్లో స్థానిక శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, బజరంగ్ దళ్ కార్యకర్తలు కుషాయిగూడ శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన పూజా సామాగ్రిని భాజా భజంత్రీ వాయిద్యాల నడుమ బస్ స్టాప్ లోని హనుమాన్ గద్దె వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోవు పూజ నిర్వహించి, గోమాతకు వస్త్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి విరాళాలను అందజేశారు. అలాగే భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కాసుల రవీందర్ గౌడ్, గణేష్ ముదిరాజ్, కాసుల సురేందర్ గౌడ్, కంసాని సీతారాం రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, హనుమాన్ నిర్మాణ సమితి కమిటీ సభ్యులు, కుషాయిగూడ గ్రామస్తులు, హనుమాన్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ భవానీ నగర్ ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు బాలానగర్, కే ఎల్ రెడ్డి నగర్, ఎస్.వి. నగర్, మోడీ అపార్టుమెంట్స్, భవాని నగర్, బీరప్ప గూడ, వివేకానంద నగర్, యాదవ్ సంఘం, పిట్టల బస్తీ, మల్లాపూర్ విలేజ్, ఇంజనీర్స్ అసోసియేట్స్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాచారం సబ్ స్టేషన్ పరిధిలో

33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ రామ్ రెడ్డి నగర్, రహేజా, కేవీ టెక్ పార్క్ ఎస్ఎస్, నాచారం ఇండూర్ ఎస్ఎస్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4:30 నిమిషాల వరకు దుర్గా నగర్, బాబా నగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, అంబేద్కర్ నగర్, కమల బాయ్ నగర్, హనుమాన్ నగర్, సావర్కర్ నగర్, రామ్ రెడ్డి నగర్, జనప్రియ అపార్టుమెంట్స్, శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

బీజేపీలో చేరికలు



నవతెలంగాణ-కీసర

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో వివిధ హోదాలలో పనిచేసిన నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి మోడీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డి ,నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి , కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , నాగారం మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి రామక్కపేట రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీరా ఫంక్షన్ హాల్ మౌలాలిలో జరిగిన వివాహానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి



- టీపీటీఎఫ్ రాష్ట్ర ఆదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్‌లోని అన్ని డీఏలను వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఆదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్‌కు ముఖ్యఅతిథిగా ఎన్నికల పరిశీలకులుగా వచ్చి మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన 15 రోజులలో పెండింగ్ డీఏలను విడుదల చేస్తామని వాగ్దానం చేసిందని, కనీసం రెండు వాయిదాల డీఏలు అయిన విడుదల చేస్తారని ఆశగా ఎదురుచూశామని.. కేవలం ఒక్క డీఏ మాత్రమే విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా వరుస క్రమంలో ఉన్న ఆర్థిక బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. మార్చి 31 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 11వేల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2014 తర్వాత పాఠ్యపుస్తకాల కరికులంలో మార్పులు చేయనందువలన నూతనంగా జరుగుతున్నటువంటి సాంకేతిక సాంఘిక ఆర్థిక శాస్త్రీయ ఆవిష్కరణలు మార్పులు విద్యార్థులకు తెలియకుండా పోతున్నాయనీ, సిలబస్‌ని సవరించాలని రవీందర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిల్లా కౌన్సిల్‌కు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర ప్రసాద అధ్యక్షత వహించారు. కార్యదర్శి నివేదికను ప్రధాన కార్యదర్శి రాంబాబు ప్రవేశపెట్టారు. సభ్యులు అందరు నివేదికను ఆమోదించారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికల పరిశీలకులు ఎం.రవీందర్ ప్రస్తుతమున్న కౌన్సిల్‌ను రద్దు చేసి.. నూతన కమిటీకి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సభ్యులు కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ జిల్లా టీపీటీఎఫ్ అధ్యక్షులుగా పి. వెంకటేశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.రాంబాబు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సురేందర్, సీతారామశాస్త్రి, ఎం. వెంకటేశ్వర్ రెడ్డి, గీత, కామేశ్వరి, శివానంద్, జగదీశ్వర్ కార్యదర్శులుగా సోమిరెడ్డి, ఏ.రవి, ఏ.వి రమణ, జి.సురేష్, జె వెంకటేష్, అన్నపూర్ణ, అర్షియా, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్.రామానందయ్య, ఎం.వెంకటరమణ, ఏ.రమణారావుల ను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందిచడంతో పాటు వాటి పరిశుభ్రతకు నిధులు కేటాయించాలని కోరారు.

విజయం సాధించే వరకూ ప్రయత్నం ఆపొద్దు



- రోలర్ స్కేటింగ్ చాంపియన్ కావ్య షాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

విజయం సాధించే వరకూ ప్రయత్నం ఆపొద్దనిరోలర్ స్కేటింగ్ చాంపియన్ కావ్య షాలి అన్నారు. గచ్చిబౌలిలోని అంబిటస్ కిండర్ వరల్డ్ వార్షిక క్రీడా ఉత్సవం "అంబిలీప్"ను స్కూల్ యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. కేంబ్రిడ్జ్ ఎర్లీ లెర్నింగ్ సెంటర్ చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల కినెస్తెటిక స్కిల్స్, సమన్వయం, సహకారం, క్రీడాస్ఫూర్తి విందుగా ప్రస్ఫుటం అయ్యాయి. ఈ ఉత్సవానికి ముఖ్యతిథిగా హాజరైన కావ్య షాలి మాట్లాడుతూ విజయం సాధించే వరకూ ప్రయత్నించాలనే ప్రేరణాత్మక సందేశం అందించారు. గౌరవ అతిథిగా హాజరైన స్టార్ లైట్ వెల్నెస్ సెంటర్ వ్యవస్థాపకురాలు అన్జలి డాంగే పోషణ, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లలపై ఒత్తిడి లేకుండా వారిని ఉత్సాహపరిచేందుకు తల్లిదండ్రులను ప్రేరేపించారు. పోంపోమ్స్, హూలాహూప్స్‌తో పిల్లలు నిర్వహించిన క్రీడలతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆ తర్వాత వారు ప్రదర్శించిన జిమ్నాస్టిక్స్ కసరత్తులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. థీమ్ ఆధారిత పరికరాలతో నిర్వహించిన రేసులు, ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు ప్రాముఖ్యతను ప్రతిబింబించాయి. మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకుంటూ సంతోషంతో తమ విజయాలను చిన్నారులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సంగీత, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | నవంబర్ 11, 2024 | www.navatelangana.com

బద్దం సుధాకర్ రెడ్డి దశదిన కర్మ



నవతెలంగాణ - చంపాపేట్

ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి తండ్రి, భాగ్య నగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి మామ బద్దం సుధాకర్ రెడ్డి దశదిన కర్మను ఆదివారం భారత్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, బంధువులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొగ్గులు, గనుల శాఖ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామ చందర్ రావు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండారు దత్తాత్రేయకు రుద్రయాగ ఆహ్వాన పత్రిక

నవతెలంగాణ-నాగోల్



లోక కళ్యాణార్థం నాగోల్ అల్కాపురిలోని శ్రీ విద్యా శక్తి పీఠంలో ఈ నెల 25 నుండి ఆరు రోజుల పాటు కార్తీక మాస రుద్ర యాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యా శక్తిపీఠం వ్యవస్థాపకులు శ్రీవిద్య ఉపాసకులు నారాయణ చక్రవర్తి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రామ్ నగర్‌లోని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి..యాగానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్జ సుధాకర్ శర్మ, ధడిగం రామ్ సుధాకర్ శర్మ, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్య శర్మ, రాయప్రోలు రాఘవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భయంతో
అనారోగ్యానికి గురవుతున్న పేదలు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

మూసీనది ప్రక్షాళనలో భాగంగా ఇండ్ల మీద అధికారులు మార్కు వేసిన నేపథ్యంలో తమ ఇండ్లను కూల్చివేస్తారనే భయంతో, దిగులుతో పేదలు అనారోగ్యానికి గురవుతున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే



దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీ నందు దాదాపు తాత, ముత్తాతల తరం నుంచి ఉన్న పట్టా స్థలంలో దాదాపు 53 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న యాదిరెడ్డికి ఇంటికి అధికారులు మార్క్ వేశారు. దీంతో అతనికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. యాదిరెడ్డి.. హాస్పిటల్ నందు చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, అట్టి పేరుతో వారికి ఎటువంటి న్యాయం చేయకుండా పేద ప్రజల ఇండ్లు కూల్చివేస్తామంటే మేము ఒప్పుకోమని అన్నారు. ఎన్నో సంవత్సరాల తాతల నుంచి సంపాదించిన ఆస్తిని.. నేడు కబ్జా చేశారని, కబ్జాదారులు అని చిత్రీకరించడం ఎంత వరకు న్యాయం అని అన్నారు. అన్ని రెవెన్యూ రికార్డ్ నందు పట్టా స్థలంగా ఉందని తెలిపారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీకు మేము, మా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ చారి, అంజయ్య, నిరంజన్, రామ్ నర్సయ్య, జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

'సీఎం సహాయనిధికి చిన్నారుల పాకెట్ మనీ'



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడలోని హెవెన్స్ కార్నర్ కాలనీకి చెందిన సామాజికవేత్త, భారతీయ సేవా సహకార ఫోరం ప్రిసైడింగ్ సభ్యులు, భట్రాజు యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి నరసింహారాజు పిల్లలు తమ పాకెట్ మనీని సీఎం సహాయనిధి పథకానికి అందజేశారు. ఈ విధంగా పిల్లలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. నరసింహారాజు పిల్లలు సూర్య తేజ్ భట్, ధరణితేజ్ భట్ ఇప్పటివరకు దాచుకున్న సుమారు రూ.20వేలతో పాటు వారి స్నేహితులు, కాలనీ వాసులు, బంధువులు, ఇతరుల నుంచి రూ.45వేలను సమకూర్చారు. మరోవారం రోజుల్లో లక్ష నూటపదహారు రూపాయలు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఇద్దరు చిన్నారులను అభినందించారు. తండ్రిలాగే చిన్నారులు కూడా సామాజిక బాధ్యతల్లో పాలుపంచుకోవడం శుభపరిణామమన్నారు. పేదల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందని, సామాజిక బాధ్యతగా సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలివ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిరిచందన, హరిచందన, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్‌నగర్ రాజరాజేశ్వరి కాలనీ నూతన కమిటీని కాలనీవాసులు ఆదివారం ఎన్నుకున్నారు. రాజరాజేశ్వరి కాలనీ నూతన అధ్యక్షుడిగా సింగిరెడ్డి మురళీధర్ రెడ్డిని ఏకగ్రీవంగా, ప్రధాన కార్యదర్శిగా కొండ నర్సింహ, కోశాధికారిగా జాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

సాంస్కృతిక సంబరాల్లో లార్డ్స్ విద్యార్థుల ప్రతిభ



- చైర్మెన్ సిద్దాల బీరప్ప

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సాంస్కృతిక సంబరాల్లో లార్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచినట్లు లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప తెలిపారు. ఆదివారం హైద్రాబాద్ నగరం నాంపల్లిలోని వనిత మహా విద్యాలయం ఆవరణలో జరిగిన హిందూ ఆధ్యాత్మిక, సనాతన, సంస్కృతి సంప్రదాయం, విలువలుపై జరిగిన కార్యక్రమంలో లార్డ్స్ విద్యార్థులు కోలాహలం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ట్రస్మా అధ్యక్షులు, లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ 'పరమవీర వందనం'లో లార్డ్స్ విద్యార్థుల ప్రదర్శన దేశభక్తిని ప్రేరేపించి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక, సనాతన ధర్మాలతో పాటు దేశభక్తి విలువలను నేటి విద్యార్థులకు తెలియజేసి, వారికి భారతీయ దేశభక్తి దాని విలువలను నేర్పడం తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, లార్డ్స్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్స్ రామిడి సంతోష్, బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం పేరు మార్చుకోకపోతే అవస్థలే..





- ఆంధ్రప్రదేశ్ పేరుతో ఉంటే గుర్తింపు లేదు
- రాష్ట్రం పేరు మార్పు కోసం బారులు తీరిన ప్రజలు
- పాత జిల్లాల పేర్లతో ఉన్న చెల్లడం లేదు

నవతెలంగాణ-ఎల్బీనగర్

మీ ఆధార్ కార్డులో రాష్ట్రం పేరు మార్చుకోండి.. లేకపోతే అవస్థలు తప్పవు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో అందరూ ఆధార్ కార్డు తీసుకున్నారు. ఆధార్ కార్డులో ఇంటి అడ్రస్, జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో ఆధార్ కార్డు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుతో ఉన్న ఆధార్ కార్డులను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదు. తెలంగాణ రాష్ట్రం పేరుతో కొత్త కార్డులను తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల మీసేవ కేంద్రాలలో తెలంగాణ కార్డుల కోసం ప్రజలు క్యూ కడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో పది జిల్లాలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త జిల్లాలు వచ్చాయి. పాత జిల్లాల పేరుతో ఉన్న కార్డులు ఇప్పుడు చెల్లడం లేదు. మీ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకొని రావాలని కోరుతున్నారు. ఇటీవల వీసాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ అని ఉంటే వీసా అధికారులు గుర్తించడం లేదు. పాస్‌పోర్ట్ కోసం కార్యాలయానికి వెళితే మీ ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరు ఉందని.. ఆ కార్డు చెల్లదని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం పేరుతో కార్డు తీసుకొని రావాలని అప్పుడే పాస్‌పోర్ట్ మంజూరు చేస్తామని పాస్‌పోర్ట్ అధికారులు చెప్పడంతో బాధితులు ఖంగు తింటున్నారు. విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లేవారు తెలంగాణ రాష్ట్రం పేరుతో ఆధార్ కార్డుల కోసం మీ సేవ సెంటర్ లకు లైన్ కడుతున్నారు. లక్షలాదిమంది మన దేశం నుండి వెళ్లి ఇతర దేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారు. తమ పిల్లల దగ్గరికి వెళ్లి చూసి రావడం కోసం వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుతో ఉన్న ఆధార్ కార్డులను అధికారులు గుర్తించడం లేదని వాపోతున్నారు. మీ ఆధార్ కార్డులను తెలంగాణ రాష్ట్రం పేరుతో అప్ డేట్ చేసుకొని రావాలని సూచించినట్టు బాధితులు తెలిపారు. ఆధార్ కార్డు ఉందని ఇంతకాలం భరోసాతో ఉన్న ప్రజలు తమ ఆధార్ కార్డులను అప్ డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లా, మండలాల పేర్లు మారిపోయినాయి. గతంలో ఎప్పుడో తీసుకున్న ఆధార్ కార్డును మనం అప్ డేట్ చేసుకోకపోతే అవసరానికి ఆధార్ కార్డు ఉపయోగపడడం లేదు. ప్రజలకు దీనిపైన అవగాహన లేకపోవడంతో వేలాదిమంది తమ ఆధార్ కార్డులను అప్ డేట్ చేసుకోలేకపోయారు. అవసరాల కోసం ఆధార్ కార్డును ప్రభుత్వ కార్యాలయ వద్ద తీసుకెళ్తే తెలంగాణ రాష్ట్రం పేరుతో ఆధార్ కార్డు తీసుకొని రావాలని చెబుతున్నారు. దీనివలన ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ఆధార్ అప్ డేట్ కోసం దరఖాస్తు దారుడు ఇద్దరు గెజిటెడ్ సంతకాలు తీసుకోనిరావాలి. బ్యాంకు స్టేట్‌మెంట్, ఒరిజినల్ ఓటర్ ఐడీ కార్డు కావాలని మీసేవ నిర్వాహకులు కోరుతున్నారు. బ్యాంకు పాస్‌బుక్‌ను గుర్తించడం లేదు. బ్యాంక్ స్టేట్‌మెంట్ కావాలని అడుగుతున్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఐఎఫ్‌సి కోడ్ నెంబర్ ఉంటుంది. అది ఇతరుల చేతికి వెళ్ళితే సైబర్ నేరాలు జరిగే ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రం ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం.. ఆ కేంద్ర ప్రభుత్వమే ఆధార్ కార్డులో తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకుంటే దానికి కావలసిన ప్రూఫులు కావాలని అడుగు తుంది. అదే ఇంటి నెంబర్ అదే జిల్లా పేరు అడ్రస్ అంతా కరెక్ట్‌గా ఒక్క తెలం గాణ రాష్ట్రం పేరు మార్పు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్, ఓటరు ఒరిజినల్ కార్డు, ఇద్దరు గేజిటెడ్ అధికారుల సంతకాలు కావాలి అని అడుగుతున్నారు. మీ సేవలో ఇవన్నీ కావాలని అడుగుతున్నారు. ఆధార్ కార్డులో ఒక్క తెలంగాణ రాష్ట్రం పేరు మార్పు కోసం అనేక ఆధారాలు కావాలని అడగడం వింత గా ఉంది. ప్రజలు అప్రమత్తమై వెంటనే మీ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలి. లేకపోతే ఆధార్ అవసరం ఏర్పడినప్పుడు అది పని చేయదు. అనేక అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడైనా మీ ఆధార్ కార్డును వెంటనే తెలంగాణ రాష్ట్రం పేరుతో తీసుకోవాలి.

సమగ్ర సర్వే దేశానికే ఆదర్శం



కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న కులగణన సమగ్ర సర్వే దేశానికే ఆదర్శమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు 26 రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం, అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా ఏడాది పాలన పూర్తి కావొస్తున్నందున విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 50 వేల ఉద్యోగాల భర్తీ, రూ.18వేల కోట్ల రైతు రుణాలు మాఫీ, ఆడపడుచులకు రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్టు వెల్లడించారు. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఈ 26 రోజుల పాటు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు. ఆరు గ్యారెంటీలతో పాటు సాగునీటి ప్రాజెక్టులు, పౌర సరఫరాలు, విద్య, వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. కులగణన సమగ్ర సర్వేతో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండోసారి
కాలనీ అధ్యక్షుడిగా అశోక్ యాదవ్



నవతెలంగాణ-హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్, వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ భవనంలో ఆదివారం నిర్వహించిన కాలనీ కార్యవర్గ సభ్యుల సమావేశంలో స్థానికుల అభిప్రాయాల మేరకు రెండోసారి ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధ్యక్షుడిగా కాసాని అశోక్ యాదవ్‌ను కాలనీవాసులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసుల సహకారంతో కాలనీ అభివృద్ధి, ఆధ్యాత్మిక సాంస్కృతి కార్యక్రమాలను దిగ్విజయం చేశామని చెప్పారు. తెలిపారు.రాబోవు రెండు సంవత్సరాలలో కూడా అందరీ సహకారంతో కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తనను రెండోసారి కూడా కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీ వాసులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో భాగస్వాములు కావాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన కుల గణన సర్వేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న బడంగ్‌పేట్‌లో చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ సరస్వతీలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కులగణన సమగ్ర సర్వేతో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు సమ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. పథకాలు ప్రతి పేదవారికి అందాలనేదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, లిక్కి మమత కృష్ణ రెడ్డి, ఆర్వో



వేణుగోపాల్ రెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు గట్టు బాలకృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'

నవతెలంగాణ-హయత్ నగర్

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్, కాస్మోపాలిటన్ కాలనీలో మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, సరిత పోలి క్లినిక్ నిర్వాహణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నేటి రోజుల్లో ప్రజలందరూ ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య విషయంలో ఏ చిన్న మార్పు వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సరిత పోలి క్లినిక్ ఉచితంగా కంటి వైద్య



పరీక్షలు చేసిన యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాస్మోపాలిటన్ కాలనీ అధ్యక్షులు రుద్ర లక్ష్మీనరసింహ, గంజి సత్తయ్య, సుధాకర్ రెడ్డి, పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, వనం భాస్కర్, శ్రీకాంత్ గిరిజాల విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పర్యవేక్షణ అధికారిగా ప్రియాంక ఐఏఎస్

నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పర్యవేక్షణ అధికారిగా ప్రియాంక ఐఏఎస్‌ను డిప్యూటీ సెక్రటరీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వారు ఎల్బీనగర్ జోన్‌కు నోడల్ అధికారిగా నియమించారు. ఈ మేరకు హయత్‌నగర్ పరిధిలోని శారదానగర్‌లో ఆదివారం చేపట్టిన సర్వే ప్రక్రియను ఆదివారం ప్రియాంక ఐఏఎస్ పరిశీలించారు. జరుగుతున్న సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పెనం జిడ్డుగాను వదిలిద్దాం..

మనం వంటింట్లో ఎన్నో రకాల ఆహార పదార్థాలను తయారు చేసుకొని తింటూ ఉంటాము. ఈ క్రమంలోనే వారంలో రెండు మూడు సార్లయినా దోశ, చపాతి చేయడం కోసం పెనం ఉపయోగిస్తూ ఉంటాము. ప్రస్తుత కాలంలో చాలామంది నాన్ స్టిక్ పెనం ఉపయోగిస్తున్నారు. కానీ ఆరోగ్యంపై ఇటీవల కాలంలో చాలా మంది దృష్టి సారించి ఐరన్ పెనం కూడా ఉపయోగిస్తున్నారు. ఇలా ఇనుప పెనం వాడటం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

పెనం ఉపయోగించే క్రమంలో కొద్ది రోజులకే అది జిడ్డుగా మారిపోయి చివరిన నల్లగా కూడా తయారవుతుంది ఇలాంటి వాటిలో ఆహార పదార్థాలు తయారు చేసుకుంటే అది ప్రమాదకరంగా మారుతుంది.



ఇలా పేరుకుపోయిన జిడ్డు మరకలు ఎంత ప్రయత్నించినా కొన్నిసార్లు పోవు. ఈ సింపుల్ చిట్కాలను ఉపయోగించి పెనంపై ఉన్నటువంటి జిడ్డు మరకలను చాలా ఈజీగా తొలగించవచ్చు.

ఒక నిమ్మకాయ తీసుకొని మధ్యలో కట్ చేసి దానిని ఉప్పులో ముంచి పెనం మొత్తం రుద్దాలి ఇలా ఐదు నిమిషాల పాటు ఉంచిన తర్వాత వేడి నీటితో శుభ్రం చేసి స్క్రబ్ తీసుకొని బాగా రుద్దితే జిడ్డు మరకలు పోతాయి.

వెనిగర్ కూడా పెనం మీద జిడ్డును తొలగించడానికి చాలా బాగా సహాయ పడుతుంది. ఒక గిన్నెలో నీరు, వెనిగర్ సమాన భాగాలుగా తీసుకుని బాగా కలిపి స్పాంజ్ సాయంతో పెనం మీద రుద్దితే జిడ్డు మొత్తం తొలగిపోతుంది. ఇలా ఈ సింపుల్ చిట్కాలతో ఈజీగా జిడ్డును తొలగించి శుభ్రం చేసుకోవచ్చు.

మనతో మనం సంభాషించుకుందాం...



మన జీవితంలో అత్యంత ప్రభావశీలమైన సంభాషణ మనం ఇతరులతో మాట్లాడేది కాదు, మనతో మనం మాట్లాడుకునేదే. మన ఆలోచనల రూపంలో నిత్యం మనలో జరిగే ఈ ఇంటర్నల్ డైలాగ్‌నే స్వయం భాష (Self-Talk) అంటారు. ఇటువంటి సంభాషణ సాధారణంగా మహిళలకే ఎక్కువ అవసరం. ఈ భాష చాలా శక్తివంతమైనది. ఎందుకంటే ఇది మన భావోద్వేగాలను, ఆత్మవిశ్వాసాన్ని, నిర్ణయాలను, విజయాలను ప్రభావితం చేస్తుంది. మన ఆలోచనలు మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా చూస్తామో ఆ దృక్పథాన్ని తీర్చిదిద్దుతాయి.

Mirror Work అనేది మన స్వయాన్ని శక్తివంతం చేసుకోవడానికి ఉపయోగపడే ప్రభావవంతమైన పద్ధతి. దీని మూలాలను రచయిత లూయిస్ హే విస్తృతంగా ప్రచారం చేశారు. "You Can Heal Your Life" అనే తన ప్రసిద్ధ పుస్తకంలో ఆమె Mirror Work విలువను వివరించారు. అద్దం ముందు నిలబడి మనతో మనం సానుకూలంగా మాట్లాడుకోవడం, మనలోని పాజిటివ్ లక్షణాలను గుర్తించడం ద్వారా మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చు. లూయిస్ హే ప్రకారం మనలో ప్రతి సమస్యకు మూలం మన స్వీయ అవగాహనలోనే ఉంటుంది. "I love and accept myself exactly as I am" వంటి Affirmationsను అద్దం ముందు ప్రతిరోజూ పునరావృతం చేయడం ద్వారా మన Subconscious Mind పాజిటివ్ మార్పులకు సిద్ధమవుతుంది. ఈ Mirror Work నెగటివ్ స్వయం భాషను తగ్గించి, సానుకూల ఆలోచనల ప్రబలతను పెంచుతుంది. ఇది మనలోని లోతైన భయాలు, ఆత్మన్యూనతా భావనను బయటకు తీసి, ప్రేమతో స్వీకరించడానికి మార్గం చూపుతుంది. లూయిస్ హే పద్ధతిని అనుసరించి అనేక మంది తమ జీవితాల్లో సానుకూల మార్పులను పొందారు.



Subconscious Conditioning

మన Subconscious Mind అనేది నెగటివ్ విశ్వాసాలు, అనుభవాలు, భావోద్వేగాలతో నిండి ఉంటుంది. ఇవి మనకు తెలియకుండానే మన ఆచరణలను, భావోద్వేగాలను ప్రభావితం చేస్తాయి. ఈ Conditioning వల్లనే Automatic Negative Thoughts (ANTs) పుట్టుకొస్తాయి. "నేను సరైన మనిషిని కాదు," "నేను ఎప్పుడూ విఫలమవుతూనే ఉంటాను" వంటి ఆలోచనలు మన సత్తాను తగ్గిస్తాయి. ఈ Conditioningను సానుకూలంగా మార్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. Positive Affirmations, Visualization, Gratitude వంటి సాధనాలు Subconscious Conditioningను పున:ఆకృతం చేయడంలో కీలకంగా ఉంటాయి.

Cognitive Distortions - మన ఆలోచనా విధానంలో అవాంతరాలు

Cognitive Distortions అనేవి మన ఆలోచనల్లో జరిగే తప్పులు. ఇవి మన సమస్యలను, జీవిత పరిస్థితులను అధికంగా కష్టతరంగా చూపిస్తాయి. కొన్ని సాధారణ Cognitive Distortions

1. All-or-Nothing Thinking: "ఏదైనా పూర్తిగా పర్ఫెక్ట్‌గా లేకపోతే అది విఫలం" అని భావించడం.
2. Overgeneralization: ఒక తప్పిదం జరిగినపుడు "ఇప్పుడంతా ఇలాగే జరుగుతుందా?" అని అనుకోవడం.
3. Catastrophizing: చిన్న సమస్యను పెద్ద ప్రమాదంగా ఊహించడం.

Automatic Negative Thoughts (ANTs) - మానసిక ఆందోళనలకు మూలం

ANTs అనేవి అవగాహన లేకుండా మనలో పుట్టుకొచ్చే నెగటివ్ ఆలోచనలు. ఇవి మన శక్తిని తగ్గించడమే కాకుండా, మన వ్యక్తిత్వాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు ఒకసారి విఫలమైతే, "నేను ఎప్పుడూ విజయవంతం కాలేను" అనే ఆలోచన వెంటనే ఉద్భవిస్తుంది. ఈ ఆలోచనలను గుర్తించడం మొదటి దశ. ఆ తర్వాత వాటిని సవాలు చేయడం, పాజిటివ్ ఆలోచనలతో వాటిని బదులిండడం అవసరం. దీని వల్ల మన ఆత్మవిశ్వాసం క్రమంగా మెరుగుపడుతుంది.

Journaling - ఆలోచనల అద్దం

Journaling అనేది మన ఆలోచనలను రికార్డు చేసుకునే సమర్థమైన పద్ధతి. ఇది మన లోతైన భావాలను, ఆలోచనలను వెలుగులోకి తీసుకొచ్చే ఒక కాగితం అద్దంలా పనిచేస్తుంది. మన అనుభవాలు, సమస్యలు, భావోద్వేగాలను రాసుకోవడం ద్వారా మనకు తెలియకుండానే మనలో నెగ్గి వచ్చిన నెగటివ్ థాట్ ప్యాటర్న్స్ అవగాహనకు వస్తాయి. Journaling మరింత లోతైన స్వీయ పరిశీలనకు దారితీస్తుంది. నిత్యం రాసుకోవడం ద్వారా రిపిటేటివ్, మనకు ఉపయోగపడని ఆలోచనల గుర్తింపునకు సాధ్యపడుతుంది. ఈ ఆలోచనలను పాజిటివ్‌గా మార్చడం, వాటిపై సరైన చర్యలు తీసుకోవడం ఈ ప్రక్రియ ద్వారా సాధ్యమవుతుంది.



Negative Thoughtsను Positive Affirmationsతో మార్చడం

నెగటివ్ ఆలోచనలను పూర్తిగా తొలగించడం అనేది కాస్త కష్టమే. కానీ వాటిని పాజిటివ్ ఆలోచనలతో స్వాపింగ్ చేయడం సాధ్యమే.

ఉదాహరణకు:

- Negative Though: నేను విఫలుడినే.
- Positive Affirmation: విజయం సాధించడానికి నేను కావాల్సిన శక్తిని, కృషిని కలిగి ఉన్నాను.

ప్రతిసారీ నెగటివ్ ఆలోచన వస్తే, దానిని పాజిటివ్ భావనతో మార్చడం క్రమంగా Subconscious Mindను పున:ప్రోగ్రామ్ చేస్తుంది. ఈ విధానం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జీవితంపై సానుకూల దృక్పథాన్ని కలిగిస్తుంది.

స్వయం భాషను పాజిటివ్‌గా మార్చడం

మనలోని స్వయం భాషను పాజిటివ్‌గా మార్చడం అనేది ఒక ప్రయాణం. ప్రతిరోజూ సానుకూలంగా మనతో మాట్లాడడం, మన ఆలోచనలను రికార్డు చేయడం, వాటిని పున:ప్రతిష్ఠించడం ద్వారా మన జీవితానికి కొత్త దారులు తెరవవచ్చు. 'యథా దృష్టి, తథా సృష్టి' అనే సూత్రం ప్రకారం, మన ఆలోచనలు మన జీవిత పరిస్థితులను తీర్చిదిద్దుతాయి. మీరు పాజిటివ్‌గా ఆలోచిస్తే, మీ చుట్టూ ఉన్న ప్రపంచం సానుకూలంగా మారుతుంది. మీ ఆలోచనలు మీ భవిష్యత్తుకు పునాది.

Wishing you all a happier and healthier life as always

ఉమెన్ హెల్త్

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314



ఎన్యూమరేటర్లకు ఇక్కట్లు..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. కుటుంబ సర్వేకు కొంతమంది ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. మెజార్టీ ప్రజలు సహకరించడం లేదని ఎన్యూమరేటర్లు సంబంధిత అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ సర్వేలో ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో కొంతమంది తమకు కేటాయించిన ఇండ్లకు ఇప్పటికే స్టిక్కర్ అంటించే ప్రక్రియను పూర్తిచేశారు. అవగాహనలేమి, ఇతర కారణాలతో పలు ప్రాంతాల్లో ప్రజలు స్టిక్కర్ వేసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం లాంటివి చేస్తున్నారు. దాంతో కొన్ని ప్రాంతాల్లో ఇంకా స్టిక్కర్ వేసే పనులు పూర్తికాలేదు. నగర వ్యాప్తంగా తొలిరోజు శనివారం సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సర్వే కోసం సుమారు 2వేలకుపైగా ఉపాధ్యాయులతో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలను నియమించారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 150, 175 ఇండ్ల చొప్పున కేటాయించగా.. ఒక్కొక్కరూ ప్రతి రోజూ పది ఇండ్లకు వెళ్లి సర్వే చేయాలి. మొత్తం 75 ప్రశ్నలు ఉండగా.. వాటిని ఒక్కొక్కటిగా అడిగి సమాధానాలు తెలుసుకొని ఫారం నింపాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా తొలిరోజు క్షేత్రస్థాయిలో సర్వే కోసం ఇంటికి వెళ్లిన ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి వింత ప్రశ్నలు, చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఎదురు ప్రశ్నలతో ఇబ్బందిపడటంతో తమ వ్యక్తిగత వివరాలు ఎందుకు చెప్పాలంటూ పలువురు ప్రశ్నించారు. ఇండ్లు, పింఛన్లు ఎప్పుడిస్తారని అడుగుతుండటంతో సమాధానం చెప్పలేని పరిస్థితి. ప్రధానంగా కుటుంబ సర్వేపై ప్రజల్లో అవగాహన లేమితో పాటు అనుమానాలు ఎక్కువగా తలెత్తుడటంతో వివరాల నమోదుకు ముందుకు రావడం లేదు. సరిగా స్పందించడం లేదు. బస్తీల్లో ప్రజలు స్పందిస్తున్నప్పటికీ, ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్స్, పలు కాలనీలతో పాటు సింగిల్ ఇండ్లు ఉన్న చోట ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వివరాలు చెప్పేందుకు నిరాకరించడం, తమ వివరాలు ఎందుకు చెప్పాలని కొందరు ఎదురు ప్రశ్నిస్తుండటంతో పాటు దుర్భలాడుతున్న సంఘటనలు ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలతో పాటు బండ్లగూడ, కింగ్‌కోఠి, నల్లకుంట, కాచిగూడ, బాగ్ అంబర్‌పేట్, గోల్నాక, బంజారాహిల్స్ లాంటి ఏరియాల్లో ఎన్యూమరేటర్లపై దూషణలు, దాడులు చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇదిలావుంటే మహిళా ఎన్యూమరేటర్ల పరిస్థితి మరి దారుణంగా ఉందని, భయం భయంతో సర్వే చేయాల్సిన పరిస్థితి నెలకొన్నట్టు తెలిసింది. ఒక్కో ఇంటి సర్వేకు ఇద్దరు లేదా ఒక ఎన్యూమరేటర్‌తో సెక్యూరిటీ ఇవ్వాలని కోరుతుండటం క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిస్థితులు ఉన్నయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

కోడ్ ఆధారంగా వివరాల నమోదు..!

ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఇచ్చిన ఫారంలో ప్రతి అంశానికి ఒక్కో కోడ్ ఉంది. ఆ కోడ్ ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ వివరాలన్నింటినీ నమోదు చేసేందుకు దాదాపు అరగంటకుపైనే సమయం పడుతోంది. సర్వే ప్రొఫార్మాల నమోదులో కోడింగ్‌ను అత్యంతగా జాగ్రత్తగా నింపాల్సి ఉంటుంది. అయితే ఈ కోడ్లకు సంబంధించిన కాపీని మాత్రం సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు ఇవ్వలేదు. దాంతో ఫోన్‌లో చూసి కోడ్‌లను నమోదు చేయడం ఇబ్బందిగా మారిందని వివరించారు. అంతేగాక సర్వే నేపథ్యంలో ఉదయం 8.30గంటలకు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తిరిగి ఇంటికి వెళ్లేసరికి రాత్రి 9 అవుతుందని చెబుతున్నారు. ఇలా అనేక సమస్యల నడుమ సర్వే విజయవంతానికి ఎన్యూమరేటర్లు కృషిచేస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేవు. సర్వేకోసం ఇంటింటికి వెళు న్న ఎన్యూమరేటర్లకు ప్రజలు అనుకున్నస్థాయిలో సహకరించడం లేదని అర్థమవుతోంది. అంతేగాక మహిళా ఎన్యూమరేటర్ల పట్ల కొందరు అసభ్యంగా మాట్లాడుతున్నారు. ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి ఉందని అంటున్నారు. సర్వే సమయంలో తమకు సెక్యూరిటీ కల్పించాలని కోరుతున్నారు. లేదా ఒక్కొ ఇంటికి ఒక ఎన్యూమరేటర్‌తో పాటు మరొకరిని సహాయంగా పంపాలని వారు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.

ఎన్యూమరేటర్లకు పని భారం తగ్గించాలి : జి.రాజారావు, ఎ.శ్యామ్ సుందర్, టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

కుల గణన సందర్భంగా ఎన్యూమరేటర్లుగా నియమించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పని భారం తగ్గించాలని, ఇంకా ఎక్కువ మందిని ఎన్యూమరేటర్లుగా తీసుకొని ప్రతి ఎన్యూమరేటర్‌కి 100 లోపు కుటుంబాలు వచ్చేటట్టుగా చర్య తీసుకోవాలి. ప్రస్తుతం ఒక ఎన్యూమరేటర్ 150, 175 కుటుంబాలు ఉండగా మరికొంత మందికి 200పైగా కేటాయించడం తలకు మించిన భారంగా మారుతుంది. కాబట్టి ఈ విషయమై జిల్లా కలెక్టర్ పునరాలోచన చేసి ఎన్యూమరేటర్ల సంఖ్యను పెంచాలి. అదే సందర్భంలో ఎన్యూమరేటర్లకి ఇచ్చే రెమ్యూనరేషన్ సర్వే చేసిన

సర్వేలో 'సంచార' జాతుల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. బీసి కులాల్లోనే రిజర్వేషన్లను సంచార జాతులకు అందకుండా బీసీలోని అగ్రకులాలు దశాబ్దాలుగా పొందుతూ వస్తున్నారు. అల్ప సంఖ్యాకులుగా ఉన్న సంచార జాతి కులాలను రాష్ట్ర ప్రభుత్వం సైతం చిన్నచూపు చూస్తూ కాలమ్‌ను చేర్చి తొలగించడంపై ఆ కులాల ప్రతినిధుల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా, బీసీలోని పలు గ్రూపుల్లో దాదాపు 52 సంచార జాతి కులాలు ఉన్నాయి. అలాగే బీసీ -ఈ గ్రూప్‌లో 14 సంచార ముస్లిం కులాలు ఉన్నాయి. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి సర్వే ఫారమ్‌లోని కాలమ్ నెంబర్ 45 ద్వారా వీరి జనాభా ఆర్థిక రాజకీయ సామాజిక స్థితిగతులు తెలుస్తాయని భావించారు. కానీ సర్వే ఫారమ్ నుంచి ఆ కాలమ్ తొలిగించి సంచార జాతి కులాల ఉనికిని కాలరాస్తున్నారని సంచార కులాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచార జాతి కులాలకు సంక్షేమం కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తిరిగి చేర్చాలని సంచార జాతి కులాల నాయకులు, ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 52 సంచార కులాలు

ఎంబీసీ కార్పొరేషన్‌లో 35 కులాలు ఉన్నాయి. అవి.. బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దులవాళ్ళు, జంగం జోగి, మొండివాళ్ళు, మొండిపట్ట, మొండిబండ, వంశరాజ్, పాముల, పార్ధి, నక్కల, పంబాల, పెద్దమ్మల్లోళ్ల, వీరభద్రయ, గుడాల, కంజెరబట్ట, రెడ్డిక, నేక్కార్, పరికిముగ్గుల, యాట, చోపేమారి, కైకడి, జోషి నందివాళ, మందుల, కూనపులి, పత్ర, పాలఏకరి, రాజన్నల, గోత్రాల, బుక్క అయ్యవారు, కశికాపాడి, సిద్దుల. కాగా, ఏడు దశాబ్దాలుగా ఎటువంటి గుర్తింపు పొందకుండా 2020లో కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ-ఏ జాబితాలో చేర్చిన సంచార జాతి కులాలు 13. అవి.. పతంవారు, ఆద్దమువారు, బాగోతుల, బైలిప్పామ్మురి, ఏనుటి, గంజికూటివారు, గౌడజెట్టి, కాకిపడగల, మాసాయ్యలు, ఓడ్, శ్రీశత్రియరామజోగి, తెరాచీరాల, తోలుబొమ్మలాటవారు. అలాగే ఫెడరేషన్స్‌లలో ఉన్న 4 కులాలు ఉండగా, అవి.. వడ్డెర, పూసల, మేదరి, బోయ.

బీసీ-ఈ గ్రూప్‌లో ఉన్న పేద ముస్లిం కులాలు.. అచ్చుకట్లవాండ్లు, సింగలి, సింగంవాళ్లు, అచ్చుపనివాళ్లు, అత్తరు సాయిబులు, అత్తరోళ్లు దోబీ ముస్లిం, ముస్లిమ్ రజకులు ఫకీరు, ఫకీరు బుడ్‌బుడ్కి, గంటా ఫకీర్లు, దర్వేష్ ఫకీర్ గారడీ సాయిబులు, పాముల వాళ్లు, కనికట్టు వాళ్లు గోసంగి ముస్లిమ్, పకీరుసాయిబులు, ఎలుగుబంటు వాళ్లు, ముసల్మాన్ కీలుగుర్రల వాళ్లు హజమ్, నాయి ముస్లిమ్, నవీద్ లబ్బి, లబ్బాయి, లబ్బన్, లబ్బ పకీరియా, బోరెవాలె, డేరా ఫకీర్లు, బొంతే వాలే, ఖురేషి,ఖసబ్, మరాఠి ఖసబ్, ముస్లిం కటిక. షైక్, షేక్ షేక్. సిద్ధి, యాబ, హబ్షి, జసి తురక కాశ, జింకసాయిబులు, చక్కిటకానెవాలె (రోళ్లకు కక్కు కొట్టేవారు), పట్టర్ పోడులు.

మా కులాల భవిష్యత్తుతో ఆడుకోవద్దు : జాదవ్ శరత్, ఏఐడీఎన్టీ జిల్లా అధ్యక్షులు, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్,

దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సంచార జాతుల భవిష్యత్తుతో ఆడుకుంటే ప్రభుత్వాల, పార్టీల భవిష్యత్తును తలకిందులు చేసేందుకు వెనుకాడబోం. సంచార జాతులను అల్పసంఖ్యాకులుగా భావించి కేవలం ఎన్నికల దృష్టితో చూస్తూ సమాజంలో తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారు. స్వాతంత్రానంతరం బీసీల పేరుతో, బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఎంబీసీ పేరుతో సంచార జాతులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇప్పటికైనా సంచార జాతులను ప్రత్యేకంగా గుర్తించే విధంగా కాలమ్‌ను కొనసాగిస్తూ భవిష్యత్తులో సంక్షేమ పథకాలను అందించాలి.

సర్వే నమూనాలో కాలమ్ 45ను ఎందుకు తొలగించారో చెప్పాలి

- తిప్పిరి శెట్టి శ్రీనివాస్, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు

బీసీ కుల గణన నమూనాలో సంచార, అర్ధ సంచార, డీనోటిఫైడ్ కాలమ్ 45ను చేర్చి తిరిగి ఎందుకు తొలగించారో సంచార జాతులకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం చెప్పాలి. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్న సంచార జాతుల కులగణన ఎంతో అవసరం. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా సంచార తెగల గణన కమిషన్‌లు ఏర్పాటు చేస్తుంటే రాష్ట్రంలో గుర్తించి తొలగించడం అంటే సంచారజాతులను చులకన చేయడమే అవుతుంది. వెంటనే సంచార తెగల కాలమ్‌ను ఏర్పాటు చేసి సర్వేను కొనసాగించాలి.

బుల్డోజర్ న్యాయం తగదు

(మొదటిపేజీ తరువాయి)

న్యాయస్థానం ఆ వ్యక్తికి నష్టపరిహారంగా ఇరవై ఐదు లక్షల రూపాయలు అందజేయాలని ఆదేశిస్తూ పలు వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలు శనివారం మీడియాకు అందుబాటులోకి వచ్చాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ చర్య ఏకపక్షంగా ఉన్నదని, ఇతరుల మనోభావాలను పట్టించుకోకుండా అధికార దర్పంతో ప్రవర్తించారని, ఇలాంటి చర్యలకు చట్టపరంగా అనుమతి లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వ చర్యపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఏ అధికారిని లేదా ఏ విభాగాన్ని అయినా ఇలాంటి చట్టవిరుద్ధ ప్రవర్తనకు పాల్పడడానికి అనుమతిస్తే వారు కొందరిని లక్ష్యంగా చేసుకొని ప్రతీకారంతో ఆస్తులను కూల్చివేసే ప్రమాదం ఉన్నదని తెలిపింది. 'పౌరుల ఆస్తులు, ఇళ్లను ధ్వంసం చేస్తామని బెదిరించడం ద్వారా వారి గొంతుకలను అణచివేయలేరు. మానవులకు అంతిమంగా భద్రత కల్పించేది నివాస స్థలమే. ప్రజల ఆస్తులను చట్టవిరుద్ధంగా ఆక్రమించడాన్ని, ఆక్రమణలను చట్టం నిస్సందేహంగా క్షమించదు. చట్టవిరుద్ధమైన ఆక్రమణల విషయంలో మున్సిపల్, పట్టణ ప్రణాళిక చట్టాలలో అనేక నిబంధనలు ఉన్నాయి' అని సుప్రీంకోర్టు తన ఆదేశాలలో వివరించింది.

చట్టాలు అమలులో ఉన్నప్పుడు వాటిలో ఉన్న రక్షణ చర్యలను విధిగా గమనించాలని సుప్రీంకోర్టు సూచించింది. పౌరుల ఆస్తులపై చర్య తీసుకోవడానికి ముందు తప్పనిసరిగా పాటించాల్సిన విధానపరమైన మార్గదర్శకాలను నిర్దేశించుకోవాలని సలహా ఇచ్చింది. చట్టవిరుద్ధమైన చర్యలను అనుమతించే లేదా వాటికి పాల్పడే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని చెప్పింది. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై తప్పనిసరిగా క్రిమినల్ చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని, వారు ఏ చర్య తీసుకున్నప్పటికీ అది చట్టబద్ధంగానే ఉండాలని తెలిపింది. రహదారి విస్తరణ ప్రాజెక్టును చేపట్టే ముందు రాష్ట్ర ప్రభుత్వం లేదా దాని విభాగాలు రికార్డులు, మ్యాప్‌ల ద్వారా రోడ్డు వెడల్పును తప్పనిసరిగా నిర్ధారించాలని సూచించింది. రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించి ప్రస్తుత రహదారిపై ఏవైనా ఆక్రమణలు ఉన్నాయని భావిస్తే వాటిని నిర్ధారించడానికి సర్వే జరపాలని, ఆ తర్వాత సరిహద్దులను నిర్ణయించాలని తెలిపింది. ఒకవేళ ఆక్రమణలు జరిగాయని గుర్తిస్తే ముందుగా సంబంధిత వ్యక్తులకు లిఖితపూర్వక నోటీసు అందించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దానిపై అభ్యంతరాలు వ్యక్తమైతే సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా పరిష్కరించాలని చెప్పింది. అభ్యంతరాలను తిరస్కరిస్తే తీసుకోబోయే చర్యను సహేతుకంగా నోటీసు ద్వారా తెలియజేయాలని, సంబంధిత వ్యక్తులు వాటిపై స్పందించకపోతే అప్పుడు చట్టప్రకారం ఆక్రమణలు తొలగించవచ్చునని తెలిపింది. విస్తరణ కోసం ప్రస్తుతం ఉన్న రహదారి సరిపోని పక్షంలో చట్టప్రకారం వ్యక్తుల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టవచ్చునని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లో అక్రమ కూల్చివేతకు కారకులైన అధికారులు, కాంట్రాక్టర్లపై విచారణ జరపాల్సిందిగా సుప్రీంకోర్టు తన ఉత్తర్వులలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

కార్ల కంటైనర్‌లో మంటలు

(మొదటిపేజీ తరువాయి)

దగ్ధమయ్యాయి. ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎల్ 01ఏహెచ్6311 నెంబర్ గల కంటైనర్‌లో టాటా నెక్సన్ కంపెనీకి చెందిన 8 కార్లను గుజరాత్ నుంచి ముంబై మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రంజోల్ పరిధిలోని హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి బైపాస్‌పై ఒక్కసారిగా కంటైనర్‌లో మంటలు వ్యాపించాయి. దాంతో కంటైనర్‌లోని 8 కార్లు దగ్ధమైనట్టు ఫైర్ అధికారి తెలిపారు. స్థానికుల సమాచారంతో జహీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది తమ శకటాలతో ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. కాగా, డ్రైవర్ నేవారం మీనాను మంటల నుంచి రక్షించినప్పటికీ తీవ్ర గాయాలయ్యాయి. దాంతో అతడిని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి వాహనాల లోపల షార్ట్ సర్క్యూట్ కారణం కావొచ్చని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ మేరకు జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

గ్రూప్-3 పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇటీవల టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలనీ, తొలి రోజు పేపర్-1 పరీక్షకు హాజరైన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను నియామక ప్రక్రియ ముగిసేవరకు భద్రంగా పెట్టుకోవాలని సూచించింది.

'బీసీ డిక్లరేషన్'తో కాంగ్రెస్ వెన్నుపోటు

(మొదటిపేజీ తరువాయి)



మాటలు నీటిమూటల య్యాయని తెలిపారు. నేడు రైతుబంధు, రైతు భరోసా ఏమైందని, పింఛన్లు రూ.4000 ఇస్తామని చెప్పి ఉన్న పింఛను కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. కులగణన పేరుతో ఇంటికి వస్తే ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని తెలిపారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి తీసుకువస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకొచ్చాక మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. బీసీ బిడ్డలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. బీసీ కుల గణన చేయాల్సిందేనని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినాకనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వంపై నమ్మకం లేకనే కులగణనకు వెళ్లిన అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. 60 ఏండ్ల పాటు బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు బీసీ మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయలేని దరిద్రపు చరిత్ర కాంగ్రెస్‌ది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనా చారి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, డాక్టర్ టి. రాజయ్య, నన్నపనేని నరేందర్, మాజీ కుడా చైర్మెన్ సుందర్ రాజు యాదవ్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఇదొక అద్భుతమైన సినిమా : రామ్ చరణ్

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జనవరి 10న గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా లక్నోలో ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు.

రామ్ చరణ్ మాట్లాడుతూ, 'శంకర్ తో కలిసి పని చేయడం అదృష్టం. ఇండియాలో లక్నో చాలా పెద్ద నగరం. ఇక్కడ మనుషుల మనసులు కూడా చాలా పెద్దవి. మా గత చిత్రాన్ని ఇక్కడ పెద్ద మనసుతో ఆదరించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఇక్కడ జరగడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఎస్ జే సూర్య మాట్లాడుతూ.. 'ఇప్పుడు టీజర్‌ను మాత్రమే చూశారు. ఇక అసలు సినిమా ముందుంది. రామ్ చరణ్, శంకర్ కలిసి చేసిన ఈ చిత్రం అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపారు.


అంజలి మాట్లాడుతూ, 'ఇందులో నా పాత్ర విని వెంటనే ఓకే చెప్పాను. చాలా కొత్తగా ఉంటుంది. నాకు ఎంతో ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఈ మూవీ ఒప్పుకోవడానికి రామ్ చరణ్, శంకర్, దిల్ రాజు కూడా కారణం. సంక్రాంతికి ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు.

కియారా అద్వానీ మాట్లాడుతూ, ?'లక్నోలో మా చిత్ర ప్రయాణం ప్రారంభించడం ఆనందంగా ఉంది. నేను ఇక్కడకు రావాలని చాలా రోజుల నుంచి ఎదురుచూశాను. శంకర్ వల్ల ఈ రోజు మేం ఇక్కడకు వచ్చాం. రామ్ చరణ్‌తో మళ్లీ పని చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

దిల్ రాజు మాట్లాడుతూ,'మా ప్రొడక్షన్‌లో 50వ చిత్రమిది. శంకర్ తో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. పైగా అది రామ్ చరణ్‌తో అవ్వడం మరింత సంతోషంగా ఉంది' అని అన్నారు.

నవచిత్రం

ఈ 'డ్రింకర్ సాయి' ఎవరు?



ధర్మ, ఐశ్వర్య శర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ ను డైరెక్టర్ మారుతి లాంచ్ చేశారు. "డ్రింకర్ సాయి" ఫస్ట్ లుక్, టైటిల్ ఇంట్రెస్టింగ్ గా ఉన్నాయని ప్రశంసించిన మారుతి మూవీ టీమ్ కు తన బెస్ట్ విషెస్ అందించారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

ధర్మ, ఐశ్వర్య శర్మ పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేశ్, రాజ ప్రజ్వల్ తదితరులు నటిస్తున్నరు.

'ధూం ధాం'కు సూపర్ రెస్పాన్స్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "ధూం ధాం". ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించారు. దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందించిన ఈ సినిమా ఇటీవల విడుదలై సకుటుంబంగా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

గోపీ మోహన్ మాట్లాడుతూ - మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. యూఎస్ నుంచి కూడా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మంచి సినిమా చేశామని ప్రశంసలు దక్కుతున్నాయి. థియేటర్స్ కు వస్తే తప్పకుండా ప్రతి ఒక్కరూ ఎంటర్ టైన్ అవుతారు' అని అన్నారు.

దర్శకుడు సాయికిషోర్ మచ్చా మాట్లాడుతూ,' ఈ సినిమాకి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అనే పేరు వస్తోంది. రిలీజైన ప్రతి సెంటర్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. నాకు కనీసం వంద ఫోన్ కాల్స్ వచ్చి ఉంటాయి. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, బెనర్జీ, సాయి శ్రీనివాస్ వంటి వారి క్యారెక్టర్స్ చూస్తూ ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు' అని తెలిపారు.

నిర్మాత రామ్ కుమార్ మాట్లాడుతూ, 'పెద్ద సినిమాల పోటీలో "ధూం ధాం" లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. మేము ఇంకా పరుగు స్టార్ట్ చేయలేదు. నిలబడ్డాం అంతే. మా మూవీని ఆడియెన్స్ దాకా రీచ్ చేసిన క్రెడిట్ మీడియా మిత్రులదే. తర్వాత ఓటీటీలో చూద్దాంలే అని అనుకోకుండా ఈ సినిమాను థియేటర్ లో అనుభూతి చెందండి. ఎందుకంటే ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమాను 2, 3 వందల మంది ప్రేక్షకుల మధ్య కూర్చొని చూస్తే బాగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

హీరో చేతన్ కృష్ణ మాట్లాడుతూ - మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల దగ్గర నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మీడియా నుంచి కూడా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. సినిమా చాలా బాగుందంటే తప్ప ఆడియెన్స్ బయటకు రాని ఈ ట్రెండ్ లో మా మూవీకి 70, 80 పర్సెంట్ హౌస్ ఫుల్స్ కావడం సంతోషంగా ఉంది. సినిమాలో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఉంటుందని మేము ముందునుంచీ చెబుతూ వస్తున్నాం. ఆ ఎంటర్ టైన్ మెంట్ కే ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూసి తమ రెస్పాన్స్ చెబుతున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. చూడని వాళ్లు థియేటర్స్ లో చూడమని రిక్వెస్ట్ చేస్తున్నా' అని చెప్పారు

కుర్రాళ్ల తడబాటు

ఉత్కంఠ రేపిన రెండో టీ20లో ఆతిథ్య దక్షిణాఫ్రికా మెరుపు విజయం సాధించింది. వరుణ్ చక్రవర్తి (5/17) ఐదు వికెట్ల మాయజాలంతో 125 పరుగుల ఛేదనలో సఫారీలు 86/7తో ఓటమి కోరల్లో కూరుకున్నారు. కానీ ఆఖర్లో స్టబ్స్ (47 నాటౌట్), కోయేట్జి (19) పేసర్లపై ధనాధన్ మోత మోగించారు. గెలుపు ఖాయం అనుకున్న భారత్‌కు షాక్ ఇచ్చారు. రెండో టీ20లో 3 వికెట్ల తేడాతో సఫారీలు గెలుపొందారు.

- రెండో టీ20లో దక్షిణాఫ్రికా గెలుపు
- వరుణ్ ఐదు వికెట్ల మాయ వృథా
- భారత్ 124/6, దక్షిణాఫ్రికా 128/7

నవతెలంగాణ-పోర్ట్ ఎలిజబెత్

ట్రిస్టన్ స్టబ్స్ (47 నాటౌట్, 41 బంతుల్లో 7 ఫోర్లు), గెరాల్డ్ కోయెట్జి (19 నాటౌట్, 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ మోత మోగించారు. 125 పరుగుల ఛేదనలో దక్షిణాఫ్రికా 15.4 ఓవర్లలో 86/7తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. స్పెషలిస్ట్ బ్యాటర్లలో స్టబ్స్ ఒక్కడే క్రీజులో నిలిచాడు. ఇక సఫారీ పోరాటం ముగిసిందనే అనుకున్నారు. కానీ స్టబ్స్, కోయెట్జి జోడీ అదరగొట్టింది. డెత్ ఓవర్లలో పేసర్లపై విరుచుకుపడింది. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగింది. మరో 6 బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. సఫారీ బ్యాటర్లలో మార్‌క్రామ్ (3), క్లాసెన్ (2), మిల్లర్ (0) నిరాశపరిచారు. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/17) ఐదు వికెట్ల ప్రదర్శనతో మాయ చేశాడు. రెండో టీ20లో దక్షిణాఫ్రికా 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది.



అంతకుముందు, ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య (39 నాటౌట్, 45 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (27, 21 బంతుల్లో 4 ఫోర్లు) రెండో టీ20లో టీమ్ ఇండియాను ఆదుకున్నారు. హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్‌కు తోడు తెలుగు తేజం తిలక్ వర్మ (20, 20 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 124 పరుగులు చేసింది.

టాప్ ఆర్డర్ విఫలం : రెండో టీ20లోనూ టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలో పిచ్ నుంచి పేస్‌కు లభించిన అనుకూలతను సఫారీ పేసర్లు గొప్పగా సద్వినియోగం చేసుకున్నారు. మార్కో జాన్సెన్, గెరాల్డ్ కోయేట్జి, సిమెలానెలు పవర్‌ప్లేలో నిప్పులు చెరిగారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే వరుస మ్యాచుల్లో శతక వీరుడు సంజు శాంసన్ (0)ను మార్కో జాన్సెన్ డకౌట్ చేశాడు. జాన్సెన్ బంతిని మిస్ అయిన సంజు వికెట్ కోల్పోయాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో అభిషేక్ శర్మ (4)ను గెరాల్డ్ కోయేట్జి సాగనంపాడు. సిమెలానె పేస్‌కు సూర్యకుమార్ యాదవ్ (4) వికెట్ కోల్పోయాడు. 15 పరుగులకే టాప్-3 బ్యాటర్లను కోల్పోయిన టీమ్ ఇండియా పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది.

ఆదుకున్న ఆల్‌రౌండర్లు : లోతైన బ్యాటింగ్ లైనప్ లేకపోవటం భారత్‌కు ప్రతికూలమైంది. మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ (20), అక్షర్ పటేల్ (27) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వికెట్ల పతనం ఆగినా.. రన్‌రేట్ సాధారణంగానే ఉండిపోయింది. క్రీజులో కుదురుకుని ఎదురుదాడికి దిగగానే తిలక్, అక్షర్ డగౌట్‌కు చేరారు. టెయిలెండర్ అర్షదీప్ సింగ్ (9 నాటౌట్)తో కలిసి హార్దిక్ పాండ్య (39 నాటౌట్) భారత్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. మరో ఎండ్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్ లేకపోవటంతో పాండ్యకు సైతం పరుగుల వేట కష్టమైంది. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన హార్దిక్.. 45 బంతుల్లో 39 పరుగులు చేశాడు. హార్దిక్ పోరాటంతో భారత్ 20 ఓవర్లలో 124 పరుగులు చేసింది. సఫారీ బౌలర్లు అందరూ ఆశించిన మేరకు రాణించారు

మెక్‌స్వీనీకి పిలుపు

తొలి టెస్టుకు ఆసీస్ జట్టు ఎంపిక



పెర్త్ : భారత్‌తో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టుకు ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టును ఎంపిక చేసింది. భారత్-ఏతో రెండు మ్యాచుల అనధికార టెస్టు సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా సీనియర్ సెలక్షన్ కమిటీ 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. యువ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీకి ఓపెనర్‌గా అవకాశం లభించింది. రెగ్యులర్ ఓపెనర్ మార్కస్ హారీస్‌కు కనీసం జట్టులో చోటు లభించలేదు. స్టార్ పేసర్ పాట్ కమిన్స్ తొలిసారి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కంగారూలకు నాయకత్వం వహించనున్నాడు. జోశ్ ఇంగ్లిస్‌కు తొలిసారి టెస్టు జట్టులో స్థానం ఇవ్వగా..పేసర్ స్కాట్ బొలాండ్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు.

భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు నవంబర్ 22 నుంచి పెర్త్ స్టేడియంలో జరగనుంది. టీమ్ ఇండియా నేడు ఆస్ట్రేలియా పర్యటనకు బయల్దేరనుంది. మ్యాచ్‌కు ముందు పెర్త్ ఓపస్ స్టేడియంలో మూడు రోజుల పాటు సెంటర్ పిచ్‌పై ప్రాక్టీస్ చేయనుంది!.

తొలి టెస్టుకు ఆసీస్ జట్టు :

పాట్ కమిన్స్ (కెప్టెన్), అలెక్స్ కేరీ, జోశ్ హాజిల్‌వుడ్, ట్రావిశ్ హెడ్, జోశ్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్, నాథన్ లయాన్, మిచెల్ మార్ష్, నాథన్ మెక్‌స్వీనీ, స్టీవెన్ స్మిత్, మిచెల్ స్టార్క్, స్కాట్ బొలాండ్.

పాక్ చేతిలో ఆసీస్ చిత్తు

2-1తో వన్డే సిరీస్ పాక్ వశం



పెర్త్ : భారత్ సొంతగడ్డపై స్పిన్‌కు బొల్తా పడినట్టు.. ఆస్ట్రేలియా స్వదేశంలో పేస్‌కు పల్టీ కొట్టింది!. పాకిస్థాన్ పేసర్లు సూపర్ షోతో ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్‌ను సాధించారు. 2017 తర్వాత తొలిసారి కంగారూ గడ్డపై ఆసీస్‌పై వన్డే మ్యాచ్‌లో గెలుపొందిన పాకిస్థాన్ అదే జోరులో వన్డే సిరీస్‌ను సైతం సొంతం చేసుకుంది. ఆదివారం పెర్త్‌లో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో మెరుపు విజయం సాధించింది. పాక్ పేసర్లు షహీన్ అఫ్రిది (3/32), నసీం షా (3/54), హరీశ్ రవూఫ్ (2/24) నిప్పులు చెరిగారు. దీంతో 31.5 ఓవర్లలో ఆస్ట్రేలియా 140 పరుగులకు కుప్పకూలింది. టెయిలెండర్ సీన్ అబాట్ (30), ఓపెనర్ మాథ్యూ షార్ట్ (22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. స్వల్ప లక్ష్యాన్ని పాక్ అలవోకగా ఛేదించింది. అయూబ్ (42), షఫీక్ (37), బాబర్ (28), రిజ్వాన్ (30) రాణించటంతో 26.5 ఓవర్లలోనే 143/2 పరుగులు చేసింది. పాక్ పేసర్ హరీశ్ రవూఫ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను అందుకున్నాడు. మూడు మ్యాచుల్లో ఆసీస్ తరఫున ఏ ఒక్క బ్యాటర్ అర్థ సెంచరీ సాధించకపోవటం గమనార్హం.

వికసించని 'గిరి వికాసం'

అమలుకు నోచుకోని సర్కార్ పథకం

- బీడు భూముల్లో 'బోర్లు' ఎండమావే..
- ఎండుతున్న పంటలు
- పోడు పట్టాపై రుణాలివ్వబోమన్న బ్యాంకర్లు
- ప్రయివేటు అప్పులే దిక్కు
- పట్టించుకోని పాలకులు

2



ఎస్.వెంకన్న

శ్యామల కాంతయ్య, ఊకే లక్ష్మయ్య, సోయం రవి, కురసం నాగేశ్వరరావు, కొడియం కనకయ్య, తాటి లక్ష్మి, కొరసం కన్నయ్య, గట్టుపల్లి కాంతయ్య, కారం మహేశ్..వీరంతా పోడు రైతులు.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చర్ల మండలం సత్యనారాయణ పురం వాస్తవ్యులు. వీరితో పాటు వెయ్యికి పైగా ఎకరాల్లో సాగు చేసుకుంటున్న వందల మంది రైతుల పోడు వ్యవసాయం వ్యథ వర్ణణాతీతం. ఒక్కో రైతు రెండు నుంచి ఐదెకరాల్లో పత్తి, వరి సాగు చేస్తున్నారు. కోత, కాతకొచ్చిన పంటలు ఇప్పుడు సాగు నీరు లేక ఎండిపోతున్నాయి. గిరివికాస పథకం ద్వారా బోరు, మోటార్ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అవి వీరి ధరి చేరలేదు. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పోడు భూములకు నీటి సౌకర్యం కల్పించలేని ప్రభుత్వంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సదరు ఎమ్మెల్యే హామీలను నమ్మి హస్తం గుర్తుకు ఓటేసిన వారే. భద్రాచలం, ఉట్నూరు, ఏటూరు నాగారం, మన్ననూరు..ఐటీడీఏల్లోని పోడు రైతుల బాధలన్నీ ఒకే తీరు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులు ఎవరైతేనేం..వాగ్దానాల ఉల్లంఘనలో ఉద్దండులే. గిరి వికాస పథకం కాగితాల్లో కనపడుతున్న లెక్కలకు, క్షేత్ర స్థాయిలో అమలైన తీరుకు పొంతన లేకుండా ఉందనేది నవతెలంగాణ ప్రత్యక్ష పరిశీలనలో వెల్లడైంది.

పంట చేతికొచ్చే సమయానికి ఎండిపోతుంటే.. గుండె బరువెక్కుతోంది. సాగు నీటి సౌకర్యం లేక నానా తిప్పలు పడుతున్నాం. పోడు భూములకు గిరి వికాస పథకం ద్వారా బోర్లు, మోటార్లు, వాటికి త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి సాగు నీరందిస్తామన్నారు. ఏ ఒక్క రైతుకు ఆ పథకం ద్వారా లబ్ది చేకూరలేదు. గత్యంతరం లేక తాలిపేరు సాగునీటి కాలువ, వాగులు, వంకల్లో అద్దెకు ఆయిలింజన్లు తెచ్చుకుని పంటకు నీరు పెట్టుకుంటున్నాను. పంట చేతికందే వరకు ఎకరానికి రూ.10వేల నుంచి 15వేల వరకు డీజిల్‌కే ఖర్చు అవుతున్నది. ఇతర ఖర్చుల సంగతి తెలియంది కాదని పోడు రైతు కాంతయ్య వాపోయాడు.

సాగునీటి సౌకర్యం లేక చేతికొచ్చిన వరిపంట ఎండి పోయింది.పత్తి పరిస్థితి అదే. పోడు పట్టాతో బ్యాంకులో రుణం తెచ్చుకుందామంటే..ఆ పట్టాకు లోను ఇవ్వటం కుదరదని బ్యాంకర్లు తెగేసి చెప్పారు. పండిన పంటను చేనులోనే అమ్ముతానని దళారుల దగ్గర అప్పు తెచ్చాను. దానికి వడ్డీ పెరుగుతోంది. పెట్టుబడి కూడా ఎల్లే పరిస్థితి లేదు. అప్పు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదని సోయం రవి తన ఆవేదనను వ్యక్తం చేశారు.

అమలుకు నోచుకోని వైనం

ఇది కాంతయ్య, సోయం రవి వ్యథలే కాదు..పోడు రైతులందరి బాధలూ ఇవే. సాగులో వెనుకబడ్డ గిరిజన రైతులను గుర్తించి వారికి ఆర్థికంగా భరోసా కల్పించటంతో పాటు బీడు, పోడు భూములను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా గిరి వికాస పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం గడిచిన ఎనిమిదేండ్లలో వారి దరి చేరలేదు. కాగితాలకే పరిమితమైంది. వాస్తవంగా పోడు భూములపై ఆధారపడి, గిరివికాస పథకానికి అర్హులుగా ఉన్నటువంటి వారు సుమారు 16లక్షలమదికి పైగా గిరిజన రైతులుంటే..గడిచిన ఐదేండ్ల కాలంలో 23,865 మంది రైతులకు మాత్రమే లబ్ది చేకూరటం గమనార్హం. ఇందులో కూడా బోరు వేస్తే మోటారు ఇవ్వలే..మోటారు ఇస్తే త్రిఫేజ్ కరెంటు ఇవ్వలేదని గిరిజనులు వాపోతున్నారు.

గిరివికాసంతోనే బీడు భూముల్లో పంటలు



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గిరివికాసాన్ని సంపూర్ణంగా అమలు చేయాలి. అప్పుడు మాత్రమే బీడు, పోడు భూములకు మోక్షం వస్తుంది. ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. మరో పక్క పంట రుణాలను అందించటం లేదు. పోడు పట్టాలపై లోన్లు ఇచ్చేందుకు బ్యాంకర్లు కొర్రీలు పెడుతున్నారు. దీంతో గిరిజనులు పోడు భూముల్లో పంట ఫలాన్ని అందుకోలేక పోతున్నారు. తక్షణమే గిరివికాసానికి తగినన్ని నిధులు కేటాయించి, లబ్దిదారులకు అవసరమైన బోర్లు, మోటార్లు, త్రీఫేజ్ కరెంట్ సౌకర్యాన్ని కల్పించాలి.

- కారం పుల్లయ్య
ప్రధాన కార్యదర్శి
ఆదివాసి గిరిజన సంఘం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఎండుతున్న పంటలు..

ప్రభుత్వ పథకాలు ధరి చేరకపోవటంతో వాగులు, వంకల్లో ఆయిల్ ఇంజన్ల ద్వారా వ్యవసాయాన్ని చేస్తున్నారు.ఇప్పుడు వాగులు, వర్రెలు ఎండిపోయాయి. పంటలు కూడా ఎండుతున్నాయి. ప్రయివేటు అప్పులు తెచ్చి, వ్యవసాయం చేస్తే..తీరా కాతకాసి, కోతకొచ్చిన పంట ఎండిపోయిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. గిరివికాసం పథకం కింద ప్రభుత్వం బోర్లు, మోటార్లు, త్రిఫేజ్ కంరెంట్ అందిస్తే..ఈ పరిస్థితి దాపురించేది కాదని వారు వాపోతున్నారు. పంట చేతికొస్తే కుటుంబ అవసరాలు చక్కదిద్దుకోవచ్చని ఆశపడ్డ ఆ రైతుల ఆశలు ఆవిరైపోయాయి.

వేసారి పోతున్న రైతులు..

2017 ఏప్రిల్‌లో ప్రవేశ పెట్టిన ఈ పథకం కింద 5 ఎకరాలు, 10ఎకరాల యూనిట్లుగా విభజించి సంబంధిత భూములున్న గిరిజనులకు సాగు నీటి వసతి కల్పించాలి. ఇందుకుగాను బోర్లు వేయించడం, వాటికి విద్యుత్ కనెక్షన్, మోటార్లు సమకూర్చి సాగు నీరు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో బోరుకు రూ. 3లక్షల నుంచి రూ.5లక్షల మేరకు ఖర్చు చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ పథకం కింద వేసిన బోర్లలో సగానికి పైగా ఇప్పటికీ సాగు నీటిని అందించిన దాఖలాలు లేవు. విద్యుత్ కనెక్షన్ కావాలంటూ కొందరు, మోటార్లు ఇవ్వాలంటూ మరి కొందరు.. ఇలా ఐటీడీఏల చుట్టూ తిరిగి తిరగి వేసారిపోతున్నారే తప్ప వారికి ఎలాంటి ఫలితం దక్కలేదు. అయితే 2021 డిసెంబర్ తర్వాత గిరివికాసం పథకం కింద నిధులు మంజూరు లేకపోవటం గమనార్హం.

సీఎంఆర్ఎఫ్ దగా ఖానాలు!

రిజెక్టెడ్ జాబితాలో ఉన్నా చెప్పకుండా మోసం

- బ్లాక్‌లిస్టులో రాష్ట్రవ్యాప్తంగా 76...ఖమ్మంలోనే 21 హాస్పిటల్స్
- రిలీఫ్ ఫండ్‌తో సంబంధం లేని డీఎంహెచ్‌వో
- తెలియక ఆ ఆస్పత్రులకు వెళ్లి నష్టపోతున్న రోగులు
- సీఎంఆర్ఎఫ్ వర్తించదనే డిస్‌ప్లే కోసం డిమాండ్
- శ్రీ వినాయక ఆస్పత్రి వ్యవహారంలో మీడియా ముందుకు బాధితులు





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలోని నిరుపేద రోగుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్‌లో భాగంగా రోగికి అయిన ఖర్చులో 33-50 శాతం నగదును ఆరునెలల లోపు బ్యాంక్ అకౌంట్లలో ప్రభుత్వం జమ చేస్తుంది. ఏ నియోజకవర్గం వారు అక్కడి ఎమ్మెల్యే/ మంత్రి/ ఎంపీ/ ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయాల్లో హాస్పిటల్ ఖర్చు వివరాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మంత్రి కార్యాలయంలో సబ్మిట్ చేస్తే కొంత నగదు (50 శాతం వరకు) ఎక్కువ వచ్చే ఆస్కారం ఉంది. ఎమ్మెల్యే కార్యాలయంలో 33శాతం రీఫండ్ చేస్తారు. ఖర్చు రూ.లక్షల్లో అయినా రూ.60వేలు సీలింగ్ అమల్లో ఉంది. అయితే ఈ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు పక్కదోవ పట్టిస్తుండటంతో సంబంధిత 'దగా'ఖానలను ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 76 ఆస్పత్రులు ఈ జాబితాలో ఉన్నాయి. వీటిలో ఖమ్మం జిల్లాలోనే 21 హాస్పిటల్స్‌ను నిషేధిత జాబితాలో చేర్చారు. కానీ సంబంధిత హాస్పిటల్స్ ఏవో తెలియక రోగుల కుటుంబీకులు మోసపోతున్నారు. తాజాగా ఇలా మోసపోయిన బాధితులు ఖమ్మంలోని శ్రీ వినాయక హాస్పిటల్ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు.

నిషేధిత జాబితాలో ఉన్నా కప్పిపెడుతూ..

రెండేండ్ల కిందట నకిలీ బిల్లులతో సీఎం రిలీఫ్‌ఫండ్‌ను కొన్ని ఆస్పత్రుల నిర్వాహకులు డ్రా చేసినట్టు ఇటీవల పలు హాస్పిటల్స్‌పై సీఐడీ నిర్వహించిన విచారణలో వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలా నకిలీ బిల్లులు చేసిన 76 హాస్పిటల్స్‌ను సీఎంఆర్ఎఫ్ రిజెక్టెడ్ జాబితాలో పొందుపరిచారు. వాస్తవానికి అప్పట్లోనే ఈ ఆస్పత్రులు బ్లాక్ లిస్టులో ఉన్నా గత ప్రభుత్వం ఈ విషయాన్ని వెల్లడించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ జాబితాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రుల క్యాంప్ కార్యాలయాల్లో డిస్‌ప్లే చేసింది. కానీ సంబంధిత హాస్పిటల్స్‌లో మాత్రం ఎలాంటి బోర్డులు లేకపోవడంతో విషయం తెలియక చాలా మంది రోగులు మోసపోతున్నారు. ఆ హాస్పిటల్స్ యాజమాన్యాలు సైతం విషయాన్ని గోప్యంగా ఉంచడంతో పాటు సీఎంఆర్ఎఫ్ ఫార్మెట్‌లో బిల్లులు ఇస్తున్నారు. సీఎంఆర్ఎఫ్‌కు అప్లై చేసేందుకు ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాలకు వెళ్లేంత వరకు నిషేధిత జాబితా విషయం తెలియటం లేదు. ఖమ్మంలో సీఎంఆర్ఎఫ్ బ్లాక్ లిస్టులో ఉన్న పలు ఆస్పత్రులకు అనుమతులు కూడా లేవని తెలుస్తోంది. అయినా డీఎంహెచ్‌వో కార్యాలయం అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పైగా సీఎంఆర్ఎఫ్‌తో తమ కార్యాలయానికి సంబంధం లేదని చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది. కొన్ని హాస్పిటల్స్‌కు అనుమతి లేకున్నా సీఎంఆర్ఎఫ్‌కు ఇచ్చే ఆథరైజేషన్ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతుండటం మరో చర్చకు దారితీస్తోంది.

నిషేధిత బోర్డులు లేకపోవడంతో..

సీఎంఆర్ఎఫ్ నిషేధిత బోర్డులు ఏ హాస్పిటల్‌లోనూ లేకపోవడంతోనే పేషెంట్ల కుటుంబాలు నష్టపోతున్నారనే విషయం స్పష్టమవుతోంది. కాబట్టి ప్రభుత్వం దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని హాస్పిటల్స్ ఆథరైజేషన్ సర్టిఫికెట్‌లను ఎలా ఇస్తున్నాయనే అంశంపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. శ్రీ వినాయక హాస్పిటల్స్ వ్యవహారం ఇటీవల వివాదానికి దారితీసింది. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌కు చెందిన బాధితురాలు బాల నాగమణి ఇటీవల ప్రెస్‌క్లబ్‌లో తనకు జరిగిన అన్యాయంపై మీడియా ముందు వెల్లడించింది. కుటుంబంలో గొడవల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన నాగమణి తొలుత జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది, ఆ తర్వాత ఆర్ఎంపీ సూచనతో శ్రీ వినాయక హాస్పిటల్‌లో జాయిన్ అయింది. నాలుగురోజుల తర్వాత కోలుకున్నావని చెప్పి మరుసటి రోజు డిశ్చార్జి చేస్తామని అన్నారు. సడన్‌గా లివర్ దెబ్బతిందని హైదరాబాద్ తీసుకెళ్లాలన్నారు. అప్పటికే ఆమె వినాయకలో రూ.2.50 లక్షలు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్తే అక్కడ రూ.5 లక్షల ఖర్చు వచ్చింది. సీఎంఆర్ఎఫ్‌కు అప్లై చేసుకుందామని బిల్లుల కోసం అడిగితే తమ బంధువులపై ఆస్పత్రి యాజమాన్యం దాడి చేయించినట్టు నాగమణి ఆరోపించారు. దీనిపై శ్రీ వినాయక హాస్పిటల్ యాజమాన్యం స్పందిస్తూ తమ ఆస్పత్రి సీఎంఆర్ఎఫ్ బ్లాక్‌లిస్టులో ఉన్న విషయం తమకే తెలియదని చెప్పటం గమనార్హం.

వెంకయ్య కుటుంబం అయోమయం..



ఈ ఫొటోలోని ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన రాయబారపు వెంకయ్య (78) ఖమ్మంలోని మ్యాక్స్ కేర్ ఆస్పత్రిలో 2023 మే నెలలో చికిత్స పొందారు. కుడి, ఎడమ కాళ్లకు ఇన్ఫెక్షన్ కావడంతో కుటుంబీ కులు ఆస్పత్రిలో జాయిన్ చేశారు. నాలుగు రోజుల పాటు హాస్పిటల్ ఇన్‌పేషెంట్‌గా వైద్యం తీసుకున్నారు. ఇందుగాను రూ. 70వేల వరకు ఖర్చు వచ్చింది. వెంకయ్య కుటుంబం నిరుపేద వ్యవసాయకూలీలు కావడంతో ఆ మొత్తాన్ని అప్పుతెచ్చారు.

దీనిలో సగం నగదైనా మంజూరవుతాయని మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క కార్యాలయంలో అప్లై చేశారు. కానీ సంబంధిత హాస్పిటల్ నిషేధిత జాబితాలో ఉండటంతో ఆ నగదు మంజూరవుతాయో లేదోనని ఆందోళనతో ఉన్నారు. అయితే వెంకయ్య ట్రీట్‌మెంట్ తీసుకునే సమయంలో ఆ హాస్పిటల్ బ్లాక్ లిస్టులో లేదని చెబుతున్నారు. ఆ ఒక్క ఆశతో వెంకయ్య కుటుంబం డబ్బుల కోసం ఎదురుచూస్తోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.